57401
57402

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

మార్చి 21, 2010

Entered

ప్రాణ జల 'ప్రపంచ' వల

హ్యాపీ బర్త్‌డే

(2010 మార్చి 21 నుంచి
2010 మార్చి 27 వరకు)

జి.అఖిలాష్
3సం॥, మార్చి-22
రేణుక-నరేష్
గోల్కొండ క్రాస్‌రోడ్డు-హైదరాబాద్

జె. స్నేహిత
3సం॥, మార్చి-2007
శ్రీదేవి-బాలశంకర్
బాపట్ల-గుంటూరు

ఎన్. సందీప్ రాజు
8సం॥, మార్చి-14
రమాదేవి-శ్రీనివాసరాజు
మండాది-గుంటూరు

వై.డినేష్ డార్విన్
మార్చి
లావణ్య-గోపీకృష్ణ
శ్రీకాకుళం

బి.అభిమన్యు
3సం॥, మార్చి-2007
విజయ-శేఖర్
చొప్పకట్లపాలెం-ఖమ్మం

కె. విశాల్‌రెడ్డి
1సం॥, మార్చి-25
సంధ్యారాణి-వెంకటరెడ్డి
టంగుటూరు-ప్రకాశం

సిహెచ్. చిన్నారి
2సం॥, మార్చి-2008
కోటేశ్వరి-కొండలరావు
లింగసముద్రం-ప్రకాశం

యం.పావని
1సం॥, మార్చి-2009
శైలజ-మద్దిలేటి
యాపర్ల-మ॥నగర్

ఆర్.వంశీకృష్ణ
మార్చి-22
భారతి-గురుప్రసాద్
ఎమ్మిగనూరు

ఆర్. భవ్య
మార్చి-26
భారతి-గురుప్రసాద్
ఎమ్మిగనూరు

నిఖిల
7సం॥, మార్చి-22
అరుణ-రత్నకుమార్
విశాఖపట్నం

ఎం.శ్రావణి
మార్చి
సుధారాణి-సదానందం

ENTERED

మనలో మాట

బాబాలూ భోగాలూ



ఇది బాబాల కాలంలా ఉంది. బాబాల ప్రస్తావన లేకుండా ఏరోజూ గడవటం లేదు. బాబాలు భజనలకో, భక్తి బోధలకో పరిమితమైతే ఏ గొడవా లేదు. చెప్పేవి శ్రీరంగనీతులు దూరేవి... అన్న రీతిలో వాళ్ల రక్తి ప్రవాహం సాగుతోంది. కామి కానివాడు మోక్షకామి కాడు అన్నాడు వేమన. భౌతిక సుఖాల్లోని మోసం, దగా; సమాజంలోని అంతరాలూ అన్యాయాలూ వేమనని యోగినీ, జ్ఞానినీ చేశాయి. ఇప్పుడు బాబాలది దీనికి పూర్తిగా రివర్సు. సన్యాసం పుచ్చుకున్నాకే వారికి సర్వసుఖాలూ, ఇంద్రభోగాలూ సమకూరుతున్నాయి. దేశంలోని ఒక లెవలు బాబాలందరికీ ఏసి గదులూ, కారులూ సర్వ సాధారణమయ్యాయి. ఆకాశ ప్రయాణాలూ సామాన్యమైపోయాయి. సంసారం ఈదలేక సన్యాసుల్లో కలవడం అనేది ఇక పాత సంగతే! ఇప్పుడు సంసార ప్రయోగాలకు సన్యాసత్వం వేదిక. సన్నాసి అంటే సర్వ భోగ పిపాసి అన్నమాట!

బాబాల భోగ బాగోతాలు, స్వాముల కామ ప్రకోపాలూ ఎప్పటికప్పుడు బయటపడుతూనే ఉన్నాయి. సంతాన స్వాములూ, తాంత్రిక స్వాములూ శ్రీకృష్ణ జన్మస్థానాలను పావనం చేస్తూనే ఉన్నారు. మళ్లీ కొత్త స్వాములు... కొత్త మాయలు... తండోపతండాలుగా జనం! నమ్మేవాడుంటే నట్టేటముంచేయటానికేమి? అన్నాడట వెనకటికొకడు. కాళ్లపై పడి కరుణించమనే పాలకులూ, ఆశీర్వాదాలకోసం బారులు తీరే భక్తులూ ఉన్నంతకాలం బాబాలకు ఎదురులేదు. దేశంలో బాబాల హవా హిమాలయాల్లా ఎదుగుతోంది. అరచేతిలో వటపత్రశాయిని చూపిస్తాడొకడు.. నోటినుంచి శివలింగానికి పురుడు పోస్తాడు ఇంకొకడు.. చూసినవాళ్లూ విన్నవాళ్లూ ఆహో ఓహో అని తలాడించుకుంటూ తన్మయులైపోతారు. కొండొకచో లోపల సందేహం వేధిస్తున్నా దేహం నుంచి బయటికి రాదు. అలాంటప్పుడు మాయాజాలాలకు హద్దూ అంతమూ ఏముంటుంది?

బాబాలు అందరికీ వైరాగ్యం బోధిస్తారు. వాళ్లేమో నిత్యానందులై సుఖిస్తారు. వెళ్లేటప్పుడు మోసుకుపోయేదేం లేదని వేదాంతం చెబుతారు. వేలకొద్దీ ఎకరాలూ, కోట్ల కొద్దీ సంపదా కూడబెడతారు. ఇహలోక సుఖాలు శాశ్వతం కాదంటారు. తాము మాత్రం ఇక్కడే సకల భోగాలూ అనుభవిస్తారు. అసలు గుట్టు ఇతరులకు తెలిసిపోతే అంతం చేయటానికీ వెనకాడరు.

మహానుభావుల మాటలూ, చేతలూ చాలాసార్లు సామాన్యులకు అర్థం కావట! నిత్యానందుడు కూడా తన రాగరంజిత ప్రయోగాలను జనం అపార్థం చేసుకున్నారని భాషించాడు. సరిగ్గా అదే సమయంలో- బాబాలను కొంతమంది కావాలనే అభాసుపాలు చేస్తున్నారని బాబా రామ్‌దేవ్ నొక్కి వక్కాణించాడు.. బాబాల బాగోతాల వెనక గల లోక కల్యాణం ఏమిటో వివరించి, ఉద్ధరించటానికి కాబోలు, ఆయన త్వరలో రాజకీయ పార్టీ పెడతాడట! తెరచాటునే తెగ వెలగబెడుతున్న బాబాలు ఏకంగా ఏలికలైతే.... అంతా భోగమయం.. జగమంతా మాయమయం!

★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
కవిత్వమ్	...	6
న్యాయ సలహాలు	...	7
సీరియల్	...	8
తెలుసుకుందామా	...	12
కూల్‌కూల్‌గా	...	13
అట్టమీది కథ	...	18
విజ్ఞాన వీచిక	...	21
బాలనేస్తాలు	...	22
కథ	...	24
క్రైమ్‌కథ	...	26
అయ్యవారికి చాలు ఐదు వరహాలు... పిల్లవాళ్లకు చాలు పిజ్జా, బర్గర్లు...		27
కొత్త పుస్తకాలు	...	28

ఇంకా...

స్ఫూర్తి ... 4

ఆ అయిదు పుస్తకాలు...



సినిమా కబుర్లు ... 10

విడుదలకు ముందే వణికిస్తున్న పైరసీ పీడ

చూద్దామా ... 16

మొఘల్ గార్డెన్స్ ఓ సుందర లోకం



నారీలోకానికే కానుక

మార్చి 7 స్నేహ సంచికను అంతర్జాతీయ మహిళాదినోత్సవ ప్రత్యేక సంచికగా తీసుకురావడం ఎంతో హర్షించదగినది. దేశాధినేతల ఫొటోలను ఒకేచోట అందించటం బావుంది. మహిళల సాధక బాధకాలు, వారి విజయాలకు తోడు వారు ప్రస్తుతం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఉదహరించడం గమనించాం. ఈ సంచికను మహిళలందరికీ కానుకగా చెప్పుకోవచ్చు. మనలోమాటలో చెప్పినట్లు చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడానికి పురుష ప్రపంచానికొచ్చిన సువర్ణావకాశాన్ని వినియోగించుకొని మహిళాబిల్లును చట్టసభలలో ప్రవేశపెట్టడమే తరువాయి! అభినందనలతో....

నేమాన సుభాష్‌చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

మహిళా జయహో

ఆదివారం ప్రజాశక్తి ప్రత్యేక సంచిక వందేళ్ల అంతర్జాతీయ మహిళా దినోత్సవం విశేషంగా ఆకట్టుకుంది. స్త్రీలు ఈనాడు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా ఉన్నారు. తల్లిగా, భార్యగా, బిడ్డగా, అక్కగా, చెల్లిగా తమ తమ బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తున్నారు. సామాజిక సేవ ఉద్యమాల్లో స్త్రీ పాత్ర చాలా వుంది. దేశ విదేశాల్లోనూ, ప్రభుత్వ ప్రయివేటు రంగాల్లోనూ విధులు నిర్వహిస్తున్నారు. స్త్రీలు ఎక్కడ గౌరవింపబడతారో అక్కడ దేవతలు పూజింపబడతారు. నేర్పు, ఓర్పు, సహనం, త్యాగానికి నిర్వచనం స్త్రీ. చట్ట సభల్లో స్త్రీ పాత్ర ప్రముఖమైనది. శక్తిగా, ఆదిశక్తిగా, కీర్తింపబడుతుంది. వీరమాతగా, వీరపత్నిగా, వీరనారిగా చరిత్రలో నిలిచింది. గ్రామ సర్పంచ్ నుండి రాష్ట్రపతి దాకా దేశానికి సారథ్యం వహిస్తున్నారు. ఈ మధ్య కాలంలో స్త్రీలపై జరుగుతున్న రకరకాల దాడులను మనం అందరం ఖండించాలి. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. అందుకే స్త్రీలను మనం గౌరవించాలి. వారికి విలువ నివ్వాలి. అప్పుడే ఈ సమాజం, దేశం అభివృద్ధి చెందుతుంది. మహిళకు జై. స్త్రీ మూర్తికి జయజయహో.

డి.వై రాజు, గణపవరం,
గుంటూరు.

తనివితీరా చదివాం

మార్చి 7వ తేదీ ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో వందేళ్ల అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తిని ఏ పత్రికా అందించని విధంగా ప్రత్యేక సంచికను అందించినందుకు ముందుగా ప్రజాశక్తి పత్రికకు అభినందనలు తెలియజేస్తున్నాము. రీనా రాసిన 'అణిచేకొద్దీ లేస్తాం' వ్యాసం ఆకట్టుకుంది. 'పనుంటే పండుగ లేకుంటే పస్తులే'లో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వారి కష్టాలను కళ్లకు కట్టినట్లు చెప్పారు. మార్పులు సాధించినా బాధలు తీరలేదు. సి.ఐ.టి.యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.పుణ్యవతిగారితో ఇంటర్వ్యూ బాగుంది. బి. హైమావతి గారి వ్యాసం 'ఒంటరి వ్యథలు' కచ్చితమైన అంకెలతో తెలియజేసింది. మహిళా చట్టాలు, కబళిస్తున్న ట్రాఫికింగ్, విజ్ఞానగతిని మార్చిన వనితలు, చట్టసభల్లో మేం... వ్యాసాలు తనివితీరా చదివాం. అనేక వ్యాసాలు మహిళల స్థితిగతుల్ని గురించి వివరించాయి.

కామిడి శ్రీదేవి, సతీష్‌రెడ్డి,
పరకాల, వరంగల్.

సమస్త సమాచారం

నిద్ర లేచిన మగ ప్రపంచం, ఆడవారికి 33శాతం అధికార రిజర్వేషన్లకు నాంది పలకడం బాగుంది. తల్లిగా, తనయగా, రాజకీయ ప్రతినిధిగా మహిళ ఎదిగిననాడు అమ్మ రాజ్యం వస్తుంది. మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఈ వారం వారికి సంబంధించిన సమస్త సమాచారం ఇచ్చారు. చాలా భేషుగ్గా వుంది. ఇంకా ఎందరో మదర్ థెరిస్సాలు మానవాళికి అవసరం. ఈ రిజర్వేషన్ బిల్లు అమలులోకి వచ్చిననాడు అంతా శుభం జరుగుతుంది.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

చైతన్య పూరితం

వందేళ్ల అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా



ప్రత్యేక సంచిక విడుదల చేసినందుకు అభినందనలు. శ్రామిక మహిళలకు చెందిన వ్యాసాలు, ఇంటి పనివారల గురించి, చట్టాలకు సంబంధించినవి... అన్ని వ్యాసాలూ చైతన్యపూరితంగా వున్నాయి. భూమికోసం, బతుకు బాగు కోసం వ్యాసం పోరాట స్ఫూర్తి గలది. మార్చి 8 శత వార్షికోత్సవం సందర్భంగా సోషలిస్టు మూలాలు రచయిత బృందాకరత్‌కు అభినందనలు. ఈ మధ్య మహిళా ఉద్యమ కారులపై పోలీసులు జరిపిన దమనకాండ ఫొటోలు ప్రచురిస్తే బాగుండేది. బాలకార్మిక రంగంలో కూడా ఆడపిల్లలే ఎక్కువగా వున్నారు. మార్చి 8 మహిళా దినోత్సవ పోరాటం వర్ధిల్లాలి. క్లారాజెట్కిన్‌కు జేజేలు.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.



చల్లచల్లగా...

బనానా షేక్

కావలసిన పదార్థాలు

అరటిపండు - 1
పంచదార - 2 స్పూన్లు
పాలు - 2 గ్లాసులు
జాజికాయ - కొంచెం
రోజ్‌వాటర్ - అరస్పూన్
ఐస్‌ముక్కలు - కొద్దిగా

తయారుచేసే విధానం

అరటిపండు తోలు తీసి ముక్కలు చేసి పాలలో వేయాలి. అందులోనే పంచదార కూడా వేసి మిక్సీలో వేయాలి. బాగా నురగ వచ్చేవరకు బీట్ చేయాలి. తర్వాత దానిపై రోజ్‌వాటర్ చల్లి కొంచెం సేపు ఫ్రిజ్‌లో వుంచాలి. సర్వ్ చేసేముందు గ్లాసులో ఐస్‌ముక్కలు వేసుకుంటే బాగుంటుంది.



కమలా హనీ

కావలసిన పదార్థాలు

కమలా పండ్లు- 2
నిమ్మపండు - 1
తినే సోడా - చిటికెడు
తేనె - 1 స్పూన్

తయారుచేసే విధానం

కమలా పండ్ల పైతోలు తీసి, ఒక బట్టలో వేసి రసం తీయాలి. కమలా రసంలో గింజలు రాకుండా రసం పిండాలి. ఒక స్టీలు గరిటె వేడి చేసి అందులో తేనె పోసి, ఆ తేనెని కమలా రసంలో కలపాలి. దానిలో చిటికెడు తినేసోడా కలిపి ఓ గంటసేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. గ్లాసులో ఐస్‌ముక్కలువేసి ఈ రసాన్ని పోసి సర్వ్ చేయాలి.



చాక్లెట్ మిల్క్‌షేక్

కావలసిన పదార్థాలు

చిక్కటి పాలు - 2 కప్పులు
చాక్లెట్ సిరప్ - అరకప్పు
వెనిల్లా ఎస్సెన్స్ - 1 స్పూన్
పంచదార - 2 స్పూన్లు
ఉప్పు - కొద్దిగా
కోడిగుడ్డు - 1

తయారు చేసే విధానం

స్టీలు గిన్నెలో ఆరు చాక్లెట్లు వేసి వేడి చేస్తే చాక్లెట్లు మెత్తబడి కరుగుతాయి. ఈ కరిగిన చాక్లెట్ రసంమీద అరకప్పు నీరు, ఉప్పు కలిపి కొంచెం చిక్కగా వచ్చేవరకు స్టౌమీద వుంచి తర్వాత దించాలి. దీనిలో వెనిల్లా ఎస్సెన్సు వేసి చల్లారనివ్వాలి. తర్వాత ఒక గంట ఫ్రిజ్‌లో ఉంచి తీసి చల్లటి పాలలో వేసి బాగా గిలక్కొట్టాలి. సర్వ్ చేసే ముందు గ్లాసులో మిల్క్‌షేక్ వేసి పైన పిస్తా పప్పు కూడా వేసుకోవచ్చు.



కోకోనట్ మిల్క్‌షేక్

కావలసిన పదార్థాలు

కొబ్బరిపాలు - 2 కప్పులు
పాలు - 2 కప్పులు
క్రీమ్ - 2 స్పూన్లు
పంచదార - రుచికి తగినంత
రోజ్ ఎస్సెన్స్ - 1 స్పూన్
నల్లద్రాక్ష పండ్లు - కొద్దిగా

తయారుచేసే విధానం

కొబ్బరికాయను పగలకొట్టి కొబ్బరిపాలు తీసుకోవాలి. పాలను మీగడ కట్టకుండా మరగబెట్టి ఎర్రగా, చిక్కగా బాసుంది క్రీములాగా తయారు చేయాలి. ఈ క్రీములో పంచదార, కొబ్బరిపాలు పోసి మజ్జిగ కవ్వంతో బాగా నురగ వచ్చేట్టుగా చిలకాలి. నురగ వచ్చిన తర్వాత రోజ్ ఎస్సెన్స్ వేసి కొద్ది సేపు ఫ్రిజ్‌లో వుంచాలి. సర్వ్ చేసేటప్పుడు పైన నల్లద్రాక్ష వేసుకుంటే బావుంటుంది.

రైస్ డ్రింక్

కావలసిన పదార్థాలు

అన్నం గంజి - 1 గ్లాసు
ఉప్పు - చిటికెడు
నిమ్మరసం - 1 స్పూన్

తయారుచేసే విధానం

మామూలుగా కంటే కొద్దిగా ఎక్కువ నీరు పోసి అన్నం వండాలి. పొంగు వచ్చిన కొద్ది సేపటి తర్వాత ఎక్కువగా వున్న గంజిని ఒక గిన్నెలోకి వంచాలి. ఆ గంజిని చల్లారే వరకు అలాగే వుంచి చిటికెడు ఉప్పు, నిమ్మరసం వేసి ఒక గంట ఫ్రిజ్‌లో పెట్టాలి. ఇది రుచిగా వుండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా మంచిది.



దోసెల పిండి పట్టేటప్పుడు రెండు గ్లాసుల బియ్యం, గ్లాసు మినపప్పు, పావు గ్లాసు సగ్గుబియ్యం కలిపి రుబ్బితే దోసెలు క్రిస్పీగా, రుచిగా వుంటాయి.



కె. సూర్యమణి, రాజమండ్రి

కా॥ పుచ్చలపల్లి సుందరయ్య

భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత

ఆ అయిదు పుస్తకాలు...



'ఏమి చేయాలి?' అన్న గ్రంథం చదివిన తరువాత తమ పూర్తికాలాన్ని విప్లవానికే వినియోగించే వారితో కార్మికవర్గ పార్టీని నిర్మించవలసిన ఆవశ్యకత నాకు స్పష్టంగా బోధపడింది. అలాంటి పార్టీ నిర్మాణానికై పనిచేసినప్పుడు ప్రాప్తకాలజ్ఞతను, ఆర్థికవాదాన్ని అధిగమించి మామూలు వర్గ చైతన్యాన్ని సోషలిస్టు చైతన్యానికి అభివృద్ధి చేయడానికి వీలవుతుంది. ప్రజాసామాన్యంపై పాలక వర్గాలు సాగించే అన్ని రకాల దోపిడీని, పీడనను వ్యతిరేకించి కార్మికవర్గం ఎలా పోరాడాలో ఆ గ్రంథం నాకు బోధించింది. ప్రజల్లోని వివిధ సెక్షన్ల విశ్వాసాన్ని పొంది, వారిని ముందుకు తీసుకొని వెళ్ళడానికి నాయకత్వం వహించవలసిన అవసరాన్ని కూడా ఆ గ్రంథం నాకు నేర్పింది. అలాగే చైతన్య పూరితమైన పార్టీ నిర్మాణాన్ని అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకతను, పాలక వర్గాలకు సంబంధించిన పోలీసు యంత్రాంగం అనుసరించే కుట్రలను, అమలు జరిపే నిర్బంధ చర్యలను అధిగమించేందుకు తగిన ఉక్కు శిక్షణ గలిగిన పార్టీని యేర్పాటు చేసుకోవలసిన అవసరాన్ని అది నాకు బోధించింది.

1929 ఆఖరులో కొంతమంది యువ కాలేజీ విద్యార్థులతో నాకు సంబంధాలు ఏర్పడిన తరువాత నేను మార్క్సు - ఎంగెల్సుల రచన "కమ్యూనిస్టు ప్రణాళిక"ను చదివాను. దాని ప్రభావం నాపై ఎంతగానో పడిన కారణంగా కమ్యూనిస్టు గ్రూపులో చేరి నా యావత్తు జీవితాన్ని 1930 ఆరంభం నుండి కమ్యూనిజం లక్ష్యంకోసం అంకితం చేయాలని నిర్ణయించుకొన్నాను. మార్క్సిస్టు-లెనినిస్టు ప్రామాణిక గ్రంథాలకోసం అన్నిచోట్లా గాలింపు ప్రారంభించాను. ఎందువల్లనంటే ఆ రోజుల్లో ఆ పుస్తకాలు లభ్యంకావడం అతికష్టంగా వుండేది. 1932-33 సంవత్సరాల్లో లెనిన్ గ్రంథాలను కొన్నింటిని నేను చదవగలిగాను. ఆ దశాబ్దం ముగిసేప్పటికల్లా ఇంగ్లీషులో లభ్యమయ్యే లెనిన్ ప్రధానమైన రచనలన్నింటినీ సంపాదించుకొని చదవగలిగాను. వాటిలో ఆనాడు ఏవి నాకు బాగా నచ్చినాయో, ఏవి నాకు మార్క్సిజంలో లోతైన పునాదిని వేసి, నాకు మార్గదర్శకంగా ఉపయోగపడ్డాయో కూడా బాగా జ్ఞాపకం వుంది అవి యివి : "కారల్ మార్క్సు ఉపదేశాలు", "రాజ్యాంగ యంత్రమూ - విప్లవమూ", "ఏమి చేయాలి", "అతివాద కమ్యూనిజం - ఒక బాలారిష్టం", "పల్లెటూరు పేదలకు".

ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థను సమూలంగా నాశనంచేసి, దాని స్థానే శ్రామికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పనిదే శ్రామిక ప్రజలు వర్గరహిత సమాజం వైపుకు పురోగమించడానికి వీలుపడే కమ్యూనిస్టు సమాజాన్ని స్థాపించాలనే ఆశయం నెరవేరదనే దృఢ విశ్వాసానికి "రాజ్యాంగ యంత్రమూ - విప్లవమూ" చదివిన తరువాత నేను వచ్చాను. 'రాజ్యాంగ యంత్రమూ - విప్లవమూ,' 'సోవియట్ ప్రభుత్వ తక్షణ కర్తవ్యాలు,' 'బోల్షివిక్‌లు రాజ్యాధికారాన్ని తమ చేతుల్లో అట్టిపెట్టుకోగలుగుతారా?' అన్న గ్రంథాలు రాజ్యాంగయంత్రానికి సంబంధించిన సిద్ధాంతాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. అలాగే రాజ్యాధికారాన్ని విప్లవాత్మకంగా ఎలా చేబట్టాలన్న విషయంపై చక్కటి అవగాహన ఇస్తాయి.

విప్లవానికి జీవితాలను అంకితం చేసినవారి పార్టీ

'ఏమి చేయాలి?' అన్న గ్రంథం చదివిన తరువాత తమ పూర్తికాలాన్ని విప్లవానికే వినియోగించే వారితో కార్మికవర్గ పార్టీని నిర్మించవలసిన ఆవశ్యకత నాకు స్పష్టంగా బోధపడింది. అలాంటి పార్టీ నిర్మాణానికై పనిచేసినప్పుడు ప్రాప్తకాలజ్ఞతను, ఆర్థికవాదాన్ని అధిగమించి మామూలు వర్గ చైతన్యాన్ని సోషలిస్టు చైతన్యానికి అభివృద్ధి చేయడానికి వీలవుతుంది. ప్రజాసామాన్యంపై పాలక వర్గాలు సాగించే అన్ని రకాల దోపిడీని, పీడనను వ్యతిరేకించి కార్మికవర్గం ఎలా పోరాడాలో ఆ గ్రంథం నాకు బోధించింది. ప్రజల్లోని వివిధ సెక్షన్ల విశ్వాసాన్ని పొంది, వారిని ముందుకు తీసుకొని వెళ్ళడానికి నాయకత్వం వహించవలసిన అవసరాన్ని కూడా ఆ గ్రంథం నాకు నేర్పింది. అలాగే చైతన్య పూరితమైన పార్టీ నిర్మాణాన్ని అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకతను, పాలక వర్గాలకు సంబంధించిన పోలీసు యంత్రాంగం అనుసరించే కుట్రలను, అమలు జరిపే నిర్బంధ చర్యలను అధిగమించేందుకు తగిన ఉక్కు శిక్షణ గలిగిన పార్టీని యేర్పాటు చేసుకోవలసిన అవసరాన్ని అది నాకు బోధించింది. అలాంటి పార్టీ బహిరంగంగానూ, అవసరమైతే రహస్యంగానూ పనిచేయగలిగిన సత్తాను, నైపుణ్యతను పెంపొందించుకోగలిగి వుండాలి. తమ జీవితంలో ప్రతి ఒక్క నిమిషమూ విప్లవాన్ని జయప్రదంగా నిర్వహించడం ఎలాగా అని ఆలోచించి, విప్లవం కోసమే తమ జీవితాలను పూర్తిగా అంకితం చేసి, అందుకోసం అహోరాత్రులు కృషిచేయగలిగిన విప్లవకారులను తగినంత మందిని తయారుచేసుకోవలసిన ప్రాధాన్యతను కూడా నాకు ఆ గ్రంథం ప్రబోధించింది. పార్టీకోసం పూర్తికాలం లేదా కొంత భాగం పనిచేసే సభ్యులందరికీ తగిన సలహాలిచ్చి వారి కార్యక్రమాలను సమన్వయం చేయగలిగే కర్తవ్యాన్ని ఆ విప్లవకారులు నిర్వహించాలి (పార్టీలో పనిచేసే సభ్యులు, పనిచేయని సభ్యులు అంటూ వుండటానికి వీలులేదు). మనకు వ్యతిరేకమైన రాజకీయ ధోరణి గలవారి కంట్రోలులో వున్నప్పటికీ వివిధ ప్రజా సంస్థల్లో పనిచేయవలసిన ఆవశ్యకతను ఆ గ్రంథం నాకు నేర్పింది. అలాంటి సంస్థల్లో పనిచేస్తూ, జనసామాన్యంతో సన్నిహిత సంబంధాలను వుంచుకుంటూ ఉమ్మడి కోర్కెల లక్ష్యాల ప్రాతిపదికపై ఐక్యపోరాటాల్లోకి వారిని తీసుకొనిరావాలి.

విప్లవానుభవాల సర్వస్వం

'అతివాద కమ్యూనిజం - ఒక బాలారిష్టం' అన్న గ్రంథంలో కామ్రేడ్ లెనిన్ దశాబ్దాలుగా సాగిన కార్మికవర్గ విప్లవోద్యమాల మహత్తర అనుభవాన్ని క్రోడీకరించి తద్వారా గుణపాఠాలను దీసి, కమ్యూనిస్టు పార్టీలు మితవాద - అతివాద స్వభావంగల అన్ని అవకాశధోరణులకు వ్యతిరేకంగా ఎలా పోరాడాలో విశదీకరించి, విప్లవ ఉద్యమాన్ని ముందుకు తీసుకొని వెళ్ళడానికి వివిధ రకాలైన సున్నితమైన

ఎత్తుగడలను ఏ విధంగా అనుసరించాలో వివరించాడు. విప్లవానుభవాలకు ఆ గ్రంథమొక సర్వస్వంలాంటిది. దానిని ఎన్నిసార్లు చదివితే అంత ఉపయోగంగా ఉంటుంది.

పల్లెటూరు పేదలకు

"పల్లెటూరు పేదలకు" అన్న గ్రంథంలో కామ్రేడ్ లెనిన్ శ్రామికవర్గ విప్లవానికి కార్మిక-కర్షకుల సన్నిహిత మిత్రత్వం ఎంతగా అవసరమో మామూలు రైతుకు కూడా అర్ధమయ్యే విధంగా బహుచక్కగా వివరించారు. అతిక్లిష్టమైన మార్క్సిస్టు-లెనినిస్టు దృక్పథాలను విశాలమైన ప్రజా సామాన్యానికి ఎలా సుబోధకం చేయాలో తెలపడానికి ఇదొక నమూనా గ్రంథమని చెప్పవచ్చు. లెనిన్ రాసిన ఈ గ్రంథం ద్వారానే పల్లె సమాజంలో వర్గ విభజన ఎలా అభివృద్ధి చెందుతున్నదీ నేను నేర్చుకున్నాను. కార్మికవర్గంతో పల్లెటూరు పేద ప్రజలు (వ్యవసాయ కార్మికులు, పేదరైతులు) ఐక్యమై మధ్యతరగతి రైతాంగంతో దృఢమయిన మైత్రిని నెలకొల్పుకొని, ధనిక రైతులు తమ ఊగిసలాటను అధిగమించేటట్లు సాగిన విప్లవ ప్రథమదశలో సామ్రాజ్యవాదానికి, ప్యూడలిజానికి వ్యతిరేకంగా వారిని కలుపుకొని రావలసిన ఆవశ్యకతను ఆ గ్రంథంలో ఆయన వివరించారు. అదేసమయంలో ధనిక రైతాంగంతోనే పల్లెటూరు పేదలు పోరాటాలను సాగించుకోవలసి వుంటుంది. మన విప్లవం సోషలిస్టు దశలో వున్నప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో మన పోరాటాన్ని ధనిక రైతాంగానికి వ్యతిరేకంగా సాగించవలసివుంటుంది.

వ్యవసాయ సమస్య - లెనిన్ బోధనలు

1938లో మా రాష్ట్ర కమిటీలో మాకు కలిగిన తీవ్రమైన సందేహాలు, ఆ తరువాత 1948లో తెలంగాణా పోరాటం సందర్భంగా రైతాంగంలో వర్గీకరణ సమస్యపైనా, మన ఉద్యమానికి ఏ సెక్షన్‌కు చెందిన రైతాంగాన్ని ప్రధానంగా ఆధారం చేసుకోవాలన్న సమస్యపైనా వచ్చిన తీవ్రమైన సందేహాలు ఇప్పుడు నాకు జ్ఞాపకం వస్తున్నాయి. ఆ సమయంలో జరిగిన చర్చల సందర్భంలో మేము వ్యవసాయ సమస్యపై కామ్రేడ్ లెనిన్ రచనలను మళ్ళీ మళ్ళీ అధ్యయనం చేశాం. ఆ చర్చలు ఈ సమస్యపై మా అవగాహనను ఇతోధికం చేసుకోవడానికి ఎంతగానో దోహదపడినాయి.

మొట్టమొదటి గ్రూపుగా మనపార్టీ ఏర్పడి ఈనాటికి యాభై యేండ్లు గడిచినప్పటికీ, కామ్రేడ్ లెనిన్ తన మొదటి రచనల్లో చేసినట్లుగా మన పార్టీ ఇంతవరకూ గ్రామీణ ప్రజలను వర్గీకరించలేకపోవడం దురదృష్టకరమైన విషయం. మనదేశంలోని శ్రామికవర్గ విప్లవోద్యమంలోని ప్రధానమైన వైఫల్యమేమంటే నగరాల్లోనూ, పల్లెలలోనూ మనం జరిపే కృషిని సమన్వయపరచుకోలేకపోవడమే. కార్మికవర్గంతో, రైతాంగ ప్రజలతో కలిసి వుమ్మడి ఉద్యమాన్ని అభివృద్ధి చేసుకొంటే కనీసం కొంతకాలంలోనైనా ప్రాథమికంగా కార్మికవర్గానికి రైతాంగానికి మధ్య ప్రాథమిక ఐక్యతను నిర్మించగలం.

నాపై అయిదు గ్రంథాల ప్రభావం

కామ్రేడ్ లెనిన్ రాసిన ఈ అయిదు గ్రంథాలు నన్ను అత్యంతగా ఆకర్షించి నాపై శాశ్వతమైన ప్రభావాన్ని కలుగచేశాయని నేనంటున్నానంటే దాని అర్థం కామ్రేడ్ లెనిన్ రాసిన ఇతర ముఖ్యమైన సిద్ధాంత రాజకీయ గ్రంథాలకు, రచనలకు, ప్రసంగాలకు ద్వితీయ ప్రాధాన్యత నిస్తున్నానని ఎవరూ భావించరాదు. 'ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రసీ యొక్క రెండు ఎత్తుగడలు' అన్న గ్రంథం లేదా 'పెట్టుబడి విధానం అత్యున్నత దశ సామ్రాజ్యవాదం' అన్న గ్రంథం ఇలాగే యితర గ్రంథాలూ, రచనలు యిచ్చే మహోన్నతమైన సిద్ధాంత పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకోకుండా మార్క్సిజాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం ఎవరికైనా సాధ్యమా? మానవ చరిత్ర అంతటిలో వున్న అత్యున్నతమైన విజ్ఞాన సంపదనంతటినీ అధ్యయనం చేసి మానవాభ్యుదయానికి ఉపయోగించ ప్రయత్నించిన మార్క్సు, ఎంగెల్సుల మహోన్నతమైన వారసత్వాన్ని కామ్రేడ్ లెనిన్ ముందుకు తీసుకొని వెళ్ళాడు. ఆ విధంగా ఆయన మార్క్సిస్టు - లెనినిస్టు సిద్ధాంత ఆచరణలను అభివృద్ధిపరచాడు. లెనిన్ మహనీయుడు మనకు విడిచిపెట్టి వెళ్ళిన ఆ మహోన్నతమైన విజ్ఞాన సంపదను మరల మరల అధ్యయనంచేసి, లెనిన్ ఆశయాలను సఫలీకృతం చేయడంలో అవసరమైనంతగా కృషి చేయడంలో విఫలమవుతున్నామనేది నా విచారమంతా.

స్పష్టంగా నా మనస్సులో పడిన మరో ప్రభావమేమంటే అత్యంత క్లిష్టమైన విప్లవ వెల్లువ సందర్భంగా పరిణామాలు ఎలా అభివృద్ధి అవుతాయనే విషయంలో లెనిన్ వెల్లడించిన అభిప్రాయాలు. 1905లోని ఆయన రచనలు, విదేశాలనుండి ఆయన రాసిన లేఖలు, 1917 ఏప్రిల్ - అక్టోబరు రోజుల్లో ఆయన చేసిన రచనలు ఇవన్నీ చదివి నేను అత్యంతగా ఆకర్షింపబడ్డాను. రాబోయే పరిణామాలను గురించి లెనిన్ ఎంత సరిగ్గా అంచనా వేయగలడో, ఆ పరిణామాలకు అనుగుణ్యంగా పార్టీకి, ప్రజలకు తగిన నాయకత్వం యిచ్చి, విప్లవాన్ని జయప్రదం చేయడంలో ఎంతటి రాజకీయ నైపుణ్యతను ప్రదర్శించగలడో ఆ రచనల వలన విదితం కాగలదు.

లెనిన్ పతాకం కింద

లెనిన్ శతజయంతి ఉత్సవం జరుగుతున్న నేడు భారతదేశంలో మనం జనతా ప్రజాస్వామ్యం కోసం, సోషలిజం కోసం జరుగుతున్న పోరాటంలో ఒక క్లిష్టమైన కర్తవ్యాన్ని ఎదుర్కొంటున్నాం. మనమూ, మన ప్రజలూ తీవ్రమైన నిర్బంధాలను అనుభవించాల్సి వుంది. అనేక త్యాగాలను చేయవలసి వుంది. మార్క్సిజం-లెనినిజం పతాకం కింద ప్రజలు రక్షణకోసం ఎలా పోరాడాలో వియత్నాంలోని మన కామ్రేడ్స్ మనకు చూపెడుతున్నారు. సామ్రాజ్యవాదులకూ, వారి తొత్తులకూ వ్యతిరేకంగా ప్రపంచ వ్యాపితంగా జరుగుతున్న ఈ పోరాటంలో లెనిన్ రచనల అధ్యయనం, మన నిత్యజీవితంలో ఆయన జీవితాన్ని అనుసరించడం యివే మనకు నిజమైన మార్గదర్శకం కావాలి. లెనిన్‌ను అనుసరించడం మనం ఎంత ఎక్కువగా నేర్చుకుంటే, అంత అధికంగా మనం లెనిన్ ఆశయాలను సఫలీకృతం చేయగలిగిన సమర్థతను సంపాదించుకోగలం.

(మార్క్సిస్టు మహోపాధ్యాయుడు, ప్రథమ సోషలిస్టు రాజ్యస్థాపకుడు అయిన లెనిన్ మహనీయుని శతజయంతి సందర్భంగా 'పీపుల్స్ డెమోక్రసీ' పత్రిక ప్రత్యేక సంచికలో కామ్రేడ్ సుందరయ్య రాసిన వ్యాసం నుంచి...)

★

"పల్లెటూరు పేదలకు" అన్న గ్రంథంలో కామ్రేడ్ లెనిన్ శ్రామికవర్గ విప్లవానికి కార్మిక-కర్షకుల సన్నిహిత మిత్రత్వం ఎంతగా అవసరమో మామూలు రైతుకు కూడా అర్థమయ్యే విధంగా బహుచక్కగా వివరించారు. అతిక్లిష్టమైన మార్క్సిస్టు-లెనినిస్టు దృక్పథాలను విశాలమైన ప్రజా సామాన్యానికి ఎలా సుబోధకం చేయాలో తెలపడానికి ఇదొక నమూనా గ్రంథమని చెప్పవచ్చు. లెనిన్ రాసిన ఈ గ్రంథం ద్వారానే పల్లె సమాజంలో వర్గ విభజన ఎలా అభివృద్ధి చెందుతున్నదీ నేను నేర్చుకున్నాను. కార్మికవర్గంతో పల్లెటూరు పేద ప్రజలు (వ్యవసాయ కార్మికులు, పేదరైతులు) ఐక్యమై మధ్యతరగతి రైతాంగంతో దృఢమయిన మైత్రిని నెలకొల్పుకొని, ధనిక రైతులు తమ ఊగిసలాటను అధిగమించేటట్లు సాగిన విప్లవ ప్రథమదశలో సామ్రాజ్యవాదానికి, ప్యూడలిజానికి వ్యతిరేకంగా వారిని కలుపుకొని రావలసిన ఆవశ్యకతను ఆ గ్రంథంలో ఆయన వివరించారు.



కవిత్వమ్

మండుటెండగా...!



ఎండ యెండగా
జీవితమంతా
మండుటెండగా
సెగ తగిలి వుంటాడు
కమిలి వుంటాడు
కాలి వుంటాడు
కాసేపు నీడలోనో
చల్లని గాలిలోనో
సేద తీర్చుకోనివ్వండి!
నడిచి నడిచి
అలసి వుంటాడు కదా!
ఎదురు దెబ్బలు
రాళ్ల దెబ్బలు
కాలం దెబ్బలు
ఎడా పెడా
తగిలి వుంటాయి కదా!
కొంచెం సేపు
నది ఒడ్డున
కూర్చోనివ్వండి
దోసిలి నిండా
నీళ్లు తాగనివ్వండి
వర్షాకాలంలో ఎక్కడున్నాడో
శీతాకాలంలో ఎంత వొణికాడో
ఈ రాత్రిపూట
అరుగు మీదికి చేరాడు
పొద్దున్నే లేచి వెళ్తాడు
ఒక పక్కన నిద్రపోనివ్వండి!
కొందరు దూరాన్ని చూసి
వెనక్కి తిరిగిపోయి వుండొచ్చు
కొందరు దారిని చూసి
భయపడిపోయి వుండొచ్చు
కొన్ని చోట్ల
పరిమళాలు మతిపోగొట్టొచ్చు
ఏదో మైలురాయి దగ్గర నిలబడి
సంభాళించుకోనివ్వండి!
కొంతదూరం వెళ్లాక
ఆకలి ఎదురుతిరిగి వుండొచ్చు
కొన్ని కలలు
పాముల్లా వెంటాడొచ్చు
కొన్ని భ్రమలు
కాళ్లకు చుట్టుకొనుండొచ్చు
ఎంతసేపు వుంటాడో వుండనీ!
చెట్టుకు వీపు నాన్చి
ఆలోచించుకోనివ్వండి!
అయోమయంగా వున్నాడని
బెదరగొట్టకండి
మీద మీదికెళ్లి
నిరుత్సాహ పరచకండి
పరిశీలన చేసుకున్నవాడు
దారి విడిచి పోలేడు
మనసు కుదుట పడేవరకు
అరికాళ్ల బొబ్బలు చూసుకోనివ్వండి!
కొంతసేపు వేచి చూడండి
విసుక్కుంటే
విమర్శించుకుంటూ కూర్చుంటే
చివరి వరకు
ఎవరు మిగులుతారు?

- ఆశారాజు

మసకేసిన మందహాసం



పంటకాలవ పారుతూ
నడకలో పోటీ పడలేని
నన్ను చూసి నవ్వుకుంది
హరిత విప్లవ బాటలో అది
భవిత భయంతో నేను!
అంతవరకు నీటిపై
ఆడుకుంటున్న చేపపిల్లలు
అలికిడికి తత్తరపడి
అడుగున దాక్కున్నాయి
నా కదలికను క్రీగంట వీక్షిస్తున్నాయి!
గట్టు నీడన గ్రాసానికి మాటువేసిన
మండుకాల బెకబెకగీతం
కోరస్‌గా ఎగిసిపడింది
నిద్రించే వరుణిడికి అది సుప్రభాతం!
అంతవరకు శాఖాహారులై
జపం చేసిన కొంగలు
చేపల్ని చూశాక మాంసాహారులై
తపస్సులు చాలించాయి!
మేమెప్పుడూ మాంసాహారులమేనంటూ
కాకులు అవిశ్రాంతంగా
గెనాలపై పరిశ్రమిస్తున్నాయి!
నీళ్లను తాకిన కాళ్లు
ఘర్మ జలాన్ని జ్ఞప్తిస్తున్నాయి!
మొక్కల వొంటిపై
ముత్యాలై మురిపించిన మంచు బిందువులు
కరిగి నిమజ్జనమౌతున్నాయి!
వేసిన ఎరువును మేసిన కలుపు మొక్కలు
ఆంబోతులై వెలిశాయి!
గాలి శ్రుతిమించి వీస్తుంటే
నెలలు నిండిన వరి
ఊగలేక ఊగుతూంది!
గాలి నీరు మట్టి పైరు సంగమించి
వెదజల్లిన పరిమళం మనసుకు
మంచి గుబాళింపులా వుంది!
నిండు చూలాలు నీ ఎదుటనిల్చి
పచ్చని చిరునవ్వుతో స్వాగతిస్తే
మసకేసిన మందహాసమా నీ స్పందన?
ప్రశ్నించింది పైరుతల్లి
పగపట్టిన ప్రకృతి
పంట దిగుబడి దక్కనిస్తుందా?
నిట్టూర్చింది నా దరహాసం!

-అడిగోపుల వెంకటరత్నమ్

పత్రాలు లేకుండా అమ్మొచ్చా?

ఒక స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు లేవు. ఆ స్థలంలో45 సంవత్సరాల క్రితం ఇల్లు కట్టారు. ఇప్పుడు ఆ స్థలం అమ్మాలంటే డాక్యుమెంట్లు లేవు. అది అమ్మడానికి మేం ఏంచేయాలి? ఒకే స్థలాన్ని కొన్ని సంవత్సరాలు వాడాక అంటే (పెంటదిబ్బ)గా వాడిన ప్లేస్ డాక్యుమెంట్లు లేవు. ఇప్పుడు అది వాల్యుబుల్ ప్లేస్ అయింది. అమ్మాలి అంటే ఏం చేయాలి. చుట్టుపక్కల ఇళ్లు కూడా వున్నాయి.

గ్రామాల్లో వారసత్వంగా వున్న భూములకు, ఇళ్లకు దాదాపు ఎటువంటి పత్రాలు వుండవు. ఇంటికయితే ఇంటిపన్ను, భూములకైతే శిస్తు రసీదులుంటాయి. పట్టాదారు పాసు పుస్తకాలుంటే రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. అమ్ముకోవచ్చు. ఖాళీస్థలమైనా వారసత్వంగా వచ్చి వుంటే అదే వివరిస్తూ అనుభవ హక్కుతో వున్న స్థలం అని రాసి హద్దులు నిర్ణయిస్తే వారసత్వంగా వచ్చిన ఆస్థి అని వివరించి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు.

న్యాయం కావాలి?

ఒకతను మొదటి భార్య చనిపోతే రెండవ వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు ముగ్గురు పిల్లలు, రెండవ భార్యకు ముగ్గురు పిల్లలు. అతనికి 12 ఎకరాల ఆస్థి వుంది. ఆ ఆస్థిని వారికి ఎలా పంచాలి. వాళ్లను సఖ్యతగా ఎలా వుంచాలి. మీ సలహా ఏమిటి?

భార్యలు ఇద్దరు అయినా రెండవ భార్యగా చట్టంలో గుర్తింపు లేకున్నా వారి పిల్లలలకు వాటా వుంటుంది. పెద్ద భార్య పిల్లలకు వున్న అన్ని హక్కులు, సమాన వాటాలు రెండవ భార్య సంతానానికి కూడా వుంటుంది.

జి ఎల్ నరసింహారావు,
అడ్వకేట్,
3-4-778 నుండి 780/1,
బి-002, ప్రసాద్ ఎన్‌క్లేవ్,
బర్కత్‌పురా రోడ్, హైదరాబాద్
ఫోన్: 9848994240

రిజిస్టర్ చేయమంటే ఎలా?

ఒక ప్లేస్‌ను కొన్ని సంవత్సరాల క్రితం అమ్మారు. దానిని రిజిస్టర్ చేయలేదు. అయితే వాళ్లు రిజిస్టర్ చేయమన్నారు. కానీ వాళ్లు మా స్థలం మాకు కావాలని అడుగుతున్నారు. అయితే అది సాధ్యమా?

అమ్మిన తర్వాత అన్ని హక్కులు కొన్నవారికే సంక్రమిస్తాయి. దాని మీద అమ్మిన వారికి ఎటువంటి హక్కులు వుండవు. కాకపోతే రిజిస్ట్రేషన్ చేయలేదు కావున సామరస్యంగా అడిగి సాధించుకోవాలి. లీగల్‌గా సాధించలేరు. కోర్టుకెళ్లి అతను రిజిస్ట్రేషన్‌కు డిక్రీ పొందగల్గుతాడు.

స్థలం అమ్మాక రేటు పెరిగితే....

ఒక స్థలం అమ్మి 13 సంవత్సరాలు అయింది. అయితే దానికి రిజిస్ట్రేషన్ చేయలేదు. ఇప్పుడు ఆ స్థలం రేటు చాలా పెరిగింది. అంటే ఇప్పుడు డిమాండ్ చేయవచ్చా. రిజిస్ట్రేషన్ చేయడానికి మీ సలహా ఏమిటి?

స్థలం అమ్మిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవడం కొన్నవారి విధి. లేదంటే ఇలాంటి పరిణామాలు ఎదుర్కొనవలసి వస్తుంది. నైతికంగా అమ్మినవారికి మరల డబ్బులు అడిగే హక్కు వుండదు. కానీ సమయం దాటిపోయి వుంటే ఇలాంటి తిప్పలు కొన్నవారికి తప్పవు. అమ్మినవారికి అగ్రిమెంట్ కాగితం వుంటే అనుభవ దారుగా లేకుంటే మూడు సంవత్సరాల లోపే రిజిస్ట్రేషన్ చేయమని అడిగే హక్కు వుంటుంది. ఆ తర్వాత వుండదు. మీ విషయంలో అనుభవ దారుగా ఎవరు వున్నారో వివరించేలేదు. మీరు డబ్బులు డిమాండ్ చేసినా కొన్నవారికి ఇవ్వక తప్పని పరిస్థితే! ★





సీరియల్

జరిగిన కథ:

హావ్ ఇంటివైపుగా వచ్చిన తొత్తులు రొయ్యలు తీసుకుందామని అనుకుంటారు. కానీ వారి వద్ద సరిపోను డబ్బులు లేకపోవడం వల్ల వెనుకాముందాడతారు. అప్పుడు హావ్ డబ్బులు వద్దని కొన్ని రొయ్యలు పెడుతుంది. అవి తీసుకుని వాళ్లు వెళ్లిపోతారు. వారిలో ఒకరి భార్యకు హావ్ గతంలో ప్రసవం చేసింది. దానికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతాడు. 'వారు చాలా పేదవాళ్లు. అందుకే సైనికులుగా చేరారు. కానీ ఇప్పుడు మరింత పేదవాళ్లయ్యారు. వారు బయటపడడానికి మనం సహాయం చేయాలి' అని డువాంగ్ చెప్పుంది. తర్వాత కాసేపట్లో హావ్ దళ సభ్యులకు భోజనం వండుతుంది. అందరూ తిన్నాక వారు కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. హావ్ మామయ్య వల కుట్టుకుంటూ వారికి కాపలా కాస్తుంటాడు. దళ సభ్యుల్లో ఒకరు జంగ్ హావ్ కూతురు ఆడుకుంటుంటే చూసి సంతోషపడతాడు. ఇంతలోనే ఏదో గుర్తుకు వచ్చి విచారపడతాడు. ఆ తర్వాత ...

మూలం: **బుయ్‌డక్ ఆయ్**

9వ భాగం

తెలుగు: **కొల్లి సత్యనారాయణ**

వియత్నాం గెరిల్లా

కొంచెంసేపు ఉండి పైప్ కాల్చుకోవడానికి బయటికి వెళ్లాడు.

"అల్లరి చేసి అన్న నిద్రను చెడగొట్టావ్" అని పాపను కోప్పడ్డాను.

"ఫర్వాలేదు. నిద్ర రావడం లేదు" అని పాప కోసం చేతులు చాపాడు.

"అన్న దగ్గరకు వెళ్లు ఎత్తుకుంటాడు" అంటూ పాపను నెమ్మదిగా అతని దగ్గరికి నెట్టాను.

పాపను ఎత్తుకుని, అటూ ఇటూ వూపి, తల మీద ముద్దు పెట్టుకున్నాడు.

పాపను నాకు తిరిగి అందిస్తూ, "ఈ ఈడు అబ్బాయి నాకూ వున్నాడు" అని చెప్పాడు.

"నీ భార్య, పిల్లలు ఎక్కడ వుంటున్నారు?" మౌనంగా వుండిపోయాడు. కాన్వాస్ మీద ఒక మూల కూర్చున్నాడు. "తల్లి లేదు. మా అమ్మకు అప్పగించాను" అన్నాడు కొంచెం సేపు ఆగి.

ఆశ్చర్యపడ్డాను. పూర్తి వివరాలు తెలుసుకుందామని అనుకున్నాను. నేలవంక, సముద్రం వంక మార్చి మార్చి చూస్తూ మౌనంగా వుండిపోయాడు.

"నా భార్య చనిపోయింది" అన్నాడు క్లుప్తంగా.

"నేను ప్రతిఘటనోద్యమంలో చేరిన కొత్తలో ఫ్రెంచి పోలీసులు తొత్తులతో కలిసి మా ఇంటికి వచ్చారు. నా ఆచూకి చెప్పమని బాధించారు. కుండలు బద్దలు కొట్టారు. ఆహార ధాన్యాలలో కిరోసిన్ పోశారు. బూతులు తిడుతూ ఇల్లంతా చిందరవందర చేశారు. సామానులన్నీ విరగ్గొట్టారు. ఎన్ని చేసినా నా భార్య సహనం కోల్పోలేదు. ఒక తొత్తుగాడు మంచంలో వున్న పసిపిల్లవాణ్ణి బూటుకాలితో దొర్లించాడు. నా భార్య రెచ్చిపోయి తిట్టింది. వాళ్లు కొట్టారు. చీర, రవిక చింపేశారు. జుట్టు పీకారు. ఒళ్లంతా రక్కారు. గింజుకున్నా, బతిమాలినా ఆ నీచులు వదల్లేదు. పది మంది పడి తమ కామతృష్ణ తీర్చుకున్నారు. దానితో ఆమె చనిపోయింది" అని క్లుప్తంగా గద్గదస్వరంతో చెప్పాడు. ఆ మాటలు విని నేను కృంగిపోయాను. నా విషయం గుర్తుకు వచ్చి సిగ్గుపడ్డాను. ఇంకేమీ అడగటానికి ధైర్యం చాల్లేదు. దుఃఖభారంతో కృంగిపోయినట్లున్నాడు. వుండలేక లోనికిపోయి పడుకున్నాడు.

కొవాంగ్ టెంపుల్ గ్రామం నుండి వస్తున్న బండి దగ్గరికొస్తుంది. ఆ బండి కోసం బీచ్‌లో చాలాసేపటి నుండి ఎదురు చూస్తున్నాను. ఆత్రుతతో రుమాలు ఊపాను. అస్తమించబోతున్న సూర్యకిరణాలు పడి ఆ బండి చక్రాలు మెరుస్తున్నాయి. బలిసిన నల్లని గుర్రం ఆ బండిని వేగంగా లాగుతోంది. నా ముందుగానే వెళ్లిపోయింది. హాయ్ బండిని వెనక్కు తిప్పి తోలుకొచ్చాడు. ఖాళీ బండిని లాక్కొచ్చినందుకు గుర్రం నిలబడి ఇసుకను కాళ్లతో ఈడుస్తోంది.

హాయ్ బండి దిగి...

"పని జరుగుతుందా? వాళ్లు వచ్చారా?" అని ఆత్రుతతో అడిగాడు.

"ఆ వచ్చారు. నీ కోసం ఎదురు చూస్తున్నాం. లోనికి వచ్చి కాసింత సేపు విశ్రాంతి తీస్కో. టీ తాగి వెళ్దాం"

హాయ్ లోనికి వచ్చి, చెర్నాకోల ఊపుతూ "హావ్ కొద్ది నిమిషాల క్రితం, బ్రిడ్జి దగ్గర వున్న శిబిరంలోని సైనికులు ఎక్కడికెళ్తున్నావని నన్ను అడిగారు. ప్రయాణీకులను తీసుకురావడానికి 'సావో' బీచ్‌కి వెళ్తున్నానని చెప్పాను. వాళ్లు నిజంగా కరువుతో చస్తున్నారు. తాడుకట్టిన పెద్ద బుట్టను డాబాపై నుండి కిందికి వేలాడదీసి కొంత డబ్బు, కనీసం పావలా అయినా యిమ్మని అడిగారు. నా దగ్గర ఇప్పుడు డబ్బు లేదు. ఈ సారి వచ్చినప్పుడు ఇస్తానని' చెప్పాను. అందులో ఒకడు తుపాకి నా వైపు గురిపెట్టి, 'ఇస్తావా లేక కాల్చమంటావా?' అని గద్దించాడు. అయితే అందులో సగం హాస్యం కూడా లేకపోలేదు. అప్పుడు కొన్ని నోట్లు ఇవ్వడానికి అంగీకరించాను" అంటూ చెప్పాడు.

మట్టి కొట్టుకున్న అతని కాళ్ల వంక చూస్తూ "ఇంతకు ముందు నిన్ను చూసినట్లుందే" అని అన్నాడు మామయ్య.

హాయ్ టీ తాగి నవ్వుతూ "తాతా! నన్ను మర్చిపోయావా? నెల రోజుల క్రితం ఒకనాటి రాత్రి ఇక్కడకు వచ్చాను".

'ఆ! ఇప్పుడు గుర్తుకొచ్చింది' మామయ్య అతని దగ్గరకు వెళ్ళి "ఆ రాత్రి చాలా ఇబ్బంది పడ్డావు కదా?" అని అడిగాడు.

"ఆ విషయం మరచిపోండి. మీకు చాలా రుణపడి వున్నాను" బయలుదేరమని హాయ్‌ని తొందరపెట్టసాగాడు.

'ట్రువాంగ్', 'జంగ్', నేను ముగ్గురం కలిసి దగ్గరకు వెళ్లాం. బండి యెక్కబోయే ముందు,

'పాపా, తాతయ్యతో ఇంటి దగ్గర ఆడుకో"

"సరే, అమ్మా"

ముగ్గురం బండిలో కూర్చున్నాం. బండితోలుతూ

"సైనిక శిబిరం దగ్గర ఎవరూ మాట్లాడకండి. నేను సమాధానం చెబుతాను, అని 'హాయ్' సలహా ఇచ్చాడు. సరేనన్నట్లు తలూపాం. చెర్నాకోల చెళ్లుమంది. బండి ముందుకు సాగింది. సముద్రంలోకి పొడుచుకు వచ్చిన కొండ పక్కగా బండిపోతుంది. కొవాంగ్ టెంపుల్ గ్రామంలో కొందరు దళ సభ్యులు రాతి బండ మీద కూర్చుని వున్నారు. మమ్మల్ని చూసి చేతిలో వున్న రంగు గొట్టాల్ని ఊపారు. చీకటి పడబోతూ వుంది. దూరంగా ఎర్రని సైనిక శిబిరాలు కనబడుతున్నాయి. 'సావో' బీచ్ అంతకంతకూ దూరం అవుతోంది. 'హీవ్‌మీ'కి వెళ్లే కంకరరోడ్డు దగ్గర పడుతోంది. ఆ ప్రాంతంలో వున్న కంకరరోడ్డు అది ఒక్కటే. బండి రోడ్డు ఎక్కింది. రోడ్డు మీద దొర్లి బండి చక్రాలు శబ్దం చేస్తున్నాయి. 'హాయ్' తన రెండు కాళ్లు ముందు కమ్మీలపై పెట్టి ముందు కూర్చున్నాడు. చేతిలో చెర్నాకోల వుంది. పరీక్షగా ముందుకే చూస్తున్నాడు. ప్రతిదాన్ని జాగ్రత్తగా పరికిస్తున్నాడు. నాకుమల్లేనే అతనికి కూడా ఇది మొదటి అనుభవం. ఆదుర్దాతోపాటు ఉత్సాహంగా వున్నాడు. ఆ రోడ్డు అతనికి బాగా పరిచయం. శత్రువులు ఎక్కడ వుంటారో? ఎలా ప్రవర్తిస్తారో కూడా తెలుసు. ఆత్మవిశ్వాసంతో పాటు ధైర్యం కూడా వుంది. సంవత్సరం పొడవునా అవమానాలకు గురై అణచబడి ప్రతీకారం కోరుతున్న ఆ బీదవాని మనస్సు ఊహలతో ఉరకలు వేస్తూ వుంది.

ఇంతకుముందు మాదిరిగా నేను వంటరితనం అనుభవించడం లేదు. చుట్టూ అనేక మంది స్నేహితులు ఇప్పుడు వున్నారు. ఆనాటి కార్యక్రమం నాకు కొత్త శక్తినిచ్చింది. గత కొద్ది రోజులుగా వర్షం పడుతూ వుండటంతో రోడ్డు కడిగినట్లుగా వుంది. తదేక దృష్టితో రోడ్డు వంక చూస్తున్నాను. గాలి బాగా వీస్తోంది.

మిగిలిన ఇద్దరు ప్రకృతి దృశ్యాలను తిలకిస్తున్నారు. ఆ ప్రాంతాన్ని పరిచయం చేసుకుంటున్నట్లుగా ఆ చూపులు వున్నాయి.

'హీవ్‌మీ'లో పండ్ల చెట్లు ఎక్కువగా ఉంటాయంటారు. నిజమేనా అని అడిగాడు 'జంగ్'.

"అవును, చాలా వున్నాయి"

'ట్రువాంగ్ మధ్యలో కల్పించుకొని, "జంగ్ ఈ ప్రాంతంలో వుండాలనుకుంటున్నాడు. అతనికి మంచి పిల్లను ఏమన్నా చూస్తావా?" అన్నాడు.

నేను నవ్వి వూరుకున్నాను.

"నీకు పెళ్లి చేసుకోవాలని వుంటే అడుగు. నా విషయం ఎందుకు?" అన్నాడు జుట్టు సవరిచుకుంటూ 'జంగ్'.

"తిరిగి పెళ్లి చేసుకోవాలని లేదు, అవునా?" అడిగాడు 'ట్రువాంగ్'.

"అదికాదు అలా నేను నిర్ణయం చేసుకున్నాను"

'ట్రువాంగ్' హాస్యమాడటం మానటంతో సంభాషణ ఆగిపోయింది. ఆ సంభాషణ 'జంగ్'కు బాధ కలిగించినట్లుగా వుంది. మధ్యాహ్నం అతనిలో జరిగిన సంభాషణలోనూ, ఇప్పుడు ఆ యువకుడు తన కుటుంబ విషయాలలో చాలా బాధపడుతున్నట్లు కనపడింది.

బండి రోడ్డు దిగింది. రెండుపక్కల ఎత్తుగా పెరిగిన 'సావో' చెట్ల కిందుగా బండిపోతోంది. ఆకాశాన్ని చీకటి కమ్మింది. ఖాళీ వరి పొలాల నుండి వస్తున్న పొగ మంచు గాలిలో తేలియాడుతుంది. 'హాయ్' బండిని ఆపి దీపం వెలిగించి తన పక్కన, బండికి కట్టాడు.

"కొద్ది నిమిషాలలో మొదటి శత్రు శిబిరం దాటబోతున్నాం" అని నేను హెచ్చరించాను.

చెట్ల మధ్య నుండి బండి బయటికి రాగానే 'సావో' ట్రీ సైనిక శిబిరం నుండి వెలుగు కనబడుతోంది. కొద్దిసేపట్లో దాని దగ్గరకు చేరుకున్నాం.

"మెదలకుండా వుండండి. వాళ్లు అడిగినదానికి నేను సమాధానం చెబుతాను అన్నాడు 'హాయ్'.

"ఎవరక్కడ? 'హాయ్' బండేనా?" అన్న కేక శిబిరం నుండి వినిపించింది.

"అయ్యా! నేనే సావో బీచ్ నుండి తిరిగి వస్తున్నా"

"బండిలో ఎవరున్నారు?"

" పట్నానికి పోతున్నవాళ్లు "

"తినటానికి ఏమన్నా తెచ్చావా?"

"కొన్ని ఎండు రొయ్యలు వున్నాయి" అని చెప్పి వాళ్లకి కొన్ని యివ్వు అన్నా నెమ్మదిగా.

'హాయ్' గొణుగుతున్నట్లు నటిస్తూ

"కొద్దిగా ఎండు రొయ్యలు వున్నాయి. కావాలంటే యిస్తాను" అన్నాడు.

వాళ్లు సంతోషంతో చప్పట్లు కొట్టారు.

"ఎండు రొయ్యలా?" అని ఒకడు అరిచి, "బుట్ట జారవేస్తా అందులో వెయ్యి"

"సరే"

శిబిరం పై భాగం నుండి వాళ్లు తాడుగట్టిన చిన్న బుట్ట కిందకు జారవేశారు. హాయ్ బండి దిగి వెళ్లాడు.

"బుట్ట కనపడిందా? అందులో పావలా వుంది. రొయ్యల కింద తీసుకో" అని ఒకడు శిబిరం పైనుండి కేక వేశాడు.

"బుట్టలో పావలా లేదు"

"అరే ఎక్కడో పడిపోయి వుంటుంది"

"ఫర్వాలేదులే. డబ్బు ఇవ్వొద్దులే"

'హాయ్' బుట్ట తీసుకొని బండి వద్దకు వచ్చాడు రొయ్యలతో బుట్ట సగానికి నింపాడు. పైకి లాక్కోమని చెప్పగానే వాళ్లు బుట్టను లాక్కున్నారు. రొయ్యల్ని చూసుకొని,

"మంచిది వెళ్లండి" అన్నాడు ఒకడు.

'హాయ్' తిరిగి వచ్చి, బండిలో కూర్చుని గుర్రాన్ని గట్టిగా కొట్టాడు. బండి వేగంగా శిబిరం దాటి పోయింది. కొంతదూరం వెళ్లాక మా సంతోషం ఆపుకోలేక పోయాం. అందరి కంటే 'ట్రువాంగ్' ఎక్కువగా సంతోషించాడు.

"శత్రు ఆక్రమిత ప్రాంతంలో చాలా కాలం పనిచేశానుగాని, ఇటువంటి వాళ్లను ఎక్కడా చూడలేదు. వీళ్ల ప్రవర్తన వింతగా వుంది. సుంకం వసూలు చేయమని ఎవరు చెప్పారు?"అని అడిగాడు.

"ఒకళ్ల నుండి ఇంకొకరు నేర్చుకున్నారు" 'హాయ్' భుజాన్ని 'జంగ్' తట్టి తాతా అని పిలుస్తున్నారు విన్నావా?"

"అంతమాత్రాన నేనంటే ఇష్టం అని అనుకోబాకు. ఏదన్నా వాళ్లకిస్తే అలాగే పిలుస్తారు. ఏమీ బాడుగ దొరకని నాడు వాళ్ల మాట పెడచెవిన పెట్టి పోతుంటే తిడతారు. రౌడీ మూకలతో తగాదా పెట్టుకునే తీరిక నాకు లేదు."

అంతా ఒక్కసారి ఫక్కున నవ్వారు. ప్రయాణం చేస్తున్నంతసేపు ఉషారుగా వుంది. మరో అరగంటకు బ్రిడ్జ్ ఎండ్ దగ్గర వున్న శత్రు శిబిరం వద్దకు చేరాం. అక్కడ కూడా అలాంటి అనుభవమే కలిగింది. వాళ్లంతా చీట్ల పేక ఆడుతున్నారు. అరుస్తున్నారు.

(ఇంకా వుంది) ★

విడుదలకు ముందే వణికిస్తున్న పైరసీ పీడ

సినిమాల విడుదలకు ముందే అందులోని సన్నివేశాలతో ఎక్కడపడితే అక్కడ పైరసీ సీడీలు వచ్చేస్తున్నాయి. ఆ మాటకొస్తే ఈ పైరసీ పీడ తెలుగు చిత్ర సీమలోనే కాదు, తమిళం, హిందీతో సహా దేశంలోని పలు చిత్ర పరిశ్రమలకూ ఇదో రోజువారి తలనొప్పిగా తయారైంది. సరిగ్గా సినిమా తీయడం ఒక ఎత్తైతే, విడుదల తర్వాతే కాకుండా, విడుదలకు ముందు కూడా ఆ చిత్ర సన్నివేశాల పైరసీ సీడీలు రాకుండా జాగ్రత్తపడడం మరో ఎత్తైంది. ఇటీవలి వరకు పైరసీ అనేది సినిమా విడుదలయ్యాకే వ్యాప్తిలోకి వచ్చి, వసూళ్లను దెబ్బదీసేది. కానీ, తాజా పరిస్థితి మారిపోయింది. చిత్రం విడుదల కావడానికన్నా ముందే ఏకంగా ఎడిటింగ్, రీ - రికార్డింగ్ వగైరా పోస్ట్ ప్రొడక్షన్ పనుల దశలోనే పైరసీకి గురవుతోంది. అటు ఇంటర్నెట్‌లోనూ, ఇటు మార్కెట్‌లోనూ దొంగతనంగా ఆ సినిమా, సీడీలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చేయడం పెరుగుతోంది.

రిలీజ్‌కు ముందే నెట్‌లో!

2009లో 'ఈనాడు, ఏక్‌నిరంజన్, 2010 యుగాంతం' వగైరా చిత్రాల పైరసీ సీడీలు సినిమా విడుదలకు కొద్ది ముందుగా విపణిలో విక్రయానికి ప్రత్యక్షమయ్యాయి. అయితే శరత్‌కుమార్ తాజా చిత్రం 'జగ్గూభాయ్' విడుదలకు ఏకంగా కొన్ని వారాల ముందే ఈ జనవరిలో ఇంటర్నెట్‌లో దర్శనమిచ్చి, కలవరం పుట్టించింది. ఎడిటింగ్, రీ-రికార్డింగులు పూర్తి కాని రఫ్ కట్ రూపం వేల కొద్దీ పైరసీ సీడీలుగా తయారై, మార్కెట్‌లోకీ వచ్చేసింది. యావత్ చిత్ర పరిశ్రమా వులిక్కిపడేలా చేసింది. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో నటులు శరత్ కుమార్, రాధిక దంపతులు నిర్మించిన 'జగ్గూభాయ్' రిలీజ్‌కు ముందే పైరసీకి గురికావడంతో తమిళ చిత్ర పరిశ్రమ ప్రముఖులు సమావేశమై, ఇలాంటి సమస్యలను అరికట్టే మార్గం ఏమిటని మంతనాలు జరిపారు. మరోపక్క ఇదే సమయంలో, హిందీ చిత్రం 'తేరా క్యా హోగా జానీ' కూడా హాళ్లలో రిలీజ్‌కు ముందే నెట్‌లో రిలీజైపోయింది. తుది రూపం తయారు చేయడానికన్నా ముందే ఇలా తన సినిమా నెట్‌లో లీకవడంతో చిత్ర దర్శకుడు సుధీర్ మిశ్రా దిగ్భ్రాంతికి గురయ్యారు. విమర్శకుల ప్రశంసలు పొందిన 'హజారోం ఖ్వాయిషే ఐసీ, ధారవి, చమేలీ' తదితర చిత్రాల దర్శకుడిగా, సినీ రచయితగా సుధీర్ మిశ్రాకు పేరుంది. విడుదలకు ముందే సినిమా చూసేయాలన్న ఆత్రంతో కొందరు, పైరసీ సీడీలు అమ్ముకునేందుకు మరికొందరు ఇటు 'జగ్గూభాయ్'ని, అటు 'తేరా క్యా హోగా జానీ'ని నెట్‌లో నుంచి భారీఎత్తున డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఓ అభిమాని ద్వారా తన సినిమా నెట్‌లో ఉందన్న సంగతి తెలుసుకున్న శరత్ కుమార్ చివరకు అమెరికాలోని సదరు ఇంటర్నెట్ సంస్థను సంప్రదించి, ఇంటర్నెట్‌లో నుండి తమ సినిమాను తొలగింపజేయాల్సి వచ్చింది. కానీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కొన్ని వేల సంఖ్యలో 'జగ్గూభాయ్' పైరసీ సీడీలు మార్కెట్లోకి వచ్చేశాయి.

గత అనుభవాలు

మొత్తం మీద ఈ తాజా సంఘటనలతో దేశవ్యాప్తంగా సినీ దర్శక, నిర్మాతలు నిర్మాణంలో ఉన్న తమ చిత్రాల భద్రత గురించి మల్లగుల్లాలు పడుతున్నారు. నిజానికి గతంలోకూడా ఇలాంటివే కొన్ని సంఘటనలు జరిగాయి. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ నటించిన 'జల్సా' చిత్రంలోని ఓ పాట దృశ్యాలు ఎడిటింగ్ దశలోనే నెట్‌లో దర్శనమిచ్చాయి. ఆడియో విపణిలో విక్రయానికి రాక ముందే, కొన్ని సినిమాల పాటలు (ముఖ్యంగా పెద్ద హీరోల, ప్రముఖ సంగీత దర్శకుల చిత్రాల్లోని పాటలు) నెట్‌లో వినిపించడం కూడా జరిగింది. ఫొటోలకు కూడా పైరసీ సెగ తాకింది. రజనీకాంత్ 'శివాజీ' చిత్రీకరణ అతి రహస్యంగా జరుగుతుండగానే ఆ చిత్ర ఫొటోలు అనధికారికంగా నెట్‌లో వచ్చేశాయి. 'ఒక్కమగాడు'లో బాలకృష్ణ పోషించిన వృద్ధపాత్ర తాలూకు గెటప్‌ను చివరిదాకా గోప్యంగా వుంచుదామని దర్శక నిర్మాత భావించినా, ఆ సంకల్పం నెరవేరలేదు. ఆ గెటప్ తాలూకు ఫొటోలు నెట్‌లో అనధికారికంగా ప్రత్యక్షమయ్యేసరికి, వాటిని తొలగింపజేయటానికి ఆ చిత్ర నిర్మాణ కార్యనిర్వాహకులు కష్టపడాల్సి వచ్చింది.

పరోక్షంగా పెద్దలూ భాగస్వాములే!

పైరసీ ఎంతగా ఊడలు వేసుకుందో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. సాక్షాత్తూ ప్రముఖులు సైతం తమ అవసరార్థం పైరసీ సీడీల మీదే ఆధారపడుతున్నారంటే ముక్కున వేలేసుకోవాల్సిందే! అంతెందుకు! 'చంద్రముఖి' తమిళ రూపం చెన్నైలో 800 రోజులకు పైగా?! ప్రదర్శితమై కొత్త రికార్డు సృష్టించిన సందర్భంగా ఉత్సవం జరిగింది. తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి ఆనాటి సభలో మాట్లాడుతూ, 'సినిమా చూసిన తర్వాతే ఇలాంటి వుత్సవాల్లో పాల్గొని, మాట్లాడడం నాకు అలవాటు. ఎందుకనో, ఈ చిత్ర నిర్మాత ఈ సినిమా నాకు చూపించలేదు. చివరకు మీలో చాలా మంది ఇంట్లో చూసే పద్ధతిలోనే(!) నేను కూడా ఈ సినిమా చూశానంటూ అసలు సంగతి చెప్పకనే చెప్పారు. దీన్నిబట్టి సామాన్యులు మొదలు, సర్కారీ పెద్దలు, సినీ ప్రముఖుల దాకా పైరసీ ఎలా పాకిందో అర్థం చేసుకోవచ్చు. ఒక రకంగా పరిశ్రమలోని వారే పైరసీ చీడపురుగును తెలిసో, తెలియకో పెంచి పోషిస్తున్నారని చెప్పవచ్చు.

పరిశ్రమలోనే ప్రీ రిలీజ్ పైరసీకి దోవలు

తాజాగా వచ్చిపడ్డ 'ప్రీ రిలీజ్ పైరసీ' అనేది ఒక రకంగా సాంకేతికత విసిరిన పెను సవాలు. ఒకప్పుడు సినిమా చిత్రీకరణ మొదలు పోస్ట్ ప్రొడక్షన్ దాకా అంతా రీళ్ల మీదే జరిగేది కాబట్టి అప్పుడు ఇలాంటి ఇబ్బందులకు అవకాశం వుండేది కాదు. కానీ, ఇప్పుడు ఆద్యంతం డిజిటల్ వ్యవహారంగా మారడంతో, డిస్కులోని సినిమాని ఏదశలోనైనా సరే పైరసీ చేయడం చాలా సులభంగా మారిపోయింది. చలనచిత్ర నిర్మాణమనేది ఎంతో మంది వ్యక్తుల సమిష్టి కృషి. అంతమంది వ్యక్తుల చేతులమీదుగా ఈ ఉత్పత్తి తయారు కావాల్సి ఉంటుంది కాబట్టి ఆ క్రమంలో భద్రత అంతంత మాత్రమే కాబట్టి విడుదలకు ముందే సినిమానుపైరసీ చేయడానికి వీలు చిక్కుతుంది. ఇవాళ 'జగ్గూభాయ్' ఎదుర్కొన్న సమస్య, రేపు మన భారీ తెలుగు చిత్రాలకు ఎదురుకాదని చెప్పలేం.

ఒక్కసారి చిత్ర నిర్మాణ ప్రక్రియను గమనిస్తే ఏ భాషలోనైనా సరే సినిమా రూపకల్పన క్రమం మొత్తం పరస్పర విశ్వాసం మీద ఆధారపడి నడుస్తుంది. కథాంశం ఎంపిక దగ్గర నుంచి చిత్రీకరణ వరకు ప్రతి ఒక్కటీ దర్శకుడు, అతని బృందం కనుసన్నల్లో సాగుతుంటుంది. ఆ పైన దృశ్యచిత్రీకరణలో ఎక్స్‌పోజ్ చేసిన నెగటివ్‌ను కడిగించి, వన్‌లైట్ ప్రింట్ వేస్తారు. ఇలా నెగిటివ్‌ను ప్రాసెస్ చేసి, ప్రింట్ వేయడానికి ఫిల్మ్ లేబరేటరీకి పంపిన దగ్గర నుంచీ ఏమైనా జరగవచ్చు. ఇలా రూపొందిన రఫ్ ప్రింట్ సినిమా తుది రూపాన్ని ఖరారు చేసే సాంకేతిక నిపుణులు, ఫిల్మ్‌ను గ్రేడ్ చేసే కెమెరా సిబ్బంది, సౌండ్ ఎఫెక్టులను చేర్చే నిపుణులు, డబ్బింగ్‌లో రీరికార్డింగ్‌లో సహాయపడే టెక్నీషియన్లు, ఫైనల్

మిక్సింగ్‌కు నేతృత్వం వహించేవారు. ఇలా ఎంతోమంది చేతుల్లో ఫిల్మ్ ప్రయాణిస్తుంది. ఒకరిమీద ఒకరికి నమ్మకంతోనే వివిధ దశల్లోని ఈ పనులన్నీ నడుస్తుంటాయి. అయితే, ఈ దశల్లో ఏ ఒక్కరైనా నమ్మకద్రోహానికో, అక్రమ ధనార్జనకో, పగ తీర్చుకోడానికో పాల్పడితే సినిమా పైరసీ సులభంగా జరిగిపోతుంది.

"డబ్బింగ్, ఎఫెక్ట్స్, రీరికార్డింగ్‌లకు మేము సినిమాను ఇస్తుంటాం. కానీ, ఏదైనా సమస్య తలెత్తితే వాళ్లదే బాధ్యతంటూ ఈ స్టూడియోల్లో వేటితోనూ మేము ఒప్పందాలు కుదుర్చుకోవడం లేదు. ఈ దశల్లో ఎక్కడైనా సినిమా లీకైతే, అందుకు ఆ స్టూడియోల వారినే బాధ్యుల్ని చేయాలి" అని దర్శక నిర్మాత, నటుడు చేరన్ అభిప్రాయపడ్డారు. 'జగ్గూభాయ్' సైతం పోస్ట్ ప్రొడక్షన్ దశలోనే బయటికి లీకైందని ఆ చిత్ర దర్శకుడు కె.ఎస్. రవికుమార్ భావిస్తున్నారు.

నిజానికి, వీడియో పైరసీ విషయంలో మనకన్నా తమిళనాడు ప్రభుత్వం ముందే మేల్కొంది. 'గూండాల నిరోధక చట్టం'లో భాగంగా వీడియో పైరసీని కఠిన శిక్షార్హమైనదిగా చేస్తూ, తమిళనాడు ప్రభుత్వం 2004లోనే చర్య చేపట్టింది. ఆ మేరకు తమిళనాడులో పైరసీని అడ్డుకునేందుకు కృషి జరిగింది. ఆ కృషి కొంతమేరకు సఫలీకృతమైంది. కఠిన శిక్షలకు ఆస్కారం వుండడంతో తమిళనాట తమిళ చిత్రాల పైరసీ చాటుమాటుగానే తప్ప, మన రాష్ట్రంలో తెలుగు చిత్రాల లాగా యథేచ్ఛగా సాగడం లేదన్నది వాస్తవం. అయితే, ఇప్పుడు ఎడిటింగ్ సైతం పూర్తిగాని, సెన్సారింగైనా జరుపుకోని చలనచిత్రం నెట్‌లో ప్రత్యక్షం కావడం అందరినీ నివ్వెరపరిచింది. "పరిశ్రమలోని వారే కొందరు ఈ అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు" అని హీరో రజనీకాంత్ కుండబద్దలు కొట్టారు. ఈ ఇంటి దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించడమే కాక, మరింత కట్టుదిట్టంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

కోట్లాది రూపాయల ఖర్చుతో కష్టపడి సినిమా తీసిన నిర్మాతకూ, వివిధ ప్రాంతాల్లో పంపిణీకి ఆ సినిమాను కొన్న బయ్యర్లకూ ఈ పైరసీ అపార నష్టం కలిగిస్తోంది. అయితే అదింతటితో ఆగడంలేదు. నటుడు, దర్శక, నిర్మాత కమల్ హాసన్ మాటల్లో చెప్పాలంటే, "ఈ సినిమా పైరసీ ద్వారా సమకూరిన సొమ్ము చివరకు తీవ్రవాదుల చేతుల్లోకి వెళుతోంది. ఆ రకంగా దేశద్రోహులకు అది ఆర్థికంగా అండదండగా మారుతోంది. పైరసీ డీవీడీల ద్వారా సమకూరుతున్న సొమ్ము అటు ప్రజలకూ ఉపయోగపడదు. ఇటు మంచి పనులకూ తోడ్పడదు. ఆ డబ్బంతా తీవ్రవాదుల చేతుల్లోకి వెళ్లి, ముంబయ్ పేలుళ్ల లాంటి విధ్వంస కార్యకలాపాలకు ఉపకరిస్తోంది. ఇప్పుడున్న నియమ నిబంధనల్లో బోలెడన్ని లోపాలున్నాయి. అందుకే,



పైరసీదారులు తప్పించుకుపోవడానికి వీలవుతోంది. కాబట్టి, సినిమా పైరసీ దారులను దేశద్రోహం కింద శిక్షించేలా కొత్త చట్టాన్ని తీసుకురావాలి" అని పేర్కొన్నారు. తీవ్రవాదులకు ఈ సినిమా పైరసీ తోడ్పడుతున్న విషయాన్ని విస్తృత ప్రచారం చేసి, ప్రజల్లో చైతన్యం కలిగించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

దొంగ సీడీలను ఆపేదెలా?

మారిన సాంకేతికతతో వచ్చిపడ్డ ఈ ముప్పును ఎలా అడ్డుకుంటామన్నది ప్రశ్న. మహారాష్ట్ర ప్రభుత్వం లాంటివి అటు పైరసీ సీడీలను అమ్మేవారితో పాటు కొనేవాళ్లను సైతం శిక్షించేలా చట్టాలు చేశాయి. అలాంటి చట్టాలు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు లాంటి వాటిలో ఇంకా రానేలేదు. పైపెచ్చు, పైరసీ సీడీలు మార్కెట్లోకి వచ్చేసిన తర్వాత మొక్కుబడిగా ఒకటీ అరా కేసులు పెట్టి, ఏ కొందరినో అరెస్టు చేసి చేతులు దులుపుకోవడం వల్ల ఉపయోగం లేదు. అసలు చిత్ర నిర్మాణ దశ నుంచి సినిమా హాల్లో ప్రివ్యూ సమయంలో మొబైల్ ఫోన్లనూ, ఇతర ఎలక్ట్రానిక్ సాధనాలనూ అనుమతించరు. అలాంటి చర్యల వల్ల కూడా పైరసీని కొంతవరకు అరికట్టవచ్చు.

కాగా, ఇటీవలి సూపర్ హిట్ చిత్రం '3 ఇడియట్స్' దర్శక నిర్మాతలైతే తమ సినిమా విడుదలైన 90 రోజుల కల్లా తామే తమ చిత్రం ఒరిజినల్ కాపీని 'యూ ట్యూబ్'లో పెడతామని ప్రకటించారు. ఈలోగా అస్పష్టమైన దొంగ సీడీలు చూస్తూ, చిత్రాన్ని దెబ్బ తీయవద్దని కోరారు. ఆ మాటకొస్తే, సినిమా రిలీజుతో పాటే ఒరిజినల్ సీడీలు, డీవీడీలను సైతం విపణిలోకి విడుదల చేయడం ద్వారా దర్శక నిర్మాతలు పైరసీ ఇబ్బందిని కొంతమేర అరికట్టవచ్చని ఓ భావన ఉంది. హాలీవుడ్‌లో ఈ సూత్రాన్ని ఇటీవల కొందరు హిందీ చిత్రాల వారు కూడా అనుసరిస్తున్నారు. దక్షిణాది చిత్ర పరిశ్రమ మాత్రం ఇంకా ఈ ప్రయోగం చేయడానికి జంకుతోంది.

సినిమా విడుదలైన ఏడాదికి గానీ హిట్ చిత్రాల వి.సి.డి.లు, డి.వి.డిలను విపణిలోకి అధికారికంగా విడుదల చేయరాదని ఓ నిబంధన వుంది. అయితే మారుతున్న పరిస్థితుల రీత్యా ఆ నిబంధనలను మార్చాలని కొందరు కోరుతున్నారు.

"పైరసీ బెడద పెరిగిపోతున్నందు వల్ల ఏడాది తర్వాత సినిమా అసలు సీడీలను విడుదల చేస్తే, ఆ హక్కుదార్లకు లాభించదు. కాబట్టి, సినిమా విడుదలైన 100రోజులకే హిట్ చిత్రాల ఒరిజినల్ సీడీలను అధికారికంగా విడుదల చేయడానికి వీలు కల్పిస్తూ, నిబంధనలను మార్చాలి" అని సినీ మార్కెటింగ్ వ్యవహారాలను నిశితంగా అధ్యయనం చేస్తున్న శిరీష్ అభిప్రాయపడ్డారు.

ఇంటి దొంగల్ని పట్టే ఈశ్వరుడు

సినిమా విడుదలైన తర్వాత హాళ్లలో ఎక్కువగా జరిగే పైరసీ మాట అటుంచితే, విడుదలకు ముందే పోస్ట్ ప్రొడక్షన్ దశలోనే ఆరంభమవుతున్న పైరసీని ఎలా అడ్డుకోవాలి? "పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఎవరు పడితే వారు ఫిల్మ్ వ్యవహారం చూడకుండా నియంత్రణలు పెట్టాలి. క్లోజ్డ్ సర్క్యూట్ టీవీ(సి.సి.టి.వి) ద్వారా ఎవరేం చేస్తున్నదీ పర్యవేక్షించాలి. సినిమాలో ఏ భాగం ఏ సమయంలో ఎక్కడ వుందో జాగ్రత్తగా గమనించాలి. ఇలాంటి పద్ధతుల్ని ప్రవేశపెట్టి, అందరూ పాటించినట్లయితే కొంతవరకు మేలు" అని వినోద రంగంలోని టెక్నాలజిస్ట్ సంస్థల్లో ఒకటైన 'రియల్ ఇమేజ్ మీడియా టెక్నాలజీస్' డైరెక్టర్ సెంథిల్ కుమార్ విశ్లేషించారు. అయితే అప్పటికీ లోటుపాట్లేవీ లేకుండా కట్టుదిట్టం చేసినట్లుకాదు. "అందుకే, మేమిప్పుడు సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పని కోసం ఓ ఎన్‌క్రిప్టెడ్ వ్యవస్థను రూపొందిస్తున్నాం. ఈ ఏప్రిల్ నాటికి ఆ వ్యవస్థను ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానున్నాం" అని సెంథిల్ కుమార్ వివరించారు. అయితే, ఇలా భద్రతా చర్యలను పెంచుకుంటూ పోవడం వల్ల అటు ఖర్చూ పెరుగుతుంది. ఇటు సినిమా పూర్తి చేయడానికయ్యే సమయం కూడా ఎక్కువవుతుంది. కానీ, ప్రస్తుతానికి అంతకు మించి మరో మార్గం కనిపించడంలేదు.

ఏమైనా, సినిమా పైరసీకి కారణమౌతున్న ఇంటి దొంగలను ఈ సరికొత్త టెక్నాలజీ ఈశ్వరుడైనా పట్టుకుంటాడా అన్నది ఇప్పటికీ శేషప్రశ్నే. తమిళ, హిందీ పరిశ్రమల్లోకి వేగంగా పాకిన ఈ రిలీజు ముందు పైరసీ జాడ్యానికి తెలుగు చిత్ర పరిశ్రమ తొందరగా మేల్కొనాలి. ముందుగానే ముకుతాడు వేయాలి. అలా కాక, 'మనదాకా ఆ ఇబ్బంది రాలేదు కదా' అని అలక్ష్యం చేస్తే చాప కింద నీళ్లు వచ్చేస్తాయి. ఆ తర్వాత ఏం చేసినా చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లే! కనీసం తమిళనాడు తరహాలో ఇప్పటికీ పైరసీ నిరోధక చట్టమైనా చేసుకోకుండా, వున్న నిబంధనల అమలులో సైతం చిత్తశుద్ధి చూపకుండా కాలం గడిపేస్తున్న తెలుగు చిత్ర పరిశ్రమ పెద్దలకు ఈ హెచ్చరికలు చెవిన పడతాయంటారా!?

- రెంటాల జయదేవ

తెలుసుకుందామా...

...శుభాకాంక్షలు

"ఏమోనండీ నాకేం అర్థం కావడంలేదు. ఈ మధ్య ఒక కిడ్నీ స్పెషలిస్టు దగ్గరకు ఒకాయన ఫోన్‌చేసి "హ్యాపీ కిడ్నీడే" అని చెప్పాడట. ఏం మాట్లాడాలో అర్థం కాక కొన్ని క్షణాలు ఆలోచించి 'థాంక్యూ, విష్ యు ద సేం' అని సమాధానం చెప్పారట ఆయన. వార్తా పత్రికలు, దూరదర్శినిలలో బహిరంగ చర్చలు, గోష్టులు నిర్వహించడం ద్వారా మూత్రపిండాల జబ్బులపై అవగాహన కల్పించి జనం తమ మూత్రపిండాలను ఎక్కువ కాలం రక్షించుకోగలిగేట్టు చేయడం ఆ కిడ్నీడే వుద్దేశ్యం. మరి హ్యాపీ కిడ్నీడే అంటే వేడుక అనే అర్థం వస్తోందిగా అని వాపోయాడు ఆ డాక్టర్ ఏసుపాదం గారు.

"ఏం డాక్టర్ గారూ ఉదయం నడకకు ఆలస్యంగా వచ్చారివాళ" అడిగారు శాంతారావు మాస్టారు.

ఉదయం లేవగానే ఒకావిడ ఫోన్ చేసి "మేడం గార్కి ఫోనిస్తారా? హ్యాపీ వుమెన్స్‌డే చెప్పాలి" అని అడిగింది. నా భార్యను లేపి ఫోనిచ్చాను.

"మేడం గారూ హ్యాపీ వుమెన్స్ డే" అంది అవతలి గొంతు.

"నీక్కూడానమ్మ" అని చెప్పి బద్ధకంగా వళ్లు విరుచుకుని లేచింది మా ఆవిడ.

ఆ తర్వాత దూరవాణి(సెల్‌ఫోన్)లో మెసేజ్‌ల మీద మెసేజ్‌లు వచ్చాయి 'వుమెన్స్ డే' గురించి. వాటన్నింటికీ ఆవిడ సమాధానాలు ఇస్తూ కూర్చుంది. ఆ కబుర్లు చెప్పుకుని వచ్చేటప్పటికి ఆలస్యం అయిందిలెండి అన్నాను.

"హ్యాపీ వుమెన్స్ డే అంటే ఏంటండీ" అడిగారు మరొక మిత్రులు వాసు.

అదేంటండీ ప్రతి పండుగకూ 'హ్యాపీ ఫలానా పండుగ' అని చెప్పడం రివాజు కదండీ! పండుగ పేరుతో శుభాకాంక్షలు చెప్పుకుని మాట్లాడుకోవడం అన్నమాట. దీనివల్ల మానవ సంబంధాలు మెరుగవుతాయి కదా. ఇందంతా మన ......" అన్నారు రమణ మాస్టారు.

"ఏమోనండీ నాకేం అర్థం కావడంలేదు. ఈ మధ్య ఒక కిడ్నీ స్పెషలిస్టు దగ్గరకు ఒకాయన ఫోన్‌చేసి "హ్యాపీ కిడ్నీడే" అని చెప్పాడట. ఏం మాట్లాడాలో అర్థం కాక కొన్ని క్షణాలు ఆలోచించి 'థాంక్యూ, విష్ యు ద సేం' అని సమాధానం చెప్పారట ఆయన. వార్తా పత్రికలు, దూరదర్శినిలలో బహిరంగ చర్చలు, గోష్టులు నిర్వహించడం ద్వారా మూత్రపిండాల జబ్బులపై అవగాహన కల్పించి జనం తమ మూత్రపిండాలను ఎక్కువ కాలం రక్షించుకోగలిగేట్టు చేయడం ఆ కిడ్నీడే వుద్దేశ్యం. మరి హ్యాపీ కిడ్నీడే అంటే వేడుక అనే అర్థం వస్తోందిగా అని వాపోయాడు ఆ డాక్టర్ ఏసుపాదం గారు.

సెప్టెంబర్ 5న నాకు చాలామంది హ్యాపీ టీచర్స్‌డే చెప్పారు. ఆ తర్వాత ఒక కళాశాల వారు పిలిస్తే గురుపూజోత్సవ సమావేశానికి వెళ్లాను. కొంతమంది గురువులకు శాలువాలు కప్పి సన్మానం చేశారు మొక్కుబడిగా. ఆ తర్వాత పిల్లల నృత్యాలు (సినిమా పాటలకు డాన్సులు) మొదలయ్యాయి. ఒకళ్ల చిరంజీవి పాటకు డాన్స్ చేస్తే వెంటనే బాలకృష్ణ పాటకు డాన్స్ చేయాలట. లేకపోతే గొడవలై పోతాయట. ఏమైనా ఎక్కువ సేపు ఆ గోల భరించలేక వచ్చేశానన్నారు వీరాంజనేయులు మాస్టారు.

ఇంతకీ ఈ దినాల ప్రత్యేకత ఏమిటండీ బాబు? మరో మిత్రుడి ప్రశ్న. మన వుమెన్స్ డే గురించి చెప్పరూ.

1910లోని డెన్మార్క్‌లోని కోపెన్‌హాగెన్‌లో సోషలిస్టు మహిళల ప్రతినిధులతో జరిగిన అంతర్జాతీయ సదస్సు మార్చి 8వ తేదీని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా పాటించాలని పిలుపునిచ్చింది. అప్పటి నుండీ మార్చి 8 మహిళా హక్కుల దినోత్సవానికి సంకేతం. అంతేకానీ వేడుకలకు, సంబరాలకు కాదు ఈ దినోత్సవం.

అవును ప్రజాశక్తి ఆదివారం ప్రత్యేక పుస్తకంలో నేనూ చదివాను అన్నారు రామారావు గారు. మహిళల హక్కుల సాధనకూ, లైంగిక సమానత సాధనకు ప్రతినబూనే రోజు అని రాశారు.

ఇక టీ తాగే సమయం కావడంతో మళ్లీ రేపు కలుద్దామంటూ సెలవు పుచ్చుకున్నాం.

-డా॥డి.ఆర్.కె.ప్రసాద్

కొబ్బరి బోండాం కబుర్లు



వేసవి మొదలైంది. చిన్నా పెద్దా ఒకటే ఆరాట పడిపోతుంటారు దాహానికి. పెదాలు ఎండిపోతాయి. నాలుక పిడచ కడుతుంది. ఎన్ని నీళ్లు తాగినా దాహం తీరదు. ఒంట్లోని శక్తినంతా కోల్పోతున్నట్లుగా ఉంటుంది. ఫ్యాన్లు, ఏసీలు నడుస్తున్నా కొలిమిలో పెట్టినట్టుగా ఉంటుంది. ఎంత ఆరోగ్యంగా ఉన్నవారైనా డీలా పడిపోతుంటారు. ఇక వృద్ధులైతే "ఈ వేసవికాలం నా ప్రాణం తీసేట్టుందిరా" అనుకుంటుంటారు. నీడలోనైనా కాసేపు పని చేసేసరికే నీరసపడతారు. ఇక ఎండలోకి వెళ్తే చెప్పాల్సిన అవసరం లేదు. వడదెబ్బకు ప్రాణం పోయినంత పనైపోతుంది. కానీ తప్పదు. వేసవి కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మన పనులు మనం చేసుకుతీరాలి. దీనికి మంచి మందు కొబ్బరి నీళ్లు. ఇవాళ వాటి వల్ల కలిగే ప్రయోజనాల గురించి చెప్పుకుందాం.

లేత కొబ్బరిబోండాల్లో ఖనిజాలు, పోషకగుణాలు పుష్కలంగా ఉంటాయి.

పనుల వల్ల మనం కోల్పోయిన ద్రవాలు, ఖనిజాలను ఈ కొబ్బరి నీళ్లు సమకూరుస్తాయి. అందుకే క్రీడాకారులు, నిరంతరం పనిచేసే వారు కొబ్బరి నీళ్లు తాగడం వల్ల శారీరక శ్రమ కారణంగా కోల్పోయిన వాటిని త్వరగా తిరిగి పొందగలుగుతారు.

కొబ్బరి నీళ్లు స్వచ్ఛమైన మినరల్ వాటర్. మందులు వాడడం వల్ల వచ్చే సైడ్ ఎఫెక్టులకు ఇవి మంచి విరుగుడుగా పనిచేస్తాయి. ఇవి పసిపిల్లలకు పూర్తి సురక్షితమైనవి. ఎందుకంటే అవి ప్రకృతి ప్రసాదాలు కాబట్టి. జ్వరం, తలనొప్పి, కడుపునొప్పి, డయేరియా, మలబద్ధకం వంటి ఎన్నో సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి. అంతే కాదు ఇవి గుండెకు చాలా బలాన్నిస్తాయి. వీటిని తాగడం వల్ల రోగులు త్వరగా కోలుకుంటారు.

కొబ్బరి నీళ్లను ప్రతిరోజూ తాగడం వల్ల మూత్ర సమస్యలు దరిచేరవు. ఇవి వాంతులను ఇట్టే తగ్గిస్తాయి. మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు, ఇతర జబ్బులు ఉన్నవారికి కడుపులోని వికారాన్ని పోగొట్టడానికి ఇవి చాలా ఉపకరిస్తాయి.

నారింజ రసం కంటే కూడా కొబ్బరి నీళ్ళు ఆరోగ్యవంతమైనవి. ఎందుకంటే కొబ్బరినీళ్లలో తక్కువ క్యాలరీలుంటాయి. కొవ్వు పదార్థాలు, కొలెస్టరాల్ తక్కువగా ఉన్న కొబ్బరినీళ్లలో పాలలో కంటే ఎక్కువ పోషకాలుంటాయి. మానవరక్తంలోని జీవద్రవ్యానికి సమానం.

లేత కొబ్బరిబోండాంలోని నీళ్లు అన్నిటి కంటే స్వచ్ఛమైన నీళ్లు. పండ్లు, కూరగాయల రసాలు, ఇంకా ఇతర కూల్‌డ్రింకుల్లో కంటే ఎక్కువ ఎలక్ట్రొలైట్లుంటాయి. స్వచ్ఛమైన జీవపదార్థం. రుచిగా ఉంటాయి. ఆటగాళ్లకు కావలసిన లవణాలు, చక్కెర, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి.

అరుగుదల శక్తి తగ్గినప్పుడు ఈ నీటిని తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థను శుభ్రం చేస్తాయి. జీవకణాలకు పోషకపదార్థాలను, ఆక్సిజన్‌ను తీసుకెళ్తున్నప్పుడు శరీరంలోని సహజ ద్రవాల స్థాయిని క్రమబద్ధీకరిస్తాయి.

దాదాపుగా అందరూ అప్పటికప్పుడు తీసిన కొబ్బరి నీళ్లనే తాగుతారు. ఒక వేళ అవి తీసిన తరువాత ఎక్కువ సేపు బయట ఉంటే వాటిలోని పోషకవిలువలు తగ్గిపోయి, పులుస్తాయి. వాటిని తీసుకోవడం వల్ల నీళ్ల విరేచనాలు అయ్యే అవకాశముంది. మనదేశంలో కొబ్బరిని రోజువారీ అవసరాలకు ముఖ్య ఆహారంగా తీసుకుంటారు. కొబ్బరి చెట్టు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది. అందుకే దాన్ని కల్పవృక్షం అంటారు. కొబ్బరిచెట్టు ప్రపంచంలోనే ఎక్కువగా ఉపయోగపడే చెట్టు. ఆహారం, నీరు, బట్టలు, నీడ, ఆర్థిక భద్రత వంటివన్నీ ఈ చెట్టు వల్ల లభిస్తాయి. దక్షిణ భారతదేశంలో కొన్ని కుటుంబాలు ఆధారపడే కొబ్బరి చెట్టులో అంగుళం కూడా దుర్వినియోగమవదు.

లేత బోండాం నీళ్లే మంచివి!

కొబ్బరి బోండాలు మనకు మూడు రకాలుగా దొరుకుతాయి. లేత కొబ్బరిబోండాలు మొదటి రకానికి చెందినవి. వీటిలో 90 నుండి 95 శాతం నీళ్లు ఉంటాయి. వీటిలో ఖనిజ, పోషకవిలువలు సమృద్ధిగా ఉంటాయి. రెండవ రకానికి చెందినవి కొంచెం ముదురువి. వీటిలో లేతవాటిలో కంటే కొంచెం తక్కువ నీళ్లుంటాయి. వీటిలో నీళ్లతో పాటు మెత్తటి కొబ్బరి గుజ్జు కూడా ఉంటుంది. ఈ దశలో నీళ్లు పాలలాగా ఉంటాయి. దీనిలో కూడా పోషక విలువలు బాగానే ఉంటాయి. మూడవ రకానికి చెందినవి పూర్తిగా పక్వ దశకు వచ్చినవి. ఇందులో కొబ్బరి బాగా ముదిరి ఉంటుంది. నీళ్లు చాలా తక్కువగా ఉంటాయి. ఇవి జీర్ణమవడానికి ఎక్కువ సమయం తీసుకుంటుంది. ఇటువంటివి ఎక్కువ మొత్తంలో తీసుకోవడం వల్ల హైపర్ టెన్షన్, కొలెస్టరాల్ స్థాయి పెరిగి బాధపడాల్సి వస్తుంది.

మనకు ఇంత మేలు చేసే కొబ్బరి చెట్లు ముందుగా ఎక్కడ పుట్టాయో తెలియలేదు కానీ ప్రపంచంలో మొదటగా మలేషియా, ఇండోనేషియా దేశాల వారు కొబ్బరితోటలను పెంచారు. ఉష్ణ మండలాల్లో వీటిని శతాబ్దాల నుంచి ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. శరీరంలోని నీటి శాతాన్ని పెంచడానికి కొబ్బరి నీళ్లు మంచి మార్గం. పక్వ దశకు వచ్చిన కొబ్బరి బోండాంలోని నీళ్లు ఇంకి కొబ్బరిలో కలిసిపోతాయి. కాబట్టి లేతగా ఉన్నప్పుడే తాగితే మనకు మంచి ఫలితాలు లభిస్తాయి.

- మణిదీప్

సమగ్ర సంక్షేమ పథకాలత

ఇంటింటా వెలుగు..

..ఊరూరా అభ

రాజీవ్ ఆరోగ్యశ్రీ	•942 వ్యాధులకు వర్తింపు •పేదలకు నాణ్యమైన వైద్యం లక్ష్యం •ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 27 లక్ష మందికి వైద్య పరీక్షలు •5 లక్షల మందికి శస్త్ర చికిత్సలు
జలయజ్ఞం	•కోటి తొమ్మిది వేల ఎకరాలకు సాగునీరు, 22.26 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం •మొత్త 86 ప్రాజెక్టుల నిర్మాణం లక్ష్యం •ఇప్పటివరకు 12 ప్రాజెక్టులు పూర్తి. 19 ప్రాజెక్టులు పాక్షికంగా పూర్తి
కిలో 2 రూపాయల బియ్యం	•2 కోట్ల కుటుంబాలకు లబ్ధి •నెలకు 3.92 లక్షల టన్నుల బియ్యం పంపిణీ •ఏటా రూ.5,400 కో సబ్సిడీ
ఇందిరమ్మ ఇళ్ళు	•పేదల కొరకు మొత్తం 81,29,277 ఇళ్ళ నిర్మాణం లక్ష్యం •ఇప్పటికి 27,61,251 ఇళ్ళ నిర్మాణం పూ •నిర్మాణంలో 17,44,501 ఇళ్ళు •కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని వరద బాధితులకు లక్ష పక ఇళ్ళ నిర్మాణం లక్ష్యం
వై.ఎస్.ఆర్. అభయహస్తం	•60 ఏళ్ళు నిండిన మహిళలకు ఆసరా •ప్రస్తుతం 3.36 లక్షల మంది స్వయం సహాయక బృందా మహిళలకు ప్రతి నెలా రూ.500 నుండి రూ.2200ల వరకు పింఛను
పావలా వడ్డీ	•రాష్ట్రంలోని ప్రతి మహిళను లక్షాధికారి చేయడమే లక్ష్యం •రాష్ట్రవ్యాప్తంగా 9.34 లక్షల మహి సంఘాలు •95 లక్షల మంది మహిళలకు లబ్ధి •మహిళా సంఘాల వద్ద రూ.3500 కోట్ల మూలధన



నా ప్రియమైన సోదర సోదరీమణులారా!

వ్యక్తికైనా, వ్యవస్థకైనా, ప్రభుత్వానికైనా... సమస్యలు ఎదురుకావడం, వాటిని పరిష్కరించుకుంటూ ముందుకుపోవడం ఒక నిరంతర ప్రక్రియ. అయితే ముందుకు పోవడం అన్నది పేదలను ఆదుకుని అక్కున చేర్చుకునేదిగా ఉండాలి. ఇలాంటి లక్ష్యంతోనే ప్రపంచంలో ఎక్కడాలేని అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోంది. ఆ పథకాలన్నీ ప్రజా సంక్షేమం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని సమానంగా దృష్టిలో పెట్టుకుని రూపొందించినవి. తద్వారా నగరాలనే కాకుండా గ్రామాలనూ అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్యసాధనకు మీ సహాయ సహకారాలను కొనసాగిస్తారని ఆశిస్తూ...

మీ

కె. రోశయ్య

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

అభివృద్ధిలో ఆదర్శవంతంగా కొనసాగుదాం

జారీచేసినవారు : సమాచార, పౌరసంబంధాల శాఖ

మొఘల్ గార్డెన్స్ ... ఓ సుందర లోకం

అందమైన పూలచెట్లు, లతలు, నీటిని చిమ్మే ఫౌంటెయిన్స్, సందర్శకులను మైమరిపించే సువాసనలు వెదజల్లే పుష్పాలు, వీటన్నిటినీ సావకాశంగా చూడడానికి వాక్‌వేస్... నిజంగా ఉద్యానప్రియులకు ఒక సుందరలోకం. దాన్ని తిలకించిన వారికి అదొక మధురానుభూతిని మిగులుస్తుంది. అదే రాష్ట్రపతి భవన్‌లో భాగంగా ఉన్న మొఘల్‌గార్డెన్స్.

మొఘల్ గార్డెన్స్‌కు స్ఫూర్తినిచ్చినవి కాశ్మీర్‌లోని షాలిమార్ గార్డెన్స్. డాల్ సరస్సు ఒడ్డున శ్రీనగర్‌లో మొత్తం మూడు సుప్రసిద్ధమైన సుందరోద్యానాలున్నాయి. షాలిమార్, చష్మెషా హీ, నిషాల్ అనే మూడు వేర్వేరు ఉద్యానవనాలను కలిపి శ్రీనగర్‌లో మొఘల్ గార్డెన్స్'గా వ్యవహరిస్తారు. వీటిని మొఘల్ పరిపాలకులు రూపొందించడమే దీనికి కారణం. ఈ శ్రీనగర్ మొఘల్ గార్డెన్స్ 1912 ప్రాంతంలో నాటి వైస్‌రాయ్ సతీమణి లేడీ హార్డింగ్ సందర్శించారు. మొఘల్ గార్డెన్స్ మూడింటిలోనూ ఆమెను 'షాలిమార్' గార్డెన్ ఎంతో ఆకట్టుకుంది. అంత సుందరోద్యానవనం ఢిల్లీలో మాత్రం ఎందుకు ఉండకూడదన్న ఆమె ఆలోచనకు ప్రతిరూపమైంది ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లోని 'మొఘల్ గార్డెన్స్'. తనకు స్ఫూర్తినిచ్చిన మొఘల్ గార్డెన్స్ పేరునే మళ్లీ ఢిల్లీలోని ఉద్యానవనాలకు ఉపయోగించడం ఆమెలోని కృతజ్ఞతకు సూచనగా భావించవచ్చు.

రాష్ట్రపతి భవన్‌లోని మొఘల్ గార్డెన్స్ సృష్టికి లేడీహార్డింగ్ ఆలోచనే పునాది. అయితే, ఆ ఆలోచనలకు రూపమిచ్చినవాడు సర్ ఎడ్విన్ లుట్యెన్స్. మొత్తం 330 ఎకరాల విస్తీర్ణ స్థలంలో నిర్మితమైన నాటి వైస్ రీగల్ హౌస్(నేటి రాష్ట్రపతి భవన్)లో సుందరోద్యానవనాలకు ఆయనే సృష్టికర్త. 1924లో ప్రారంభించి, 1933 నాటికి మొత్తం పదహారు ఎకరాల విస్తీర్ణంలో ఆయన పూలతోటలు, పచ్చికబయళ్లు, కాలువలు, ఫౌంటెయిన్స్‌తో శ్రీనగర్‌లోని అందాల షాలిమార్‌ను అలా తెచ్చి ఇలా ఢిల్లీలో ప్రతిష్ఠించారా అన్నరీతిలో రూపొందించగలిగారు. మొఘల్ గార్డెన్స్‌లో మొత్తం నాలుగు స్పష్టమైన విభాగాలున్నాయి.

రాష్ట్రపతి భవనానికి అతిసమీపంలోనే దీర్ఘచతురస్రాకారంలో ఉన్న ఉద్యానవనం ఒకటి. రవ్వంత దూరంలో ఉన్న వృత్తాకారంలోని ఉద్యానవనానికి దారితీసే పొడవైన రాదారి లాటి పూలతోట మరోటి, వృత్తాకాంలో ఉండే ఉద్యానవనం ఒకటి. ఇక గోల్ఫ్ కోర్టు, టెన్నిస్‌కోర్టు వంటి క్రీడాస్థలాలున్న విభాగం. పేరుకివి నాలుగు విభాగాలుగా చెప్పాలేకానీ అన్నిటికన్నీ ఒకే సూత్రంలో ఉన్నట్లుంటాయి. మొఘల్ గార్డెన్స్‌లో ప్రధాన ఉద్యానవనాలకు చెట్లు, లతల్ని అందించే నర్సరీ విభాగం కూడా ఉంది. ఇన్ని విభాగాలుగా సుందరంగా సూత్రబద్ధం చేస్తున్నట్లు లుట్యెన్స్ వీటికి ఆకృతి కల్పించారు. ఉద్యానవనాల్లో జలాశయాలకుండే ప్రాధాన్యత ఆయనకు బాగా తెలుసు కాబట్టే పలురకాలుగా కాలువలనూ, ఫౌంటెయిన్స్‌ను ఆయన రూపొందించారు. అవన్నీ గార్డెన్స్‌కు శక్తినిచ్చే జలవాహికలన్న సంగతి ఎలా ఉన్నా చూపరులకు మాత్రం అవి గార్డెన్స్‌కు అందాన్ని సమకూరుస్తున్నట్లుగా అనిపిస్తాయి. దీర్ఘచతురస్రాకారంలో ఉండే మొదటి విభాగంలో మొత్తం నాలుగు జల'మార్గాలు'న్నాయి. అందులో రెండింటిలో నీరు ఉత్తరం నుంచి దక్షిణ దిక్కుగా ప్రవహిస్తోంటే, మరో రెంటిలో తూర్పునుంచి పడమరకు పారుతుంటుంది. ఆ కాలువల్లో అక్కడక్కడ వేసిన చతురస్రాకారాపు శిలల మీద నుంచి నీరు దూకుతూ ప్రవహిస్తోంటే, చూసి తీరాల్సిందే ఆ అందం! ఇక పన్నెండు అడుగుల ఎత్తువరకు నీటిని పైకి చిమ్మే ఫౌంటెయిన్ అందం ప్రత్యేకంగానే చెప్పాలి. పద్మపత్రాల తీరులో ఎరుపురంగులోని సాండ్‌స్టోన్ శిలల మీద ఈ ఫౌంటెయిన్స్ ఒక ప్రత్యేక ఆకర్షణ. దీర్ఘచతురస్రరూపంలోని ఈ విభాగంలో కేంద్రబిందువులాగ మధ్యలో 200 అడుగుల సెంట్రల్ ఐలండ్ ఒకటి ఉంది. దాని చుట్టూ చిన్నచిన్న పూలచెట్లు, చతురస్రమండలాలెన్నో ఉండి, అందాన్ని రెట్టింపు చేస్తుంటాయి. ఈ నిర్మాణం మొత్తం చూపరుల్లో కలిగించే సంభ్రమాశ్చర్యాలు చెప్పనలవి కాకుండా ఉంటాయి.

దీర్ఘచతురాస్రాకారపు ఉద్యానవనాన్ని వృత్తాకారంలోని ఉద్యాన విభాగానికి కలిపే పూల బాట అందాలు నిజంగా కన్నులపండుగగా ఉంటాయి. దగ్గరి నుంచి చూస్తే ఏనుగులతొండాలు వేలాడుతున్నాయా అనిపించేలా ఉండే పెండెంట్ డిజైన్స్ మీద అల్లుకుపోయిన లతలు, వాటిపక్కనే గులాబీలు, డాలియాలు నిండుగా, ఒత్తుగాపూసి, ఆ దారులమీద నడిచేవారికి స్వాగత గీతికలను బృందగానాలుగా ఆలపిస్తున్నట్లుంటుంది. ఆ లతల్లోంచి కమ్మని సువాసనలందిస్తూ మల్లె, సన్నజాజులు, వస్తున్నవారికి పరిమళసుగంధాలు అద్దుతున్నట్లుంటుంది.

ఈ పూలబాటలోంచి నడిచి వెళ్తే అటుచివర మొఘల్ గార్డెన్స్‌కు కేంద్రబిందువులాంటి వృత్తాకారపు ఉద్యానం వస్తుంది. అన్ని రకాల పూలతోనూ అన్ని అందాలనూ ఒకేసారి సంతరించుకున్న తీరులో ఉన్న ఈ భాగానికి మధ్యలో పెద్ద సరస్సు ఉంటుంది. ఇన్ని పూలుండే ఈ భాగంలో సీతాకోకచిలుకలు వందల్లో రెక్కలాడిస్తూ అందంగా తిరుగుతూ, ఉద్యానానికి కొత్త శోభల్ని చేకూరుస్తుంటాయి. లుట్యెన్స్ తీర్చిదిద్దిన ఉద్యానంలోకి ఈ సీతాకోక చిలుకలు ప్రాణాన్ని నింపుతున్నట్లుగా ఉంటుంది. మొగల్ గార్డెన్స్‌లో చోటు చేసుకుని పూలచెట్లు అంటూ ఏమీ లేవేమో! దశాబ్దాలతరబడిగా ఆ భవనంలో నివసించిన రాజకీయప్రముఖులంతా తమకు తోచినంతమేరకు ఆ అందాలకు మరిన్ని మెరుగులు దిద్దాలని ప్రయత్నించడమే దీనికి కారణం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాష్ట్రపతి భవన్‌లో తొలి రాష్ట్రపతిగా పదేళ్లపాటు నివసించిన డాక్టర్ రాజేంద్రప్రసాద్ స్వయంగా ఎన్నెన్నో రకాల మల్లెల్నీ, సన్నజాజుల్నీ మొఘల్‌గార్డెన్స్‌లో వేయించారు. సంజీవరెడ్డిగారు దేశాధ్యక్షుడుగా ఉన్నప్పుడు కాశ్మీర్ వెళ్లి తిరిగివచ్చాక ఎన్నెన్నో రకాల గులాబీచెట్లను మొఘల్ గార్డెన్స్ అందాలకు అదనంగా చేర్చారు. ఇక జైయిల్‌సింగ్ అయితే మొఘల్ గార్డెన్స్‌లో పలువిభాగాలకు మరమ్మతులు చేయించి కొత్త అందాలు సమకూర్చారు. కొత్తగా వందరకాల డబుల్ డాలియా చెట్లను గార్డెన్స్‌లో వేయించారు. ఇలా ఎందరెందరి కృషిఫలితంగా ఇప్పుడు కొన్ని వందల రకాల గులాబీలు, 400 బోన్‌సాయిలు(మరుగుజ్జు వృక్షాలు), 50 రకాల బోగన్ విల్లా(కాగితపు పూలచెట్లు), వందరకాల క్రీపర్స్, మరో 15 రకాల లతలు, వందరకాల ఇన్‌డోర్ మొక్కలు మొఘల్ గార్డెన్స్‌లో ఉన్నాయి.

కొన్ని వందల రకాల వృక్షజాతులుండడం కారణంగా వీటికి వృక్షవిజ్ఞాన శాస్త్రవిభాగంలో కూడా ప్రత్యేకమైన గుర్తింపు లభ్యమైంది. వీటిని బొటానికల్ గార్డెన్స్ ఆఫ్ ఇండియాలో ఒకటిగా చేర్చడంతో ప్రతి ఏడాది వేలాది బోటనీ విద్యార్థినులు వీటిని సందర్శించవస్తుంటారు. మొత్తం 36 మంది ఉద్యానవన సంరక్షణలో రాత్రింబవళ్లు నిమగ్నమై ఉంటూ వీటిని నిత్య నూతనత్వంలో కాపాడుకుంటూ వస్తున్నారు.

రాజధాని నగరంలో ఉన్నప్పుడు దేశాధ్యక్షుడు ఉదయమే ఒకసారి గార్డెన్స్‌లో వాహ్యాళికి వెళ్తుంటారు. పచ్చని చెట్ల మధ్య ప్రశాంతమైన వాతావరణంలో, నిష్కల్మషమైన పువ్వునవ్వుల తోటి రవ్వంత సేపు గడిపి, ఆ తర్వాత దేశపాలనా బాధ్యతల నిర్వహణ దీక్షలో నిమగ్నమవుతుంటారు. దాదాపు అర్ధ శతాబ్దకాలంగా దేశాధీశులనుంచి, అతిసామాన్యుల వరకు అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ, అందాలు చిమ్ముతూ ఢిల్లీకి ప్రత్యేకార్షణగా మిగులుతున్న 'మొఘల్ గార్డెన్స్'ను చూడగలగడం ఎలా చూసినా అదృష్టమేననుకోవాలి!

సాధారణంగా ఫిబ్రవరి నుంచి మార్చి వరకు సందర్శకులకు వీటిని చూడగలిగే అవకాశం ఉంటుంది. ఢిల్లీ ప్రయాణం పెట్టుకుంటే అది ఈ ఫిబ్రవరి, మార్చికాలంలోనే ఉండేవిధంగా, వీలైతే మొఘల్ గార్డెన్స్ చూసి వచ్చేవిధంగా ప్రయాణాన్ని రూపొందించుకోవడం మంచిది! 'భూమి మీద స్వర్గం అంటూ ఉంటే అది ఇదే ఇదే!' నన్న పర్షియన్ సూక్తి ఒకటి ఎర్రకోటలోని 'దివానే ఖాన్'లోని కుడ్యతోరణం మీద కనిపిస్తున్నది. ఆ సూక్తి ప్రకారమే ఢిల్లీ గనుక భూమి మీద స్వర్గమే అయితే ఆ స్వర్గంలోని నందనవనం మొఘల్ గార్డెన్సే అయి ఉండాలి.

సోమవారం రోజుల్లో దీన్ని చూసేందుకు ఎవరికీ అనుమతి లభించదు. మిగిలిన రోజుల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దీన్ని సందర్శకులు యథేచ్ఛగా చూడొచ్చు. అయితే సందర్శకులు బ్రీఫ్ కేసులు, హేండ్‌బ్యాగులు, కెమెరాలు, రేడియోలు, ట్రాన్సిస్టర్లు, పెట్టెలు వంటి వస్తువులేమీ తీసుకెళ్లొద్దు. ఖాళీ చేతులతో వెళ్లాలి. ఇదంతా భద్రత కోసం. ★





అట్టమీది కథ



నీరు, జలం, పానీ, తన్నీర్, వాటర్... ఇలా ఏ పేరుతో పిల్చుకున్నా ఇది ప్రాణావసరం. పంచభూతాలైన నీరు, నిప్పు, నింగి, నేల, గాలిలో ఒకటైన నీరు లేనిదే ప్రాణికోటి మనుగడే లేదు. నిన్నటిదాకా అగ్ని కోసం (ఇంధనం) యుద్ధాలు జరిగితే నేడు నీటి యుద్ధాలు చోటుచేసుకుంటున్నాయి. మొన్నటిదాకా ధరణిని గుప్పిట్లో బంధించేందుకు పోటీ పడ్డారు. సెజ్జులపేర, కార్పొరేట్ వ్యవసాయం పేర భూమిని కబళిస్తున్నారు. అదీ చాలక కొందరు గగనతలంపై కన్నేశారు. చంద్రమండలంపై ప్లాట్లు అంటున్నారు. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా నీటిపై వల విసురుతున్నారు. మామూలుగా వల వేస్తే నీళ్లు పోయి చేపలు మిగులుతాయి. కానీ ఇక్కడ నీళ్లకోసం వల విసరటం విచిత్రం.

ప్రాణికోటికి నీటికి వున్న అవినాభావ సంబంధం గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది? భూతలం మీద మూడవ వంతు నీళ్లే. మన శరీరంలో 80 శాతం నీరే. తాగడానికి, వంటకు, పరిశుభ్రతకు, ఒకటేమిటి ప్రతి ప్రక్రియకు నీటి మీదే ఆధారపడుతున్నాం. అంతటి ప్రధాన పాత్ర పోషిస్తున్న నీటి మీద ప్రపంచ బ్యాంకు కన్నుబడింది. నీటిని ప్రయివేటు పరం చేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఈ నెల 22న ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా
ఈ వారం అట్టమీది కథ....

-కె.చరిత

ప్రాణ జలం 'ప్రపంచ' వల

నీటిని మనిషిని విడదీసి చూడలేం. నీరు లేకుండా మనిషికి క్షణం గడవదు. మనిషికే కాదు జీవకోటికి ప్రాణ సమానం నీరు. స్వచ్ఛమైన, సురక్షితమైన నీటిని వాడడం వల్ల మనిషి ఆరోగ్యంగా మనగలుగుతాడు. అందుకే పరిశుభ్రమైన నీటిని ప్రతి ఒక్కరికీ సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. సాంకేతికంగా ఇంత అభివృద్ధి సాధించిన నేడు అదేమీ పెద్ద కష్టంకాదు. పైగా భూగర్భంమీద జలసంపద సమృద్ధిగా వుంది. ప్రాజక్టులు నిర్మించి ఆ గురుతర బాధ్యతను ప్రభుత్వాలు నిర్వర్తించవచ్చు. కానీ ఆ పని చేయకుండా నీటిని కొనుక్కోమని ఉచిత సలహా ఇస్తున్నారు. జలయజ్ఞాల పేర అందినంత బొక్కుతున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నుంచి తీసుకున్న అప్పుల మూలంగా... ప్రజాప్రతిఘటనతో గతంలో ఆగిపోయిన నీటి సంస్కరణలు ఇప్పుడు శరవేగంగా అమలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. క్రమంగా నీటి వుచ్చు బిగుసుకుంటోంది.

ప్రాణాధారమైన నీటిని కొద్దిమంది తమ గుప్పెట్లో బంధించి వ్యాపారం చేయాలని చూస్తున్నారు. ఈ దుష్ట ప్రక్రియ ప్రపంచవ్యాప్తంగా జరుగుతోంది. అదేమని అడిగితే ప్రయివేటీకరణ వలన పెట్టుబడులు ఇబ్బడిముబ్బడిగా వచ్చిపడతాయనీ... నీటి రంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఇదే పరిష్కారమనీ చెప్తున్నారు. అందుకు మన దేశమూ మినహాయింపు కాదు. నీటి ప్రయివేటీకరణ–వ్యాపారీకరణలోని కీలకాంశాలు, ప్రపంచవ్యాప్తంగా నీటి ప్రయివేటీకరణ క్రమంలో వచ్చే హామీలు, వస్తున్న అనుభవాలు, మన దేశంలోని ప్రయివేటు సంస్కరణల క్రమంలో నీటి రంగం వాణిజ్యపరమైతే కలిగే దుష్ఫలితాలు, వాటికి పెరుగుతున్న వ్యతిరేకత, ఈ క్రమంలో ప్రపంచ బ్యాంకు పాత్ర... ప్రయివేటీకరణకు ప్రత్యామ్నాయం... వంటి అంశాలు రేఖామాత్రంగా...

నీటి యుద్ధాలు

నీటిని ప్రయివేటు వారికి అప్పగిస్తే ఆ రంగంలోని సమస్యలన్నీ మటుమాయం అవుతాయన్నారు. ప్రభుత్వరంగం అంటేనే అసమర్ధతకు, అవినీతికి, జవాబుదారీ తనం లేకపోవడానికి, ఆధునిక పరిజ్ఞానం లేకపోవడానికి మూలమని ప్రచారం చేశారు. ప్రయివేటీకరిస్తే ప్రభుత్వరంగం తేలేని పెట్టుబడులు వస్తాయన్నారు. నీటిని చవగ్గా సమర్ధవంతంగా అందించి మెరుగైన సేవలు అందిస్తాయన్నారు. అమాయక ప్రజానీకంలో ఇన్ని ఆశలు కల్పించిన ప్రాజెక్టులు తీరా వాస్తవ రూపం దాల్చేసరికి భారాలు మోపాయి. దాంతో జనాల్లో వ్యతిరేకత వచ్చింది. తిరుగుబాట్లు వచ్చాయి. బొలీవియాలోని కోచబంబా, అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిరిస్, టుకుమాన్, టాంజానియాలోని డార్ ఎస్సలామ్, ఫ్రాన్స్‌లోని గ్రెనోబుల్, ఫిలిప్పైన్స్‌లోని మెట్రో మనీలా, దక్షిణాఫ్రికాలోని నొకోంకొబె, అమెరికాలోని అట్లాంటా నీటి ప్రాజెక్టులన్నీ అలా విఫలమైనవే. ప్రజల వ్యతిరేకతను చవిచూసినవే.

1987లో బొలీవియాలోని ఎల్ ఆల్టో, లాపాజ్ నగరాల నీటి పారుదల, మురుగు నీటి పారుదలను

ప్రయివేటీకరించి 'ఆగువాస్ డెల్ ఇల్లిమానీ' (ఎఐఎస్ఎ) అనే సూయజ్ సంస్థ అనుబంధ కంపెనీకి అప్పగించారు. ఇందుకుగాను ఆ కంపెనీ ఆదాయానికి గ్యారంటీ, సరళతరమైన రుణాలు లాంటి రాయితీలు కూడా లభించాయి. అయినప్పటికీ ఆ కంపెనీ నీటి కలెక్షన్ ఛార్జీలను విపరీతంగా పెంచేసింది. ఫలితంగా వేలాది ప్రజలకు నీరు అందుబాటులో లేకుండా పోయింది. దీంతో జనాల్లో అసంతృప్తి జ్వాలలు ఎగిశాయి. ఆ జ్వాలల్లో ఎఐఎస్ఎ సంస్థ ఆఫీసు దగ్ధమైంది. 1999లో కోచబంబా లోని నీటి పంపిణీని 'ఆగువాస్ డీల్ మునారీ' అనే అమెరికన్ కంపెనీకి అప్పచెప్పారు. కాంట్రాక్టు ప్రకారం కంపెనీకి 15శాతం నికర లాభం హామీ ఇచ్చారు. అంతేకాక ఆ జిల్లా మొత్తంలో నీటిపై అధికారం కూడా కంపెనీకి దఖలు చేశారు. దీనితో సామాన్య కార్మికుడు తన ఆదాయంలో 25 శాతం నీటికే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఛార్జీలు కట్టలేని వారికి నిర్మొహమాటంగా నీటిని కట్ చేస్తామని కంపెనీ ప్రకటించింది. ప్రజలు ఆగ్రహంతో రోడ్డెక్కారు. ప్రజలకు కంపెనీకి మధ్యవర్తిత్వం వహించాల్సిన ప్రభుత్వం ప్రజలను అణచివేసేందుకు సైన్యాన్ని దింపింది. పోరాటాలు పెరిగిపోయాయి. ఈ పోరాటాలకే 'లాగు యెరా డెల్ ఆక్వా' (నీటి యుద్ధాలు) అని పేరు వచ్చింది. 2000 ఏప్రిల్లో జరిగిన కాల్పుల్లో విక్టర్ హ్యూగో డాజా అనే 17 ఏళ్ల బాలుడు మరణించాడు. ఆ సంఘటన పోరాటాల్ని మలుపు తిప్పింది. చివరికి ఆ కంపెనీ దేశాన్ని విడిచిపెట్టి పోవాల్సి వచ్చింది. కానీ ఎల్ ఆల్టోలో పోరాటం కొనసాగింది. నీటి కాంట్రాక్టును రద్దు చేయాలని కోరారు. ప్రజల క్రోధాగ్నికి బొలీవియా ప్రభుత్వం దిగి వచ్చి వారి డిమాండ్లను అంగీకరించింది. నీటి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అక్కడి ప్రభుత్వం ఉన్నతస్థాయి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది.

అభూత కల్పనలు- వాస్తవాలు

నీటిని ప్రయివేటీకరిస్తే వర్ధమాన దేశాలకు పెట్టుబడులు తరలి వస్తాయని వాదించారు. కానీ అనుభవం మరొకలా వుంది. పెట్టుబడి నిధులు ఆశించినంతగా రాలేదు. వినియోగదారులకు ఛార్జీలు చవగ్గా వుంటాయని చెప్పారు. అయితే ప్రపంచ వ్యాప్తంగా ప్రయివేటీకరణ తర్వాత నీటి ధరలు ఆకాశాన్నంటాయి. ఉదాహరణకు మనీలాలో రాయితీలిచ్చిన ప్రాంతంలో నీటి చార్జీలనే పరిశీలిద్దాం. అక్కడ నీటి ఛార్జీలు 1997లో 4.96 ఫిలిప్పైన్స్ కరెన్సీ యూనిట్ల నుంచి 2003 నాటికి 24 యూనిట్లకు చేరింది. కొత్త టెక్నాలజీ పేదలను దూరంగా వుంచింది. దక్షిణాఫ్రికాలోని చాట్వర్త్, డాల్ఫిన్ కోస్ట్లలో నీటి మీటర్లు బిగించి డబ్బు కడితేగానీ నీరు ఉపయోగించుకోలేని పరిస్థితి వచ్చింది. తక్కువ ఆదాయం గలవారు, పేదలు వుండే ప్రాంతాలకు సేవలు అందుతాయన్న హామీనీ ప్రయివేటీకరణ నిలుపుకోలేదు.

కొరవడిన సామాజిక బాధ్యత

ఇండోనేషియాలో సుహర్తో ప్రభుత్వం పతనమైన రోజుల్లో రాజధాని జకార్తా మంటల్లో మాడిపోయింది. మొట్ట మొదటిగా ప్రజల్ని వారి బాధలకు వారినొదిలేసి పారిపోయిన వారిలో ఈ నీటి సంస్థల అధిపతులూ వున్నారు. బొలీవియాలోని కోచబంబాలో పెంచిన ధరలను చెల్లించలేని వారికి నిర్మొహమాటంగా నీటి కనెక్షన్లు కత్తిరించారు. ప్రజలు 5 ఏళ్ల ముందు కోపరేటివ్ పద్ధతిలో నిర్మించుకొన్న నీటి పంపిణీ సిస్టమ్లపై కూడా ఈ కంపెనీలకు పెత్తనం ఇచ్చేశారు.

గినియా దేశంలో ప్రయివేటీకరణ వల్ల ధరలు 75 శాతం పెరిగి కట్టలేని వారికి (మొత్తం కనెక్షన్లలో 3వ వంతు మందికి) నీటి కనెక్షన్లు కత్తిరించారు. అధిక రేట్లూ, నీటి కనెక్షన్ కత్తిరింపులూ ప్రజలకు పరిశుద్ధమైన నీటి అందుబాటూ ఆరోగ్యం కూడా దూరం చేశాయి. 1989లో థాచర్ ప్రభుత్వం, బ్రిటిషు పౌర నీటి సరఫరా సేవలను లాభాల కోసమే పనిచేసే ప్రయివేటు కంపెనీలకు ధారాదత్తం చేసింది. నీటి ధరలు మొదటి 4 ఏళ్లలో ఏడాదికి 50శాతం చొప్పున పెరిగాయి. 1994 నాటికి దాదాపు 19 వేల ఇళ్లకు నీటికనెక్షన్లు తప్పించారు. దీనివల్ల ప్రజారోగ్యం దెబ్బతింటుందన్న అభిప్రాయాలు వచ్చాయి. పట్టణ ప్రాంతాలలో అతిసారవ్యాధి పెచ్చుమీరిందని 1994లో ఒక అధ్యయనంలో తెలిసింది.

పెరుగుతున్న ధరలు, కనెక్షన్ కత్తిరింపులూ నీటి సేవలను అందించకపోవడం అనేవి కనీసం మానవహక్కు అయిన నీటి అందుబాటును తొలగించాయి. కోట్లాది ప్రజలు ఈ విధానాల పాలిట పడ్డారు. దీనికి బాధ్యత ప్రయివేటు కంపెనీలదే అంటూ ప్రభుత్వాలు తప్పించుకున్నాయి. ప్రయివేటు కంపెనీలకు లాభం అనేది ఏకైక లక్ష్యం. దీనిలో అవి సామాజిక బాధ్యతను పూర్తిగా విస్మరించాయి. ఈ విధంగా సామాజిక బాధ్యత కుంటుపడడం అన్నది ప్రయివేటీకరణ ఫలితంగా పరిణమించింది.

మనదేశంలో నీటి ప్రయివేటీకరణ

మనదేశంలో నీరు ఒక ప్రయివేటు సరకుగా చాలాకాలంగా వుంది. భూగర్భ జలాలనేవి అచ్చంగా ప్రయివేటు ఆస్తే. భూమిమీద అధికారమున్న వారికి ఆ భూమి కింద వున్న నీటిపై కూడా హక్కు వుంటుంది. గత 10-15 సంవత్సరాలలో ప్రయివేటీకరణలో అనేక కొత్త పరిణామాలు సంభవించాయి. బాటిళ్లలో నీరు అమ్మడం అనేది ప్రయివేటీకరణలో ఒక పరిణామం. దప్పికతో వున్నవారికి మంచినీళ్లిస్తే పుణ్యమని వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి మంచినీరు ఉచితంగా అందించే సంప్రదాయం మనది. అలాంటి దేశంలో బాటిళ్లతో నీళ్ల అమ్మకం అనేది ఒక విచిత్రం. ఇది మార్కెట్ మాయాజాలాన్ని తెల్పుతుంది. మార్కెట్ ఎంత ఆకర్షణీయంగా వుందంటే బహుళజాతి కంపెనీలు భూగర్భ జలాలను అపారంగా వెలికితీసి నీటి వ్యాపారం, డ్రింకుల వ్యాపారం చేస్తున్నాయి. ఇప్పుడిప్పుడే జలవిద్యుత్తు ప్రయివేటీకరణ బారిన పడడం చూస్తున్నాం. సాగునీటి ప్రయివేటీకరణ తొలిదశలో వుంది. నీటి పంపిణీ ముఖ్యంగా పరిశ్రమలకు నీటి పంపిణీ ఇప్పటికే వాస్తవరూపం దాల్చింది. ఇతర

  

అనేక ప్రాజెక్టులు నిర్మాణ దశలోనూ, అమలు పరచే దశలోనూ వున్నాయి. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే ఈరోజు జరుగుతున్నది కార్పొరేటీకరణ. కార్పొరేట్ ప్రపంచీకరణ పుణ్యమే.

బహుళజాతి కంపెనీలకు జవాబుదారీతనం లేదు. ప్రజలకు అందుబాటులోనూ వుండవు. పర్యావరణమూ, ప్రజారోగ్యమూ వంటి ప్రజా ప్రయోజన సమస్యల పట్ల ఈ కార్పొరేషన్లకు బాధ్యత వుండదు. ఇవన్నీ కూడా మన సార్వభౌమత్వానికీ, జాతికీ, దేశానికీ కూడా ప్రమాదకరమైన ప్రభావం కలిగించే పరిణామాలు.

లాభాలే పరమావధి

ప్రయివేటు కంపెనీలకు లాభమే ప్రధానం. ఎక్కడ ఎక్కువ లాభం వస్తుందనుకుంటే అక్కడికి రెక్కలు కట్టుకొని వాలతాయి. తక్కువ చెల్లింపులు చేయగల మురికివాడలకు, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లడానికి కార్పొరేట్ కంపెనీలు సుతరామూ ఇష్టపడవు. సంపన్నులకు సేవలందించడానికి మాత్రం ముందుంటాయి (లాభం వస్తుంది కనుక). మధ్యప్రదేశ్‌లోని దివాస్ విపరీతమైన నీటి ఎద్దడితో కొట్టుకుంటోంది. సమీపంలోని ఒక పారిశ్రామిక ప్రాంతం కూడా నీటి ఎద్దడిని ఎదుర్కొంటోంది. పారిశ్రామిక ప్రాంతానికి సుదూరప్రాంతం నుంచి నీరు అందించే ఒక పథకం రూపుద్దికుంటోంది. కానీ ఆ నీరు నగరానికి అందదు. ఎందుకంటే నగర ప్రజలు దాని ఖర్చును చెల్లించలేరు కాబట్టి. అందువల్ల వారికి నీరందించే బాధ్యత ప్రభుత్వం పైనే పడింది. ఒక మాటలో చెప్పాలంటే సబ్సిడీలు, క్రాస్ సబ్సిడీలు తలొలగించివేయడం, నీటి ఛార్జీలు పెంచడం, ఛార్జీలు చెల్లించలేని వారికి నీటి సరఫరాను నిలిపివేయడం ఇవన్నీ ప్రయివేటీకరణలో అనివార్యం. ఈ రీతిలో చూస్తే ఇక నీటి రంగం ఒక సామాజిక బాధ్యతగా వుండబోదు. అది ఒక వినిమయ సరకుగా మారిపోతోంది. మన దేశంలో గత పదిహేనేళ్లగా విద్యుత్ రంగంలోనూ, ప్రపంచంలోని అనేక దేశాల్లో నీటి రంగంలోనూ ఇదే కోవలో సంస్కరణలు ప్రవేశపెట్టబడ్డాయి. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రపంచ వాణిజ్య సంస్థలు ఇదే విధానాన్ని అన్ని దేశాలమీద రుద్దుతున్నాయి.

నీరు అందరిదీ

గాలిలాగానే నీరు కూడా భూమి మీద వున్న సమస్త జీవరాశులకు సంబంధించినది. దీన్ని అనుభవించే ప్రత్యేక హక్కు ఏ ఒక్కరికీ పరిమితం కాదు. అది కూడా మరొకరికి నిరాకరించడం ద్వారా తామే అనుభవించేందుకు అసలు హక్కులేదు. ఇది ప్రజలందరిది. అన్ని స్థాయిల్లో ప్రభుత్వాలు దీన్ని కాపాడేందుకు కృషి చేయాలి. అన్ని ప్రాంతాల్లోని ప్రజలు దీన్ని పరిరక్షించుకునేందుకు సహకరించాలి. దీనర్థం నీటిని ప్రయివేటీకరించకూడదు. సరకుగా మార్చకూడదు. నీటితో వాణిజ్యం చేయకూడదు. వాణిజ్య ప్రయోజనాల కోసం ఎగుమతి చేయకూడదు. తమ తమ భూభాగాల్లోని నీటిని ప్రజా సంపదగా గుర్తిస్తూ ప్రభుత్వాలు ప్రకటించాలి. దాన్ని పరిరక్షించేందుకు చట్టాలు చేయాలి. భారీ ఎత్తున జరిగే నీటి వాణిజ్యాన్ని ప్రభుత్వాలు నిషేధించాలి. పట్టణాలు, ప్రాంతీయ స్థాయిలో భారీ నదులు, సరస్సులను కాపాడేందుకు వాటర్ షెడ్ల నిర్వహణలో సహకరించుకోవాలి. ★

నీళ్లు-నిజాలు

వేసవి వస్తోందంటేనే భయమేస్తోంది. నీటి కొరత దడ పుట్టిస్తుంది. బిందెలతో బారులు తీరే జనాలు కనిపిస్తారు. మరి నీటి సమస్య అంత విస్తృతమైనది. నీరు లభించని ప్రాంతాలలో ఎదురయ్యే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. నేల తల్లి నెర్రెలిచ్చి నీటిచుక్కకోసం ఆబగా ఎదురుచూస్తుంటే ఇక మానవమాత్రులెంత! గొంతు తడుపుకునే చుక్క నీటికోసం మైళ్లకు మైళ్లు నడిచిపోవాల్సిన పరిస్థితి. పరిశుభ్రమైన నీళ్లు దొరక్క కుంటల్లో, గుంటల్లో అడుగుబొడుగు మురికి నీటినే తాగాల్సిన దుస్థితి. ఇలాంటి కఠోర వాస్తవాలు కొన్ని...

◆ప్రపంచంలో 80 దేశాలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి.

◆ భూమండలంమీద లభించే నీటిలో ఉప్పు సుమద్రాల వాటా 97 శాతం. మిగిలిన దానిలో 69 శాతం హిమపాతం, మంచుగడ్డలే. భూమి మీద లభించే నీటిలో 0.008 శాతం మాత్రమే స్వచ్ఛమైన నీరు.

◆క్రీశ 2025 నాటికి 48 దేశాల్లో తీవ్రమైన నీటికొరత వస్తుందని చికాగోలోని జాన్ హాప్కిన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ హెచ్చరించింది.

◆3.575 మిలియన్ల మంది ప్రతి సంవత్సరం నీటికి సంబంధించిన వ్యాధులతో మరణిస్తున్నారు.

◆నీటిమూలంగా సంభవించిన 43 శాతం మరణాలకు అతిసారవ్యాధే కారణం.

◆పైన పేర్కొన్న మరణాలలో 84 శాతంమంది 14 ఏళ్ల లోపువారే.

◆98 శాతం మరణాలు అభివృద్ధి చెందుతున్న దేశాలలోనే సంభవిస్తున్నాయి.

◆ప్రపంచవ్యాప్తంగా వివిధ ఆసుపత్రులలో చికిత్సపొందుతున్న రోగులలో సగం మంది నీటి సంబంధ వ్యాధులతో బాధపడుతున్నవారే.

◆భూమిమీదున్న నీటిలో ఒక్క శాతానికంటే తక్కువ మొత్తం నీళ్లు మాత్రమే మానవాళి వెనువెంటనే వాడుకునేలా వున్నాయి.

◆అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని మురికివాడల్లో నివసించే ఒక వ్యక్తి రోజుమొత్తంమీద ఉపయోగించే నీరు ఒక అమెరికన్ స్నానానికి వాడే నీటితో సమానం.

◆లీటరు నీటికి మురికివాడల్లో నివసించే పేదలు, అదే నగంలోని ధనికులకంటే 5-10 రెట్లు అధికధర చెల్లిస్తున్నారు.

◆ఆహారం లేకుండా మనిషి కొన్ని వారాలపాటు వుండగలడు. కానీ నీరు లేకుండా కొద్దిరోజులు మాత్రమే వుండగలడు.

◆ప్రతి 15 సెకన్లకు ఒక చిన్నారి నీటి సంబంధ వ్యాధితో చనిపోతోంది.

◆లక్షలాది మంది మహిళలు, పిల్లలు రోజుమొత్తం మీద అనేక గంటల సమయాన్ని సుదూర ప్రాంతాలనుంచి నీళ్లు తేవడం కోసం వెచ్చిస్తారు.



విశ్వపుటంచులు

ఈ పరిశోధనలన్నీ ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన సామాన్య సాపేక్ష సిద్ధాంతాన్ని ఆధారం చేసుకుని జరుగుతున్నాయి. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రతి పదార్థానికి ప్రత్యేక గురుత్వాకర్షణ శక్తి వుంటుంది. ఆ శక్తి స్థల, కాలాలను (స్పేస్, టైం) వక్రీకరిస్తుంది. ఆ కారణంగా స్పేస్ వంగినట్లు వుంటుంది. కాలం మాత్రం మరింత వేగవంతమౌతుంది. లేదా నెమ్మదిస్తుంది. కాంతి కూడా స్పేస్‌లాగే వంగుతుంది. అంటే విశ్వం కూడా క్రమక్రమంగా వంపు తిరుగుతూ వుంటుంది. ఫలితంగా దానికి ఒక నిర్దిష్టమైన అంచు వుండే అవకాశం లేదు. మనం గనక తిన్నగా ఏ వంపులు లేకుండా... అంతరిక్షంలో ప్రయాణిస్తే, కొంత కాలానికి బయలుదేరిన చోటికి వస్తాము. అయితే నిజంగా అంచు లేకుండా ఉండకపోవచ్చు అని కొందరు అంటున్నారు. ఈ విశ్వపు ఆవిర్భావానికి పూర్వం... అంటే పదిహేను, ఇరవయ్యవ బిలియన్ కాంతి సంవత్సరాల క్రితం నుండి కాంతి మనవరకు చేరలేదు. బహుశా అది మార్గ మధ్యంలో వుందో లేక అసలు వంపు తిరుగుతూ సాగుతుందో తెలియదు. కాబట్టి విశ్వపు అంచుల గురించి మనం స్పష్టంగా చెప్పలేని పరిస్థితి.

భూమికి ఒక ఆకారం వుంది. అంటే దానికి ఒక అంచు వుండే అవకాశం వుంది అనుకోవచ్చు. కాని గోళాకారపు వస్తువులకు నిర్దిష్టమైన అంచు, అంతం వుండదు. మనం చివర అనుకున్నా అక్కడికి వెళితే ఆ కొన మరో చోట కనిపిస్తుంది. ఇది భూమి సంగతి. మరి భూమిని చుట్టుకుని వుండే ఆకాశం సంగతి ఏమిటి? దానికి అంచులు ఉంటాయా?

ఆకాశం నీ హద్దు అని వ్యక్తిత్వ వికాస గురువులు గొంతెత్తి చెబుతుంటారు. అది మనకి హద్దేమో కానీ దానికి హద్దులంటూ ఉన్నాయా అనేది శాస్త్రవేత్తలను వేధిస్తున్న ప్రశ్న. ఆకాశం ఒక చాపలాంటిదని, దానికి ఒక ప్రారంభం, అంతం వుడాలన్నది మన అవగాహన. అయితే విశ్వానికి అంతం (అంచు) అంటూ వుందని ఎవరూ ఒప్పుకోవడంలేదు. అది కూడా గోళాకారంలోనే వుండడం వలన అసలు అంచు అనే ప్రసక్తే రాదని కొందరి వాదన. యూరప్‌లో పరిశోధకులు దీని అంతు చూడాలన్న ఉద్దేశంతో అతి శక్తివంతమైన టెలిస్కోప్‌ను నిర్మించారు. దాని ద్వారా విశ్వపు అంచులను చూడడానికి ఆశపడుతున్నారు. ఇంతవరకూ ఎటువంటి కొసా దొరకలేదు.

ఈ పరిశోధనలన్నీ ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన సామాన్య సాపేక్ష సిద్ధాంతాన్ని ఆధారం చేసుకుని జరుగుతున్నాయి. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రతి పదార్థానికి ప్రత్యేక గురుత్వాకర్షణ శక్తి వుంటుంది. ఆ శక్తి స్థల, కాలాలను (స్పేస్, టైం) వక్రీకరిస్తుంది. ఆ కారణంగా స్పేస్ వంగినట్లు వుంటుంది. కాలం మాత్రం మరింత వేగవంతమౌతుంది. లేదా నెమ్మదిస్తుంది. కాంతి కూడా స్పేస్‌లాగే వంగుతుంది. అంటే విశ్వం కూడా క్రమక్రమంగా వంపు తిరుగుతూ వుంటుంది. ఫలితంగా దానికి ఒక నిర్దిష్టమైన అంచు వుండే అవకాశం లేదు. మనం గనక తిన్నగా ఏ వంపులు లేకుండా... అంతరిక్షంలో ప్రయాణిస్తే, కొంత కాలానికి బయలుదేరిన చోటికి వస్తాము. అయితే నిజంగా అంచు లేకుండా ఉండకపోవచ్చు అని కొందరు అంటున్నారు. ఈ విశ్వపు ఆవిర్భావానికి పూర్వం... అంటే పదిహేను, ఇరవయ్యవ బిలియన్ కాంతి సంవత్సరాల క్రితం నుండి కాంతి మనవరకు చేరలేదు. బహుశా అది మార్గ మధ్యంలో వుందో లేక అసలు వంపు తిరుగుతూ సాగుతుందో తెలియదు. కాబట్టి విశ్వపు అంచుల గురించి మనం స్పష్టంగా చెప్పలేని పరిస్థితి.

అయితే విశ్వంలో స్పేస్ అన్ని దిశల్లో నిరంతరంగా వ్యాప్తి చెందుతూ వుంటుంది. ఇటువంటి ఓపెన్ విశ్వంలో ప్రతి ప్రదేశం కొత్తగానే అనిపిస్తుంది. అంటే నక్షత్ర మండలాలు కొత్తగా కనిపిస్తాయి. ఐన్‌స్టీన్ ప్రకారం విశ్వపు వంపు దానిలోని పదార్థం, శక్తిపై ఆధారపడి వుంటుంది. కొంతమంది అసలు విశ్వం బల్లపరుపుగా వుందని అంటున్నారు. అయితే ఆ సిద్ధాంతం అంతగా ఆకట్టుకోలేదు. మన విశ్వంలోని పదార్థం బరువు వల్ల అది బల్లపరుపుగా వుంటుందని వారి వాదన. నిజానికి కొత్త పరిశోధనల వల్ల తేలింది ఏమిటంటే, మొత్తం పదార్థం కావలసినదానిలో కేవలం ముప్పై అయిదు శాతం వుంది. పైగా అనేక శక్తి కారకాల వల్ల విశ్వం మరింత వంపు తిరిగే అవకాశం వుందని అంటున్నారు.

ఒకవేళ గురుత్వాకర్షణ శక్తితో కాంతిని, కాలాన్ని వంచగల మేర పదార్థం వుంటే, మొత్తం ఒక భారీ గోళంలా వుంటుందని, అటువంటి విశ్వం క్రమేపీ తనలో తానే కూరుకుపోతుందనీ అంటున్నారు. తాజా పరిశోధనలు అంత మేర పదార్థం లేదని నిర్ధారించాక విశ్వంలా కాకుండా అనంతంగా ఒక చాపలా వుందన్న అభిప్రాయం వచ్చింది. అయితే దాని అంచు ఎక్కడో తెలిసే అవకాశం మాత్రం ఎన్నటికీ లేదు.

డా॥ విజయ్

S	R	R	J	V	K	W	A	H	W	O	R	R	A	P	S	M
E	M	O	E	R	U	T	L	U	V	C	E	L	M	P	Y	M
C	R	D	G	N	M	P	G	C	G	D	G	H	E	H	J	D
R	P	N	T	C	V	V	I	E	H	J	E	E	T	J	N	L
E	C	O	L	A	C	T	V	L	D	V	A	D	I	Y	I	J
T	C	C	E	N	O	C	L	A	F	C	J	K	K	L	W	O
A	T	A	Z	A	V	G	Y	B	L	T	E	D	A	G	G	V
R	R	C	R	I	G	X	R	N	Q	S	G	M	V	D	R	V
Y	L	P	S	A	C	L	D	E	T	E	M	W	R	G	O	U
B	Y	E	M	V	C	R	E	R	I	E	H	A	B	V	A	I
I	I	E	P	N	T	A	E	E	R	R	Z	V	M	E	D	L
R	I	A	R	B	E	L	R	G	D	Z	R	L	B	B	R	X
D	Y	M	T	P	G	L	E	A	U	N	N	A	Q	R	U	H
C	V	M	T	Y	S	I	I	B	V	D	V	R	H	N	N	C
R	K	W	A	H	E	O	V	Z	N	V	Y	H	A	B	N	R
L	B	V	P	R	V	H	T	T	X	R	Z	D	C	J	E	V
N	O	C	L	A	F	E	N	I	R	G	E	R	E	P	R	E

ఎక్కడున్నాయో...!

ఫ్రెండ్స్.... కింద 15 పేర్లు వున్నాయి. అవి పైనున్న బాక్సులో అడ్డంగానో, నిలువుగానో ఎలావున్నా సరే గుర్తుపట్టి సున్నా చుట్టండి.

1.BUZZARD, 2.CARACARA, 3.CONDOR, 4.EAGLE, 5.FALCON, 6.HARRIER, 7.JAEGER, 8.KESTREL, 9.KITE, 10.OWL, 11.FALCON, 12.ROADRUNNER, 13.SPARROWHAWK, 14.VULTURE, 15.OSPREY.

దేని విలువ ఎంత?

ఫ్రెండ్స్... కింద బాక్సును చూస్తే మీకు అర్ధవృత్తాలు, నక్షత్రాలు, త్రికోణాలు, చతురస్రాలు కనిపిస్తున్నాయి కదూ. అలాగే ప్రతి లైను చివరిలో కొన్ని అంకెలు కూడా వున్నాయి కదా. ఇప్పుడు మీరేం చేయాలంటే ఏ గుర్తు విలువ ఎంతో కనిపెట్టాలి. తర్వాత ఆ విలువలను ప్రతి బాక్సులో వేసి ప్రతి లైనులో వున్న అంకెలను కూడండి. వాటి మొత్తమే ఆలైను చివరిలో వున్న అంకెకు సమానం.



10
11
10
10

7 12 10 12



సర్దగలరా?

హాయ్... ఇవాళ మీకో పజిల్ తెచ్చామర్రా. పైన అగ్గి పుల్లలతో ఒక చక్రంలాంటి ఆకారంలో 6 త్రిభుజాలు వున్నాయి. వాటిలో నాలుగు పుల్లలను కదిలించి వేరే చోట ఎక్కడైనా పెట్టి 3 త్రిభుజాలను చేయాలి.

తేడాలు కనిపెట్టేస్తే పోలా...



బాలనేస్తాలు

నేర్చుకుందాం





దారి చెప్దామా!

నే స్తాలూ! ఈ ఎలుకకు బాగా ఆకలిగా వుంది. కేకు ముక్క దగ్గరకు వెళ్లాలి. మరి దారి చెప్పండే!

చెప్పండి చూద్దాం

ఫ్రెండ్స్... కింది బొమ్మలో ఏం కనిపిస్తున్నాయి? ఆ... కొండ, కొండమీద చెట్లు, చిన్న పొదలు... ఇలా ఏవేవో కనిపిస్తున్నాయి కదూ. కాస్త పరిశీలనగా చూసి ఇప్పుడు చెప్పండి అక్కడ ఇంకా ఏం కనిపిస్తుందో.

చుక్కలు కలిపేద్దాం



జవాబులు

తేడాలు కనిపెట్టేస్తే పోలా!: 1. పక్షి కూర్చున్న కొమ్మమీది ఆకు, 2.కుక్కపిల్ల నోట్లోనుండి కింద పడుతున్న ఎముక, 3.ఎలుక పక్కనే వున్న చిన్న రాయి, 4. అబ్బాయి టోపీ, 5. ఎలుక తోక

చెప్పండి చూద్దాం: తాత ముఖం వెల్లికిలా పడుకున్నట్లు కనిపిస్తుంది.

లెక్కిద్దామా...:

1	3	4	2
1	4	3	3
2	4	1	3
3	1	2	4



అధికారులు - పనివాళ్లు

- రంగనాథ రామచంద్రరావు

ఇద్దరూ అధికారులు. వాళ్లలో ఒకరిని పెద్ద అధికారి అనొచ్చు. మరొకరు మామూలు అధికారి. ఇద్దరూ కలిసికట్టుగా సర్వీసులో ఉన్నవాళ్లు. సుమారు 35 ఏళ్ల ఆఫీసులో ఉన్నవాళ్లు, రాసిన వాళ్లు, ఎదిగిన వాళ్లు. పెద్ద అధికారి నాలుగేళ్ల గంధపు నూనె కార్ఖానాలో మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉండడం తప్పితే ఇద్దరూ తమ జీవితంలోని అనేక వత్సరాలను విధాన సభలోని ప్రణాళికా విభాగంలో గడిపారు. ప్రతి ఏడూ ప్రణాళిక వేయడానికి అంకెలు, అంశాలు సేకరించడం, కూడడం, తీసివేయడం, లెక్క చేసినదాన్ని ఆఫీసులో చెక్ చేయడం, బయటి నుంచి వచ్చిన అభ్యర్థనలను చూచి ఒక పక్కన పెట్టడం, వాటిపై ఏదైనా తప్పక రాయాల్సి వచ్చినప్పుడు 'పని వీలు కాదు', ఆర్థిక అనానుకూలం', మొదలైన నోట్స్ చేయడం, అంగీకరించేట్టు ఉంటే 'తమ సూచనలు గమనించబడును' అని తెలియచేయడం, వీటిలోనే వారి జీవితంలోని అధిక భాగం గడిచిపోయింది. ఇంట్లో నౌకర్లు చాకర్లు ఉన్నారు. ఆఫీసులో జవాన్లు ఉన్నారు. పూర్వంలో ఇనాందారీ కుటుంబీకులు కావడం వల్ల కూరగాయలు, బియ్యం, గోధుమలు పల్లె నుంచి వస్తాయి. వాటిల్లో వాళ్లకు ఆసక్తి లేదు. ఆఫీసే వారికి లోకం. దస్తావేజులు పెట్టడంలో, క్లిష్టమైన లెక్కలను చేయడంలో నిష్ణాతులని పేరు తెచ్చుకున్నారు. ఒకసారి కర్నాటక ప్రభుత్వం అధికారులకు బిరుదులివ్వాలనే ఉత్సాహం కలగడంతో ఈ పెద్ద అధికారికి 'జంటగా బిరుదు' ఇవ్వాలనే సూచన కూడా ఉండింది. అదేలాగో ఈ ఇద్దరు అధికారులు బిరుదు కోసం ప్రయత్నాలే చేయలేదని రాజకీయ నాయకులకు తెలిసి మిన్నకుండిపోయారు.

ఇలా ఉండే పెద్ద అధికారి మామూలు అధికారి రిటైరయ్యారు. పదవీ విరమణ రోజున తమ తమ ఇళ్లకు వెళ్లి సుష్టుగా భోంచేసి పడుకున్నారు. అయితే ఉదయం వాళ్లిద్దరి కోసం ఆశ్చర్యం కాచుకునుంది. మామూలు అధికారి పొద్దున్నే లేచి కళ్లు నులుముకుని చూశాడు. ఓ నిర్జన ప్రదేశంలో పెద్ద అధికారి పక్కన తాను అంతవరకు పడి ఉండి లేచాడని గ్రహించాడు. కళ్లు నులుముకుని చూశాడు. గిల్లుకుని చూశాడు. కల కాదు. చేతికి కట్టుకున్న వాచీ, ఒంటి మీదున్న దుస్తులు తప్ప వేరే ఏమీ లేవు. ఉదయం ఏడుగంటలై, సూర్యుడుదయించి మనిషెత్తుకు వచ్చినప్పటికీ పెద్ద అధికారి పడుకునే ఉండడం చూచి "సార్, తెల్లవారింది, లేవండి" అన్నాడు మామూలు అధికారి.

"కాఫీ ఎక్కడ?" అంటూ పెద్ద అధికారి లేచాడు. మామూలు అధికారి, ముఖంలో భయం, కలవరం నింపుకుని పెద్ద అధికారికి అంతా వివరించసాగాడు. పెద్ద అధికారికి తన సహోద్యోగి మాటల్లో నమ్మకమే కలగలేదు. బెంగుళూరు నుంచి ఒకటి రెండు మైళ్ల దూరంలో తామంతా పిక్‌నిక్‌కు వచ్చి ఉండొచ్చనుకుంటూ గిల్లుకున్నాడు. నేలను తాకి చూశాడు. కాదు, కల కాదు. ఇద్దరూ తమ స్థితిని గురించి చర్చించసాగారు. నోట్స్ చేయడానికి పెన్ను, పేపరు కూడా లేదు. లేచి తామున్న ప్రదేశాన్ని పరీక్షించసాగారు. దూరంలో చెట్ల తోపు, నది ఉన్నట్టు కనిపించింది. ఏ దారిగానీ, రాస్తాకానీ లేకపోవడం వల్ల జనాలు లేరనేది స్పష్టమైంది.

"ఆహారం కోసం ఏం చేద్దాం?" అని పెద్ద అధికారి అడిగాడు. తన బాస్‌కు ఎలా నచ్చచెప్పాలా అని సతమతమై మామూలు అధికారి చేతులు నులుముకున్నాడు. తినడానికి ఏదైనా దొరుకుతుందా అని ఇద్దరూ అటూఇటూ తిరగసాగారు. చెట్ల దగ్గరికి వచ్చారు. మామిడి చెట్లు, కొబ్బరి చెట్లు, పనస చెట్లు అన్నీ ఉన్నాయి. పళ్లు కూడా కాచాయి. కానీ ఎక్కడం ఎలా?" "ఏమండీ, మీరే చెట్టెక్కి కొబ్బరి కాయలు దింపండి" అని పెద్ద అధికారి అనగానే మామూలు అధికారి 'చెట్టు ఎక్కడం రాదు' అని చెప్పడానికి సిగ్గుపడి, కొబ్బరి కాయల చెట్టు ఎక్కడానికి ప్రయత్నం చేసి నాలుగడుగులు పైకి సాగేలోపు జారి, ఉన్న ఒక చొక్కాను చింపుకున్నాడు. పెద్ద అధికారి పనస చెట్టు ఎక్కబోయి పట్టు తప్పి పడ్డాడు.

ఇద్దరూ నిరాశ చెంది ఏటి గట్టుకు వచ్చారు. కావలసిన చేపలు ఉన్నాయి. కానీ వాటిని పట్టడం ఎలా? వాటిని చూస్తూ నుంచున్నారు. చివరికి తిరుగుతూ ఉంటే ఏదైనా దొరకవచ్చని ఊరక చెరువు గట్టు వెంబడి నడవసాగారు. అడివే వారి కోసం ఎదురు చూస్తోంది. అక్కడ జింకలు, పందులు, కుందేళ్లు వాళ్లను చూచి పరిగెత్త సాగాయి. ఇద్దరికీ ఆకలి పెరుగుతూ పోయింది. చివరికి అడివి కూడా తమకేమీ ఇవ్వలేదనిపించి ఆగిపోయారు.

"సార్ ఇప్పుడొక పని చేద్దాం" అన్నాడు మామూలు అధికారి. కొత్త ఐడియాలు ఇవ్వడంలో మామూలు అధికారి నిష్ణాతుడైనందువల్ల పెద్ద అధికారి కుతూహలంతో విన్నాడు. "మీరు దక్షిణానికి వెళ్లండి. నేను ఉత్తరానికి వెళ్తాను. దేన్నైనా సంపాదించుకుతీరాలి. ఆకలేస్తుంది" అన్నాడు మామూలు అధికారి.

"ఉత్తరమేది, దక్షిణమేది?" అడిగాడు పెద్ద అధికారి. సూర్యుడు మబ్బు చాటుకు పోవడంతో కాస్త ఆగి మామూలు అధికారి అన్నాడు "పశ్చిమానికి ముఖం చేసి నుంచుంటే నా ఎడమ వైపున ఉన్నదే దక్షిణం". "కుడివైపున ఉన్నది ఎందుకు దక్షిణం కాకూడదు" అని పెద్ద అధికారి అన్నాడు. మామూలు అధికారి తికమక పడసాగాడు. ఇసుక మీద మ్యాప్ గీసి చూపితే పెద్ద అధికారి నిజ జీవితంలో దానికి వ్యతిరేకంగా ఉండడం సాధించి చూపసాగాడు. ఇద్దరికీ తలలు చెడిపోసాగాయి. "నీవు ఈ దిక్కులో వెళ్లు. నేను ఆ దిక్కులో వెళ్తాను" అని పెద్ద అధికారి నడవసాగాడు. పొట్ట తాళం వేయడం మొదలై ఇద్దరి తలలు పాడవసాగాయి. "రాత్రికి ఇక్కడికే రండి" అని మామూలు అధికారి 'సార్' కూడా చేర్చకుండా పెద్ద అధికారిని కేకేశాడు.

ఇద్దరూ పొద్దువాలేంత వరకూ నడిచి అలసిపోయి ముందుగానే తెలిసిన అడివి అంచుకు చేరారు. ఏమీ దొరకలేదు. ఎవరూ తారసపడలేదు. మామూలు అధికారి మాత్రం చేతిలో ఓ పేపర్ పట్టుకుని వచ్చాడు. "హిందూ పేపర్ అక్కడ పడి ఉంది" అని మామూలు అధికారి అనగానే పెద్ద అధికారి దాన్ని చప్పున లాక్కుని "కాస్త పాత పేపర్, అయినా ఫరవాలేదు. ప్రస్తుతం చదవడానికి పేపర్ దొరికింది కదా" అని చూడసాగాడు. "గవర్నర్‌గారు నిన్న సాయంత్రం నగర ప్రముఖులకు గొప్ప విందు ఏర్పాటు చేశారు. కర్నాటకలో జనప్రియమైన మద్దూరు వడ, 'కొడుగు' పనస అప్పడాలు,

గుల్బర్గా నూనె వంకాయ కూర, మైసూరు బొబ్బట్లు అన్నీ చక్కగా చేయబడ్డాయి" అని పెద్ద అధికారి చదవగానే ఆకలి తీవ్రమై మామూలు అధికారి "సార్! ఆహారం గురించి చదవకండి. చచ్చిపోతాను" అంటూ పేపర్ లాక్కున్నాడు. సంపాదకీయ వ్యాసాలు చదవలేక చివరకు "ఈ మధ్య వ్యవసాయ విశ్వవిద్యాలయం కనిపెట్టిన మల్లికా మామిడి పండు అత్యంత తీపి రుచిని కలిగి ఉంది" అని చదివి పేపర్‌ను విసిరేశాడు.

రాత్రి ఎక్కడ పడుకోవాలో తోచక ఇద్దరూ తమ పెన్షన్ డబ్బులు ఏయే విధంగా ఇన్‌వెస్ట్ చేయాలో చర్చించారు. కాలం గడవడం లేదు. ఆకలి రగులుకొని మండసాగింది. పెద్ద అధికారి ఆచరణలో నమ్మకమున్న వాడవడంవల్ల లేచి పచారు చేయసాగాడు. "ఏదైనా ఆట తెలుసునేమండి" అని అడిగితే మామూలు అధికారికి ఏమీ తెలియదు. ఎలాగో తెల్లవారింది. ఉదర బాధ పెరుగుతూ పోయింది. పెద్ద అధికారి "నీ వల్లే ఇలా అయింది" అంటూ చేతి కింది మనుషుల్ని తిట్టే రీతిలోనే మాట్లాడాడు. మామూలు అధికారి కోపం, ఆకలితో బాధపడుతూ "నా వల్లే" అన్నాడు. పెద్ద అధికారి అతని కాలర్ పట్టుకోగానే మామూలు అధికారి విడిపించుకోవడానికి పెనుగులాడాడు. పెద్ద అధికారి అతని చేయి కరిచాడు. రక్తం కనిపించగానే ఇద్దరూ బెదిరిపోయి మౌనంగా కూర్చున్నారు.

చివరికి మామూలు అధికారి, "ఒక ఐడియా తట్టింది" అంటూ లేచాడు. మామూలు అధికారి నడవసాగాడు. ఎలాంటి ఆశ లేకపోయినా పెద్ద అధికారి అనుసరించాడు. చాలా దూరం నడిచారు. అటూ ఇటూ చూస్తూ వెళ్లారు. చివరికి ఏటి పక్కన ఒక రైతు పడుకుని ఉండడం కనిపించింది. పెద్ద అధికారి గట్టిగా "ఒరే పల్లెటూరి మొద్దూ, లే!" అని గదమగానే పనివాడు లేచి "అయ్యగారూ" అంటూ చేతులు జోడించాడు.

"సోమరి వెధవా, నిద్రపోతూ కాలం గడుపుతావా? కొబ్బరి చెట్టెక్కి కొబ్బరి బోండాలు తెంచుకుని రా" అన్నాడు మామూలు అధికారి. గంభీరమైన ఎత్తు, కాంతివంతమైన ముఖం, అధికార స్వరానికి భయంతో చెమటలు పట్టిన పనివాడు తలకు తుండు చుట్టుకుని కొబ్బరి బోండాలు దింపాడు. అయ్యగారికి అలసట కలగడం, కోపం రావడం వాడికి తెలిసిపోయింది. వాళ్ళు కొబ్బరి నీళ్లు తాగుతూ ఉండగా మామిడి చెట్టు, పనస చెట్టు ఎక్కి పళ్లు కోసి ఇచ్చాడు. వాళ్లు ఆజ్ఞాపించక మునుపే అడివిలోకి దూరి కుందేలు, పంది, జింకలను చంపి తెచ్చి వెదురు బొంగులు రాపాడి మంట చేసి వంట చేశాడు. అధికారులిద్దరూ సుఖంగా భోజనం చేశారు. పనివాడు వాళ్లు ఒదిలేసిన కుళ్లిన పండ్లు,

"కాఫీ ఎక్కడ?" అంటూ పెద్ద అధికారి లేచాడు. మామూలు అధికారి, ముఖంలో భయం, కలవరం నింపుకుని పెద్ద అధికారికి అంతా వివరించసాగాడు. పెద్ద అధికారికి తన సహోద్యోగి మాటల్లో నమ్మకమే కలగలేదు. బెంగుళూరు నుంచి ఒకటి రెండు మైళ్ల దూరంలో తామంతా పిక్‌నిక్‌కు వచ్చి ఉండొచ్చనుకుంటూ గిల్లుకున్నాడు. నేలను తాకి చూశాడు. కాదు, కల కాదు. ఇద్దరూ తమ స్థితిని గురించి చర్చించసాగారు. నోట్స్ చేయడానికి పెన్ను, పేపరు కూడా లేదు. లేచి తామున్న ప్రదేశాన్ని పరీక్షించసాగారు. దూరంలో చెట్ల తోపు, నది ఉన్నట్టు కనిపించింది. ఏ దారిగానీ, రాస్తాకానీ లేకపోవడం వల్ల జనాలు లేరనేది స్పష్టమైంది.

ఎముకలు చీకుతూ వారి ఆజ్ఞ కోసం ఎదురుచూడసాగాడు. వాళ్లేమీ చెప్పకుండా తమ ఆఫీసు, పెన్షన్ గురించి మాట్లాడుతూ ఉండడం వల్ల "నేను కొంచెం సేపు పడుకుందునా దొరా" అన్నాడు.

"దానికంటే ముందు ఒక మంచి తీగను కోసుకురా. అది గట్టిగా ఉండాలి" అన్నారు వాళ్లిద్దరూ.

అతను గట్టి తీగ తెచ్చిన వెంటనే అతడి కాళ్లు చేతులు కట్టి చెట్టుకు బిగించి సరిగా బందోబస్తు చేసి, "సోమరి వెధవా, ఎక్కడికైనా తప్పించుకుపోతావేమో జాగ్రత్త!" అన్నారు. దాంతో పనివాడు కట్టేసిన చోటనే నిద్రపోయాడు.

అధికారుల జీవితం సక్రమంగానూ, ప్రశాంతంగానూ సాగిపోసాగింది. పనివాడు కష్టపడి వేటాడేవాడు. చేపలు తెచ్చేవాడు. పళ్లు తెంచేవాడు. పది పన్నెండు మైళ్లు వెళ్లి ఉప్పు, చింతపండు కూడా తెచ్చి వంట చేసేవాడు. అధికారులు ఊరికి వెళ్లడమే మరిచారు. తమ పెన్షన్ బాగా పెరిగాక వెళ్తే బాగుంటుందని నిర్ణయించుకున్నారు. అప్పుడే పనివాడితో ఒక బండి తయారుచేయమని చెప్పారు.

"రేయ్ గాడిదా! బండి బాగుండాలి. బండి లాగేవాడివి నీవే గుర్తుంచుకో" అని హెచ్చరించారు. సంభాషణ ఆహ్లాదంగా ఉంది.

మామూలు అధికారి "సార్! రామాయణం కథ జరిగిందేనంటారా?" అని అడిగేవాడు.

"మరి! ఇప్పటికీ దండకారణ్యం, అయోధ్య, లంక ఉండడం దాన్ని సూచిస్తుంది కదా" అంటూ పెద్ద అధికారి వివరిస్తాడు.

"అది కాదు సార్! కోతులు మాట్లాడడం కాస్త..."

"డార్విన్ థియరీ ప్రకారం మనిషి ఒక దశలో అలా ఉండేవాడు" అని పెద్ద అధికారి వివరించేవాడు.

మరోసారి "తూర్పు-పడమరలు ఉండడం విచిత్రం" అని పెద్ద అధికారి ఆశ్చర్యపోయేవాడు.

"అదేం కాదు, సూర్యుడు లేకుంటే ఏది తూర్పు, ఏది పడమర అని తెలిసేది కాదు" అని మామూలు అధికారి విస్మితుడయ్యేవాడు.

కొద్ది రోజుల్లో బండి తయారైంది. మంచి టేకు చెట్టును నరికి, కోసి, నునుపు చేసి, పనివాడు బండి తయారుచేశాడు. దాన్ని అధికారుల ముందుకు తెచ్చి నిలిపి పనివాడు ఒంగి నుంచున్నాడు. వాళ్ల మెప్పుకోసం ఎదురు చూశాడు.

"ఛీ! గబ్బు ముండా కొడుకువి కదరా. గతిలేని వాడిలా చేశావు" అని అధికారులు బండెక్కి కూర్చున్నారు. వారు బండి ఎక్కడమే పనివాడికి వారి మెప్పుదలకు పరాకాష్టగా కనిపించింది. హుషారుగా బండి లాగుతూ "మల్లేశ్వరానికి కద సార్!" అన్నాడు.

అదెలా తెలిసిందో? బెంగుళూరులోని, మల్లేశ్వరంలోని ఎనిమిదవ క్రాస్!

తొందరగా, తొందరగా లాగు! చాలా సోమరివయ్యా నువ్వు. రద్దీ ఎక్కువ. జాగ్రత్తగా లాగాలి" అన్నారు.

విచిత్రమేమంటే ఆ పనివాడికి బెంగుళూరు దారి, మధ్య దారిలో నిలిపేటప్పుడు యజమానులు విశ్రమించాల్సిన జాగా, వంట తయారు చేయడానికి అనుకూలమైన స్థలం అన్నీ తెలుసు. బెంగుళూరు చేరేసరికి రాత్రయింది.

పెద్ద అధికారి "వీణ్ణి రెండు రోజులు తమ దగ్గరే ఉండనీ" అని అధికార స్వరంతో చెప్పడం వల్ల మామూలు అధికారి మిన్నకుండిపోవాల్సి వచ్చింది. పైగా మామూలు అధికారి తాను రేపటి రోజున తీసుకోవాల్సిన నాలుగైదు నెలల పెన్షన్ గురించి ఆలోచించసాగాడు. పెద్ద అధికారి ఇల్లు చేరి పిల్లలతో మాట్లాడుతూ సంతోషపడ్డాడు. ఇంటి భోజనం చాలా బాగుంది. పడుకోబోయే ముందు పనివాడు గుర్తొచ్చి వాడి వైపు ఓ కంబళి విసిరి "తోటలో పళ్లున్నాయి. దొంగలు కోయకుండా చూడాలి" అని అన్నాడు.

పనివాడు ఆకలితో ఎదురు చూడసాగాడు. అధికారి చివరకు ఒక రొట్టె ముక్క విసిరి "పడుకో" అంటూ తలుపులు మూసుకున్నాడు.

అయ్యగారు సంతృప్తులైనందుకు పనివాడు కుదుటపడి రొట్టెముక్క తింటూ కూర్చున్నాడు.

★

క్రైమ్ కథ

ఖరీదైన జీవితం

- యర్నాగుల సుధాకరరావు

"వ్యాపారవేత్త భూపాల్‌ను ఎవరో మూడునెలల క్రితం హత్య చేశారు. మనకు హంతకుడు ఎవరైంది తెలియలేదు. భూపాల్ సూట్‌కేసులో పదిలక్షలు తీసుకుని వస్తుండగా డబ్బుకోసం ఈ హత్య జరిగిందని వాళ్ల కుటుంబసభ్యులు చెబుతున్నారు. దీనిపై ఆ రాత్రి డబ్బు ఇచ్చిన శేఠ్‌ని అనుమానించి ప్రశ్నించాం. ఒక చేత్తో ఇచ్చి కారును వెంబడించి మరో చేత్తో హత్యచేసి ఆ డబ్బును తీసుకున్నావనే అభియోగంతో ఇంటరాగేషన్ చేశాం. కానీ, అతడు అలాంటి ఘాతుకానికి పాల్పడలేదని తేలింది. స్వరూప్, నీవు ఎలాగైనా ఈ కేసును సాల్వ్ చేయాలి. నీవు ఎవరిని అనుమానించినా వారిని వదలకుండా వెతికిపట్టుకో!" అన్నాడు పోలీసుకమిషనర్.

భూపాల్ హత్యాస్థలం పరిధిలోగల పోలీస్ ఠాణాకు స్వరూప్ వెళ్లాడు. అక్కడ మరిన్ని వివరాలు సేకరించాడు. అప్పుడే ఇద్దరు చిల్లర గూండాలను తెచ్చి సెల్‌లో పడేశారు కానిస్టేబుళ్లు.

వారిని చూడగానే "ఏరా నీవు అప్పుడెప్పుడో రైలులో దొంగతనం చేసి దొరికిపోయావు. శిక్ష కూడా పడింది. బెయిల్‌మీద వచ్చావా? నీతో మరో తోడుదొంగ చాకులాంటోడు ఉండేవాడు. వాడేడి?" సెల్ దగ్గరకు వెళ్లి అడిగాడు స్వరూప్.

"సింగ్‌గాడా, ఈమధ్య వాడికి అదృష్టం కలిసివచ్చింది. ఆడికి ఎవరో పిల్లను కూడా ఇస్తున్నారట. జేబులు కొట్టడం మానేశాడు. జల్సాగా ఖర్చుచేస్తున్నాడు. ఇదిగో కొత్తగా ఈ కేడినాకొడుకుతో రంగంలోకి దిగాను. ఇంకా బోణీ కాలేదు. మనోళ్లు తెచ్చిపడేశారు" మద్యం మత్తులో తూలుతూ చెప్పాడు.

జోగుతున్నవాడిని "ఏరా సింగ్ అడ్రస్ చెప్పు. వాణ్ణి కలవాలి" అనడిగాడు స్వరూప్.

"సార్ సెల్‌నెంబర్ చెబుతాను" గుర్తుచేసుకుని మరీ చెప్పాడు.

ఆ రాత్రి సింగ్ ఇంటిమీద స్వరూప్ పోలీసులతో వెళ్లి దాడి చేశాడు. సింగ్ బాగా తాగి నిద్రపోతున్నవాడల్లా పోలీసులను చూడగానే బెదిరిపోయాడు. ఇల్లంతా జల్లెడపట్టారు. ఖరీదైన వస్తువులు చూశాక స్వరూప్‌కు అనుమానం దృఢపడింది. సింగ్‌ను నేలమీద పడదోసి "ఏమిట్రా జేబులు కొట్టేవాడివి ఖరీదైన వస్తువులతో ఇల్లు నింపేశావు. ఎలా లేదన్నా వేలమీద ఉంటాయి. నీవు తాగిన మద్యం కూడా పెద్దఖరీదైనదే. ఇదంతా ఎక్కడ కొట్టుకువచ్చావు?"

"సాబ్ మీకు తెలియంది కాదు. నేను బస్టాండులో పర్సులు కొట్టే వాడిని కానీ, ఆ వృత్తి మానేశాను. అందరిలా బతకాలనుకుంటున్నాను" అంతలోనే ఒక కానిస్టేబుల్ పెద్దమొత్తంలో కరెన్సీ కట్టలు ఉన్న సూట్‌కేసును అటకమీది నుంచి కిందకు దించాడు. లెక్కపెట్టారు. పన్నెండు లక్షలున్నాయి.

స్వరూప్ సింగ్‌ను దొరికిన డబ్బుతో వ్యాన్ ఎక్కించుకుని ఠాణాకు తీసుకుపోయాడు. అక్కడ ఇంటరాగేషన్ చేశాడు. ఇక దాచి లాభం లేదని నిజం చెప్పేశాడు.

"ఆ రోజు రాత్రి జాం బజార్ రెస్టారెంట్ దగ్గర తాగి పేవ్‌మెంటుమీద కూర్చుని ఒక ఫ్రెండు కోసం ఎదురుచూసి అలా నిద్రపోయాను. ఢామ్మని శబ్దం కావడంతో కళ్లు తెరిచి చూశాను. నాకు పది అడుగుల దూరంలో నల్ల అంబాసిడర్ కారు ఆగి ఉంది. స్టీరింగ్‌మీద భూపాల్ వాలిపోయి ఉన్నాడు. ఆ చంపిన గూండా మున్నా రివాల్వర్ జేబులో పెట్టుకుని వెంటనే జీప్‌లో పారిపోయాడు"

"గూండా మున్నానా భూపాల్‌ను చంపింది...!"

"మున్నా చంపడం నా కళ్లారా చూశాను. నేను పెద్దనేరగాణ్ణి అయినా నాకెందుకో ఆ హత్య భయంగొల్పింది. ఆ పేవ్‌మెంటు మీద నేనొక్కడినే ఉన్నాను. స్టీరింగ్ ముందు వాలిపోయి చచ్చిన వాడిజేబుల్లో ఎంతోకొంత ఉంటుంది... కొట్టేద్దామని వెళ్లాను. శవం జేబులో పర్సులేదు. పక్కనే పడున్న సూట్‌కేసు నాకు కన్పించింది. అందుకుని చీకటి సందులోకి పరుగెత్తాను. అలా ఎంతసేపు పరుగెత్తానో నాకే తెలియదు. ఏమాత్రం పోలీస్ వ్యాన్ శబ్దం విన్పించినా ఏదో ఇంటిగుమ్మంలో నిద్రపోతున్న వాడిలా నటించి చివరికి నా ఇల్లు చేరాను. ఇంటికి చేరాక లెక్కపెట్టాను. అబ్బో లక్షలు! ఎన్ని పాకెట్‌లు కొడితే రాలుతుంది? నాకు దేవుడే ఇచ్చాడని చాలా ఆనందించాను. తీరా ఎలా తెలుసుకున్నారో నన్ను పట్టుకున్నారు. నా అదృష్టం ఇలా నా తలుపు తట్టి అలా మీతో తలుపు తట్టించింది" అని బావురుమన్నాడు.

"గూండా మున్నా నిన్ను చూడలేదా?"

"నన్ను వాడు పేవ్‌మెంట్‌మీద పడుకుని ఉండడం చూసి ఉండడు. ఎందుకంటే నా బట్టలు దుమ్ముధూళితో ఉన్నందువల్ల ఎవడో తాగి పడిపోయాననుకున్నాడు. ఒకప్పుడు ఆడి గ్యాంగ్‌లో పనిచేశాను. ఆడు హత్య చేసినప్పుడు చాలా టెన్షన్‌తో ఉన్నాడు. కారణం ఆడిచేతిలో చనిపోయిన భూపాల్ పెద్దనేరగాడు. ఎదురుకాల్పులు జరపగలడని టెన్షన్‌పడి ఉంటాడు"

ఆ వెంటనే మున్నాను పోలీసులు తీసుకుని వచ్చారు. అతడు తొలుత కాదన్నా తానెందుకు చంపాల్సి వచ్చిందో చెప్పాడు.

"భూపాల్ నేరవృత్తిని వదల్లేదు. ఎవరితో కలిసి వ్యాపారం చేసినా వారిని ముంచేసేవాడు. అందుకే అతడితో తీవ్రంగా నష్టపోయిన వారంతా కలిసి నాకు ఐదులక్షలు ఇచ్చి చంపమని కోరారు. నేను హత్యచేశాను. లిప్తపాటులో జేబులోంచి పిస్తోలు తీయగల సామర్థ్యం ఉన్న భూపాల్‌ను చంపడం చాలా కష్టం. కారును జీపుతో అడ్డం వేసి అతడి తలపై కాల్చాను. అతడు పిస్తోలు తీసేలోపే ఆ పని చేశాను. లేకుంటే నన్ను చంపేసేవాడు. అలాగే నేను పట్టుపడకుండా పకడ్బందీగా చేస్తే మీరు నన్ను ఈ తాగుబోతు ద్వారా పట్టుకున్నారు. నేను హత్యాస్థలంలో ఒక్క ఆధారమూ వదల్లేదు" అని చెప్పి నొసలు నొక్కుకున్నాడు మున్నా.

★

అయ్యవారికి చాలు ఐదు వరహాలు...

పిల్లవాళ్లకు చాలు పిజ్జా, బర్గర్లు...

ఇదేమిటి దసరా పండగ పాటను మార్చి వేశారు. కల్కికాలం మహిమగాకపోతే అనుకుంటున్నారా? ఇది మన పాట కాదు. గతంలో మన దగ్గర 'బతకలేక బడిపంతులు' అనే రోజుల్లో దసరా సందర్భంగా పాడుకున్న పాటను ఇప్పుడు ఆఫ్రికాలోని జింబాబ్వే అనే దేశంలో ప్రతినెలా పాడుతున్నారు. అలా పాడటానికి వీల్లేదని అడ్డుపడుతున్న సర్కార్‌పై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఆశ్చర్యంగా ఉంది కదూ !!



పిల్లల తలిదండ్రులు టీచర్లకు ఎలాంటి ప్రోత్సహకాలూ ఇవ్వరాదని విద్యా మంత్రి దావీదు కోటార్ట్ అనే ఆయన సెలవిచ్చాడు. 'చాలు చాల్లేవయ్యా నువ్వు ఇచ్చే జీతం ఏ మూలకు వచ్చేను, మా పిల్లలకు నాలుగు అక్షరం ముక్కలు అబ్బాలంటే మా వూళ్లో టీచర్లు ఉండాలా లేదా? ఉండాలంటే మేం వారికి ఎంతో కొంత సమర్పించుకోక తప్పదు. అడ్డుపడటానికి మీరెవరంటూ' మంత్రి కార్యాలయం ముందు ధర్నా చేశారు. స్వచ్ఛందంగా ఎవరైనా ఇస్తే తీసుకోవచ్చు, నేను అలాంటి వారి గురించి కాదు, ప్రతినెలా మాకింత ఇవ్వాలని వత్తిడి చేసి తీసుకొనే వారి గురించి అని మంత్రిగారు సర్దుకోబోయారు.

అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ కనుసన్నలలో పాలన జరిగే జింబాబ్వేలో విద్యారంగాన్ని నిలబెట్టేందుకు ఒక నిధిని ఏర్పాటు చేశారు. మన రాష్ట్రంలో గనుక ప్రపంచం అప్పులిచ్చిందని ఆసుపత్రులు కట్టి వాటిలో వైద్యులు, సిబ్బంది, అవసరమైన పరికరాలను సమకూర్చకుండా ఉన్నట్లుగానే జింబాబ్వేలో ఆ నిధితో మూతపడిన పాఠశాలలను తెరిచారు. టీచర్లకు వేతనాలు ఇచ్చేందుకు సర్కార్ వద్ద డబ్బు లేదు. ఇచ్చే వేతనాలు టీచర్లకు ఏమాత్రమూ చాలటం లేదు. ఎవరూ పనిచేసేందుకు ముందుకు రావటం లేదు. ఉన్నవారు సమ్మెలు చేసినా, పాఠశాలలను నెలల తరబడి మూతవేసినా ఫలితం లేకపోయింది. రెండు విద్యా సంవత్సరాలు వృధా అయ్యాయి. ఏమాత్రమూ విలువలేని జింబాబ్వే కరెన్సీ తమకు వద్దని అమెరికన్ డాలర్ల రూపంలో వేతనాలు చెల్లించాలని టీచర్లు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే వేతనాలు చాలకపోవటంతో కొందరు టీచర్లు పిల్లలను ఎంతో కొంత డబ్బు తెమ్మని కోరటం ప్రారంభించారు. కాస్తో కూస్తో కలిగిన వారు ఇవ్వటం ప్రారంభించారు. ఇవ్వలేని వారు ఫిర్యాదులు చేశారు. చివరకు అది 'మా పిల్లల చదువులు మాకు ముఖ్యం' మీరు ఇవ్వరు మేం ఇస్తే వద్దంటారు అంటూ లొల్లికి దిగారు. ఇప్పుడు అమలు జరుగుతున్న ప్రపంచ బ్యాంకు షరతులను మనం చూస్తూ ఊరుకుంటే మనకు కూడా ఇలాంటి దిక్కుమాలిన పరిస్థితి రావటానికి ఎంతో సమయం పట్టదు మరి!

నిజం చెప్పే వారందరూ కమ్యూనిస్టులా ?

అనే అంటున్నారు అమెరికాలో రోకలి తలకు చుట్టమని కోరేవారు. అక్కడి స్కూలు విద్యార్థులకు బోధించటానికి ఉద్దేశించిన ఒక పుస్తకం పేరు 'నిజం చెబుతున్న అమెరికన్లు'. రాబర్ట్ షట్లర్లీ అనే రచయిత తన పుస్తకం గురించి చెబుతూ ప్రజాస్వామ్యాన్ని విజయవంతం చేసేందుకు పౌరులకు ఆదర్శంగా నిలిచిన అనేక మంది గురించి క్లుప్తంగా తాను వివరించినట్లు చెప్పారు. ఏడు, ఎనిమిది తరగతులవారికి దానిని తాను బోధిస్తున్నానని విద్యార్థులెంతో ఉత్సాహపడుతున్నారని ఒక టీచర్ పేర్కొన్నారు. ఆదర్శమూర్తుల గురించి చదివిన తరువాత హానికలిగింగ్ గనుల తవ్వకం, యుద్ధం, పురుగుమందులు, కార్పొరేషన్స్, భావప్రకటనా స్వేచ్ఛ, జాతిదురహంకారం గురించి అడుగుతున్నారని తెలిపారు. మన సమాజంలో ఎవరు నిజం చెబుతున్నారు, ఎవరు కాదు, ఎవరు పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారు, దారిద్ర్యానికి కారకులెవరు? అణచివేతకు పాల్పడున్నదెవరు, అమాయకులపై బాంబులు, తుపాకులను ప్రయోగిస్తున్నదెవరు వంటి అంశాలపై ఎవరు ఏం చెబుతున్నారో తెలుసుకోవాల్సిన అవసరం సమాజంలో అన్ని వయసుల వారికీ ఉందని కూడా ఆ టీచర్ పేర్కొన్నారు. అయితే ఆ పుస్తకంలో యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న సిండీ షహీన్, గాయకుడు పేట్ సీగర్ అనే కమ్యూనిస్టు ఉన్నారు. పాలస్తీనాలో ఒక ఫార్మసిస్ట్ ఇంటిని కూల్చివేసేందుకు ప్రయత్నించిన ఇజ్రాయెల్ సైనికులను అడ్డుకున్న జాత్యంహంకార వ్యతిరేక కార్యకర్త రాచెల్ కోరీ వంటి వారెందరినో పేర్కొన్నారు. వారితో పాటు నామ్ చోమ్‌స్కీ గురించి కూడా రాశారు. ఆయన నిర్మొహమాటంగా విమర్శలు చేస్తారని, వియత్నాం యుద్ధాన్ని వ్యతిరేకించారని పేర్కొన్నారు. ఆమీ గుడ్‌మాన్ అనే మహిళా జర్నలిస్టు కార్పొరేట్ కంపెనీల అక్రమాలను బయట పెడతారని రాశారు. ఇలా అనేక మంది గురించి ఉంది. అంతకు మించి వారి విప్లవభావాల గురించి, కార్యక్రమాల గురించి ఎలాంటి ప్రస్తావనా లేదు. అయితే నిజాలు చెప్పే వారందరూ కమ్యూనిస్టులు, అమెరికా వ్యతిరేకులు తప్ప మరొకరు కాదని మితవాదులు ఆ పుస్తకంపై ధ్వజమెత్తి విద్యార్థులకు దానిని బోధించరాదని వత్తిడి తెస్తున్నారు. కత్తి కంటే కలం గొప్పదని ఊరికే చెప్పలేదు. అమెరికన్ పాలకవర్గాలు నిజంగా ఆల్‌ఖైదా బిన్‌లాడెన్ గురించి కంటే నిజం చెప్పేవారంటేనే ఎక్కువగా భయపడుతోంది. ఆఫ్ఘనిస్తాన్‌లో తమ సైనికులకు తగులుతున్న ఎదురుదెబ్బలను దాచుకొనేందుకు మీడియాను తోడు చేసుకొని ఇటీవల అమెరికా మిలిటరీ అధికారులు హిమాలయమంత పెద్ద అబద్ధాన్ని అమెరికన్ల చేత నమ్మించేందుకు ప్రయత్నించారు. అదేమంటే తాలిబాన్లకు బలమైన 80వేల జనాభాగల మార్జా అనే పట్టణాన్ని అమెరికన్ సైనికులు స్వాధీనం చేసుకొని తాలిబాన్ల వెన్నువిరిచారని ఒక పెద్ద వార్తను వండి వార్చారు. అసలు విషయమేమంటే.....

అసలు అలాంటి పెద్ద పట్టణం అక్కడ లేనే లేదట! అవాక్కయ్యారా !!!

-సత్య

కొత్త పుస్తకాలు

పడమటి నీడ (కథలు),
రచయిత : హనీఫ్. పేజీలు : 88.
వెల : 50/-. ప్రతులకు : హనీఫ్,
డోర్.నెం. 159. రుద్రమ్‌పూర్ - 507119.
కొత్తగూడెం - ఖమ్మం.
సెల్ : 9247580946.

సామాన్యుల గుండె చప్పుళ్లు

పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆర్థిక సహాయంతో ఈ కథల సంపుటి ప్రచురణ అయింది. విజన్ 2020 షాఫ్ట్, గోస, డిపెండెంట్, పెంపుడు కాకులు, నసీమా, పడమటి నీడ, అగాధం, కూడికలు తీసివేతలు, మావూరికి చారెడు నేల కావాలి లాంటి తొమ్మిది కథలు కూడా గ్లోబలైజేషన్ నేపథ్యంలో జీవన వైరుధ్యాల గ్రామీణ జీవిత జీవన చిత్రణ చక్కగా రాశారు రచయిత. గ్లోబలైజేషన్ పరిణామాలను చక్కగా చెప్పారు. బొగ్గుగని కార్మికుల్లోంచి కథా రచయితలు రావడం ప్రశంసనీయమే. గుడిపాటి, తుమ్మేటి రఘోత్తమ రెడ్డి ముందుమాట రాశారు. గుడిపాటి గారు అన్నట్లుగా వ్యవహారిక భాషకన్నా మాండలికం వాడటం వల్లనే ఈ కథలు నిండుగా వున్నాయి. కథనంలోనూ, సంభాషణల్లోనూ ఒకటే రకమైన భాష వుంది.

అనారోగ్యం పాలై దళంలో వుండలేక ప్రభుత్వం ఇచ్చిన అవకాశం "జీవన స్రవంతి" లోకి వచ్చిన ప్రసాద్...భార్యతో పిల్లల కోసం విభేదించి అతని భార్య కృత్రిమ గర్భం పొందడం... బిడ్డ తండ్రి రాం ప్రసాద్‌కు చెప్పలేక ఇల్లు వదిలి పోవడం అనడం కంటే విడిపోవడం... ప్రసాద్ కూరగాయల వ్యాపారం చేయడం... స్థూలంగా ఇదీ కథ. అలా కాకుండా ఇద్దరూ అవగాహనతో కలిసి సంపాదించుకుంటూ... అనేక ప్రజా సంఘాలు సాధించే ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్నట్లు చూపిస్తే బాగుండేది. సాధారణ భార్యాభర్తలు... సాధారణ కుటుంబాల మనస్తత్వం గలవారుగా ప్రసాద్, నిహారికలు పాఠకులకు కనిపిస్తారు. పడమటి గాలి, పడమటి నీడ... వామపక్ష భావజాలం గల ఉద్యమ (దళ) కార్యకర్తల్ని వేరు చేస్తుంది అని చెప్పే కథగా 'పడమటి నీడ'ను బలంగా చెప్పే ప్రయత్నం చేశారు రచయిత. అగాధం కథ కూడా ఆలోచింపజేసేదే. రౌడీగా తిరిగే యాదగిరి, తాగుడు, మానభంగాలు చేస్తూ వుండే ఒక ప్రాంత నివాసి కల్లు కోసం గౌడ్ ఇంటికి పోవడం, కల్లు తాగడం... అతని భార్యను యాదగిరి అనుభవించడం అదే ధోరణిలో లంబాడోళ్ల తండ కమ్లిని కంది చేలో అనుభవించడం... ఆమె గర్భవతి కావడం... గౌడ్ ప్రతీకారం తీర్చుకుని యాదగిరిని చంపడం... గ్రామస్థులంతా యాదగిరిని తిట్టడం, తల్లి రోదనలు.. ప్రార్థనలు.. తన ఆత్మ సంచారం... ఇంతలోనే మెలకువ రావడం... ఇదంతా కల... చేసిన తప్పు దిద్దే రీతిగా యాదగిరి కమ్లిని తన ఇంటికి తెచ్చుకుందాం .... రా అమ్మా అని అనడం... మార్పు జీవితాన్ని యాదగిరి ఆహ్వానించడం కథాంశం. "విజన్ 2020 షాఫ్ట్" కథ బొగ్గు గని కార్మికుల కథ. చనిపోయిన కొడుకు స్థానంలో ఐలమ్మ కాంట్రాక్ట్ లేబర్‌గా పనిలో చేరి చీపురుతో ఊడుస్తోంది. ఆంధ్రజ్యోతిలో ప్రచురణైన కథ ఇది. అసంఘటిత కార్మికుల అవస్థలకు అద్దం పట్టే 'గోస' కథ కూడా ఆలోచింపచేసేది. 'డిపెండెంట్' కథలో ఐలమ్మ నాయకురాలిగా మారే వైనం చక్కగా చెప్పిన హనీఫ్ అభినందనీయులు. కథలన్నీ సామాన్యుల గుండె చప్పుళ్లే! అట్టడుగు అసంఘటిత కార్మికుల వ్యథల్ని పాఠకుల ముందు పెట్టారు.

- తంగిరాల చక్రవర్తి

శాస్త్ర సమాజ సంబంధాలపై పరిపూర్ణ విశ్లేషణ

జె.డి.బెర్నాల్ రచించిన సుప్రసిద్ధ గ్రంథాలు "సైన్స్ ఇన్ హిస్టరీ", "సోషల్ ఫంక్షన్స్ ఆఫ్ సైన్స్". ఇవి ప్రజాసైన్స్ ఉద్యమానికి ఉత్తేజాన్నిస్తాయి. ఈ గ్రంథం పూర్తి చేయటానికి ఆరుసంవత్సరాల కాలం పట్టింది. రచయిత కేవలం ఆవిష్కరణల పట్టికలు తయారుచేయలేదు. రాజకీయ, ఆర్థిక విషయాలకు సైన్స్ ఎలా తోడ్పడింది అనేదే కాదు. సైన్స్ సమాజంపైనా, సమాజంపైన సైన్స్ ప్రభావం గురించి మాత్రమే పరిశీలించలేదు. ఆయన సైన్స్‌కు చరిత్రకు మధ్యగల అవినాభావసంబంధాన్ని పరిశీలించాడు. మానవ ఆలోచనల్లో మార్పులు ఎలా వచ్చాయి? వాటిపై సైన్స్ ప్రభావం ఏమిటి అని చర్చించాడు. మానవుడు తన జీవితం కోసం చేసే శ్రమలో సైన్స్ పుట్టింది. తన మనుగడకోసం చేసే పోరాటంలో సైన్స్ అభివృద్ధి చెందింది. బెర్నాల్, మానవసమాజ ఆచరణ, క్రియాశీల ఆలోచనలన్నిటిలో సైన్స్ ప్రధానభాగంగా ఉందన్నాడు. సైన్స్ అభివృద్ధిలో వివిధ దశలను వివరించాడు.

బెర్నాల్ ఈ గ్రంథంలో గతం నుండి నేర్చుకున్న పాఠాలను ఒక క్రమంలో పెట్టడానికి ప్రయత్నించాడు. పాలకవర్గాల ఆలోచనపైనా, లేదా పాలకవర్గాలను ప్రతిఘటించాలనే వారిపైన సైన్స్ తీవ్రభావం చూపింది. రాజనీతిజ్ఞులు, మతగురువులూ ఆయా సమాజాల ప్రభావానికి లోనయ్యారు. ఈ వివరాలన్నీ ఆయన సమగ్రంగా ఇవ్వటానికి ప్రయత్నించాడు. మొదటి అధ్యాయంలో సైన్స్ లక్షణపద్ధతి, సమాజంలో దాని స్థానంపై చర్చ చేశాడు. మానవ సమాజావిర్భావం నుండి 20వ శతాబ్దం వరకు ఉన్న చరిత్ర పరిధిని వివరించాడు. పూర్వీకుల గ్రీకు సాంప్రదాయం సామాజిక ఆచారాల నుండి ఆవిర్భవించిన సైన్స్, గ్రీకుల చేతుల్లో సంపూర్ణ రూపాన్ని పొందేవరకు వివరించాడు. మూడో భాగంలో మధ్య యుగాల చివరి వరకు, ఇస్లాం, క్రైస్తవ ప్రభావాలను వివరించాడు. నాలుగోభాగంలో విప్లవాత్మక పునర్వికాసకాలం, ఆధునిక సైన్స్ ఆవిర్భావం గురించి వివరించాడు. ప్రముఖ శాస్త్రవేత్తలు, సైన్స్ ఉద్యమ నాయకులు ఎం.పి.పరమేశ్వరన్, ప్రొ॥ డి.బాలసుబ్రమణియన్‌లు తెలుగు అనువాదానికి ముందుమాట రాశారు. చెకుముకి, గొడ్డలి నుండి ఉదజని విస్ఫోటనం వరకు బెర్నాల్ చేసిన సైన్స్, సమాజాల పరస్పర సంబంధాలపై పరిపూర్ణమైన విశ్లేషణ చేశాడు. బెర్నాల్‌కు గల విస్తృత చారిత్రక అవగాహన మనలను ఆలోచింపజేస్తుంది. ఆసాంతం చదివేటట్టు చేస్తుంది. సైన్స్ ఇన్ హిస్టరీని "ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్" వారు బెర్నాల్ ఎస్టేట్ నుండి అనుమతి తీసుకుని ప్రచురించారు. ఎఐఎస్ఎన్‌డబ్ల్యు సహకారంతో భారతీయ భాషల్లో అనువాదానికి ప్రయత్నాలు ప్రారంభమైనాయి.

దీన్ని ఖమ్మం జిల్లాశాఖ జనవిజ్ఞానవేదిక "చరిత్రలో సైన్స్"అనే పేరుతో మన ముందుకు తీసుకువచ్చారు. ఈ గ్రంథాన్ని పొట్లూరి వెంకటేశ్వరరావు అత్యంత శ్రమదీక్షలతో బెర్నాల్ వెలుగుల్ని తెలుగు వారికి అందించేందుకు వయోభారాన్ని కూడా లెక్కచేయకుండా కృషి చేశాడు. ఆయనకు తెలుగు ప్రజ రుణపడి ఉంటుంది. తెలుగులో నాలుగు సంపుటాలుగా విడుదలైన ఈ గ్రంథాల మొత్తం పేజీలు 1134 వుంది. వెల 500/-రు.లు 20శాతం తగ్గించి ఇస్తున్నారు. కొరియర్/విపిపి ఖర్చులు అదనం. ఫోన్ నెం: 9441212069, 9440849493.

- అంకిత రవి



హిమగిరి సొగసులు

ముంబాయికి చెందిన మైల్‌స్టోన్ గ్యాలరియా ఫొటోగ్రాఫర్లను ప్రోత్సహించే ఆదర్శవంతమైన సంస్థ. వీరు ఏటా భారత దేశంలోని ఔత్సాహిక, వృత్తి ఫోటోగ్రాఫర్లను ఎంపిక చేసి ఫొటో పర్యటనలను నిర్వహిస్తుంటారు. వారు తీసిన ఫొటోలలో ఉత్తమమైన వాటిని ముంబాయి, హైదరాబాదు తదితర నగరాలలో ప్రదర్శిస్తుంటారు. ఆ ప్రదర్శనలలో విక్రయాల ద్వారా లభించిన మొత్తాలను సామాజిక సేవకు ఆ సంస్థ వెచ్చిస్తుంటుంది. ఈ ఫొటో పర్యటనలు భారత దేశం అంతటా జరుగుతాయి. ఫొటోగ్రఫీ కళలో నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఎంతో అవకాశం ఉన్న హిమాలయాల ప్రాంతాలకే ఈ పర్యటనలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ విధంగా 2008-09లో సిక్కిం ప్రాంతంలో హిమాలయాల సొగసులను ఆవిష్కరించడానికి 12 మంది ఫొటోగ్రాఫర్లు చేసిన ప్రయత్న ఫలితమే ఇటీవల హైదరాబాదు, ఐకాన్ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించిన ఫొటో షో. ఈ బృందంలో హైదరాబాదుకు చెందిన సత్యప్రసాద్ యాచేంద్ర, శ్రీకాంత్ నిప్పట్ల, సునీత తుమ్మలపల్లి లాంటి ఐదుగురు ఉన్నారు. స్వయంగా హిమాలయాలను దర్శించిన పర్యాటకులకు సైతం కనిపించని అరుదైన, అపురూపమైన దృశ్యాలను వీరంతా ఎన్నో కష్ట, నష్టాలకోర్చి తమ కెమెరాలలో బంధించి దేశవ్యాపితంగా ప్రేక్షకుల ముందుంచారు. అందమైన రంగు రంగుల పెయింటింగ్‌లను తలపించే ఈ ఫొటోలను తీయడానికి వారెంత శ్రమించారో మనం వూహించుకోవలసిందే. ప్రదర్శన 2010 మార్చి 12 నుండి 15 వరకు సాగింది.

- విజయరావు

చిలుక సలహా



ఒకానొక వర్తకుని దగ్గర ఒక చిలుక వుండేది. అదంటే ఆయనకు ప్రాణం. దాన్ని ఒక వెండి పంజరంలో పెట్టి, దానికి రకరకాల పండ్లు, కాయలు పెట్టేవాడు. అంతేకాదు! చిలుక కోరిన వెంటనే దేన్నయినా తెప్పించేవాడు. ఆ చిలుక చాలా తెలివిగలది. ఆయనతో అది గంటలకొద్దీ సంభాషించేది.

కానీ చిలుకకు ఆ పంజరంలో వుండడం అస్సలు ఇష్టంలేదు. స్వేచ్ఛగా బతకాలని కోరుకునేది. తనను పంజరంలో నుంచి తీసి స్వేచ్ఛగా వుండనివ్వమని ఆ వ్యాపారిని ఎన్నోసార్లు వేడుకునేది. అది ఎన్నోసార్లు ఎంత జాలిగా అడిగినా ఆ వర్తకుడు

"అది తప్ప వేరే ఏదన్నా అడుగు" అనేవాడు.

అలా వుండగా ఒకనాడు చిలుక అతనితో

"నాకుగానీ స్వేచ్ఛనిస్తే నీకు మూడు సలహాలు ఇస్తా. అవి నీకు జీవితంలో ఎంతో ఉపయోగ పడతాయి" అంది.

ఈ వర్తకునికి చిలుకంటే ఇష్టమే కానీ డబ్బంటే మరీ ఇష్టం. "ఇది ఇచ్చే సలహాలు నాకు అంతులేని ఐశ్వర్యం తెచ్చిపెడతాయేమో. అలాంటప్పుడు దాన్ని స్వేచ్ఛగా వదిలిపెడితే ఏం?" అని మనసులో అనుకుని, పంజరం తలుపు తెరిచాడు.

ఆ చిలుక రివ్వున ఆయన చేతిమీద వాలి

"నీకు ఇచ్చిన మాట ప్రకారం మూడు సలహాలు చెప్తా. అందులో మొదటిది 'పోయిన సంపద గురించి ఎప్పుడూ విచారించకూడదు' అంది.

'అది మంచి సలహా ఏంకాదు' అని మనసులో అనుకున్నాడు వర్తకుడు. కానీ పైకి ఏమీ అనలేదు.

చిలుక ఇంటి కప్పు మీద వాలి

'నీకు చెప్పిందంతా నిజమని ఎప్పుడూ నమ్మకు. ఇది నా రెండవ సలహా' అంది.

దానికి వర్తకుడు కోపంగా 'నాకు తెలియంది ఏదైనా చెప్పు' అన్నాడు.

'నా పొట్టలో రెండు అమూల్యమైన రత్నాలున్నాయన్న సంగతి నీకు తెలియదు' అంది చిలుక.

"ఆఁ రెండు అమూల్య రత్నాలా? నిన్ను స్వేచ్ఛగా వదిలిన నేనెంత మూర్ఖుణ్ణి! అలా చేసినందుకు నా జీవితమంతా బాధపడుతూనే ఉంటా" అన్నాడు వర్తకుడు బాధగా.

అందుకా చిలుక కిలకిలా నవ్వి "నా మూడవ సలహా వినాలని లేదా?" అంది.

"చెప్పు" అన్నాడు కోపంగా వర్తకుడు.

"పోయిన దాన్ని గురించి దుఃఖించొద్దని నీకు సలహా ఇచ్చాను. కానీ నన్ను పోగొట్టుకున్నందుకు నువ్వు దుఃఖపడుతున్నావు. అలాగే నువ్వు విన్నదంతా నమ్మకు. అని చెప్పాను. కానీ నా కడుపులో రెండు అమూల్య రత్నాలున్నాయిని చెప్పగానే వెంటనే నమ్మావు. ఒక వేళ నా కడుపులో నిజంగా రెండు రత్నాలే వుంటే నేను ఎట్లా బతికి వుండగలుగుతాను? ఇక నా మూడవ సలహా ఏమిటంటే... విను... అయితే చెవులతో కాకుండా మనసుతో వినటం నేర్చుకో అంటూ రివ్వున ఎగిరిపోయింది.

వర్తకుడు తెల్లమొహం వేసుకుని అది వెళ్లిన వైపే అలా చూస్తూ వుండిపోయాడు.

- మేకల మదన్‌మోహన్‌రావు